www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 44

శుక్రవారం | 30-5-2025 | పేజీలు: 14

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం, తిథి: చవితి రా.9.23 తదుపరి పంచమి; నక్షత్రం: పునర్వసు రా.9.29 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ.10.04-11.35, తె.5.21 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, మ.12.38-1.30, అమృతఘడియలు: రా.7.12-8.43, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.41

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఉత్తమ నటుడు అల్లు అర్జున్

- ఉత్తమ నటి నివేదా థామస్.. ఉత్తమ చిత్రం కల్కి 2898 ఏడీ
- 2024కుగాను రాష్ట్ర ప్రభుత్వం అందించే గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రకటన
- వివరాలు వెల్లడించిన జ్యూరీ చైర్‌పర్సన్, సీనియర్ నటి జయసుధ
- తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి సినీ పురస్కారాల సందడి
- లక్కీ భాస్కర్ చిత్రానికి 4.. రజాకార్ చిత్రానికి 3 గద్దర్ అవార్డులు



(ఆంధ్రజ్యోతి-సినిమా డెస్క్)

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సినీ పురస్కారాల సందడి మొదలైంది. 2024 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు'లను జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ ప్రకటించారు. సమాచార భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి ఆమె అవార్డుల వివరాలు వెల్లడించారు. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ (పుష్ప-2).. ఉత్తమ చిత్రంగా 'కల్కి 2898 ఏడీ', ఉత్తమ ద్వితీయ చిత్రంగా 'పొట్టేల్', ఉత్తమ తృతీయ

మిగతా 12వ పేజీలో...


ఉత్తమ దర్శకుడు నాగ్ అశ్విన్


ఉత్తమ బాలల చిత్రం

బీఆర్‌ఎస్‌ను బీజేపీలో కలిపే ప్లాన్

నేను జైల్లో ఉన్నప్పుడే ఈ ప్రతిపాదన.. అడ్డుకుంటాననే కేసీఆర్‌కు దూరం చేసే కుట్ర


సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ కవిత

- ఇంటి ఆడబిడ్డపై సోషల్ మీడియాలో విషప్రచారాలు
- బీజేపీ నేతల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వెళ్లిందెవరు?
- కేసీఆర్‌లాగే నాక్కొంచెం తిక్క.. నోరు తెరిస్తే తట్టుకోలేరు
- పార్టీ ఫోరంలో ఏముంది? ప్రజల మధ్యే మాట్లాడతా
- కేసీఆర్‌కు నోటీసులిచ్చినా స్పందించకపోవడమేంటి?
- ఇతరులకు నోటీసులిస్తే మాత్రం హంగామా ఎందుకు?
- ముఖ్య నాయకులు ట్వీట్లకే పరిమితమైతే ఎలా?
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేయాల్సిన పనులు చేయాలిగా?
- విదేశాల్లో రజతోత్సవ వేడుకలతో లాభమేంటి?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తగిన విధంగా స్పందించడంలేదు
- పార్టీ పోరాటాలు జాగృతి చేయాల్సి వస్తోంది
- పార్టీ ఎమ్మెల్యేలు, వెంట ఉన్నవారే ఎంపీగా ఓడించారు
- కేసీఆరే నా నాయకుడు.. ఇతరుల కింద పనిచేయను
- కాంగ్రెస్ మునిగిపోయే పడవ.. అందులో చేరతానా?
- మీడియాతో చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రయత్నం జరుగుతోందని, తాను పార్టీలో ఉన్నంతకాలం అది కుదరదన్న ఉద్దేశంతో తనను కేసీఆర్‌కు దూరం చేసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఇంటి ఆడబిడ్డనైన తనపై పెయిడ్ సోషల్ మీడియాలో విషప్రచారం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఇబ్బంది పెడితే ఊరుకోబోనని, తాను నోరు విప్పితే తట్టుకోలేరని హెచ్చరించారు. కేసీఆర్‌కు నోటీసులిస్తే పార్టీ స్పందించలేదని, కానీ.. ఇతరులకు నోటీసులొస్తే మాత్రం హంగామా చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను కాంగ్రెస్‌లో చేరతానన్నది అబద్ధమని చెప్పారు. కొత్త పార్టీ అవసరం తనకు లేదని, ఉన్న పార్టీని

మిగతా 14వ పేజీలో...

పెద్ద ప్యాకేజీ ఇస్తే మావాళ్లు బీఆర్‌ఎస్‌లో కలుస్తారు

- విలీనంపై కవిత మాటలు నిజమే: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్
- బీజేపీ కుట్రలు, కుతంత్రాలు చేయదు: ఈటల రాజేందర్
- కేటీఆర్‌ను బీజేపీలోకి రానివ్వం: ఎంపీ కొండా 14

కవితలో ఇంత ఆవేదన ఉందని ఇవాళే తెలిసింది: వినోద్‌కుమార్

కారులో భారీ కుదుపు!

- స్వరం పెంచిన కేసీఆర్ తనయ
- ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్, సంతోష్ లక్ష్యంగా పరోక్ష విమర్శ
- సంక్షోభం దిశగా బీఆర్‌ఎస్ 14


జై హింద్ ర్యాలీలో సీఎం రేవంత్, మంత్రులు, పీసీసీ చీఫ్

ట్రంప్ చెప్తే యుద్ధం ఆపుతావా?

- అఖిల పక్షాన్ని ఎందుకు పిలవలేదు?
- భారతీయుల ఆత్మగౌరవం ట్రంప్ దగ్గర తాకట్టు
- హైదరాబాద్ తయారీ క్షిపణులే దేశ గౌరవాన్ని నిలిపాయి
- మోదీ ఇతర దేశాల్లో కొన్న రాఫెల్స్‌ను పాక్ కూల్చేసింది
- ఎన్నికల లబ్ధి కోసమే తిరంగా ర్యాలీ.. మోదీ చెల్లని నాణెం
- జైహింద్ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు

హైదరాబాద్ సిటీ/జీడిమెట్ల మే 29 (ఆంధ్రజ్యోతి): "యుద్ధం చేయాలంటూ వీర తిలకం దిద్దితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పాడని యుద్ధం విరమించడం.. బుద్ధిమంతుడికి సద్ది కడితే బొడ్రాయి కాడ భోంచేసి బొర్లబొక్కల పడుకున్న చందంగా ఉంది" అని ప్రధాని మోదీని ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. "మోదీ కాలం చెల్లిన నాణెం.. రద్దయిపోయిన వెయ్యి రూపాయల నోటు లాంటోడు. ఆయన వల్ల దేశ గౌరవం నిలబడదు. ఆయన ఈ దేశాన్ని యుద్ధంలో గెలిపించడు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే ఓవైపు పాక్‌ను మరోవైపు చైనాను ఓడించి ప్రపంచ దేశాల ముందు భారత్‌ను నిలబెడతారు" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధమైనా.. దేశభద్రత అయినా బీజేపీకి రాజకీయమేనని ఆరోపించిన సీఎం.. ఎన్నికల లబ్ధి కోసమే మోదీ తిరంగా ర్యాలీ పేరుతో

మిగతా 13వ పేజీలో...

జూలైలోనే 'స్థానిక' సమరం!

- ఎన్నికలకు రంగం సిద్ధం
- జూన్ చివర్లో నోటిఫికేషన్!
- ఆగస్టు రెండో వారం నాటికి ప్రక్రియ పూర్తికి యోచన 13

ట్రంప్ సుంకాలకు బ్రేక్..!



- ఆయన అధికారాలను అతిక్రమించారు
- మనకు విక్రయించే వాటిపై సుంకాల మోత మోగించారు
- అమెరికా వాణిజ్య కోర్టు.. సుంకాలను నిలిపివేస్తూ తీర్పు
- సుంకాల వల్లే భారత్-పాక్ కాల్పుల విరమణ
- చైనా కూడా దిగొచ్చే అవకాశముంది.. అధ్యక్షుడి వాదనలు
- కొట్టేసిన కోర్టు.. న్యాయం గాడితప్పింది: ట్రంప్ సలహాదారు
- ఆ చర్చ రాలే.. ట్రంప్ వాదనను వ్యతిరేకిస్తున్నాం: భారత్

వాషింగ్టన్, మే 29: ట్రంప్‌కు అమెరికా వాణిజ్య కోర్టులో భారీ ఎదురు దెబ్బ తగిలింది. 'లిబరేషన్ డే' పేరుతో ప్రపంచ దేశాలపై విధిస్తున్న సుంకాలను నిలుపుదల చేస్తూ మాన్‌హట్టన్‌లోని అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల కోర్టు తీర్పు వెలువరించింది. ఎడాపెడా దిగుమతి సుంకాలను విధించడం ద్వారా అధ్యక్షుడు తన అధికారాలను అతిక్రమించారని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. అమెరికా నుంచి ఇతర దేశాలు కొనుగోలు చేసే వాటికన్నా.. మనకు విక్రయించే వాటిపైనే సుంకాల మోత మోగించారని ధర్మాసనం


మిగతా 2వ పేజీలో...

ముగిసిన ట్రంప్-మస్క్ బంధం

- 'దోజ్' నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించిన ఎలాన్ మస్క్ 2
- ట్రంప్ బిల్లుపై వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే వైదొలగిన వైనం

మేం దాడి చేసేలోపే.. బ్రహ్మోస్‌తో కొట్టారు

- మే 10న తెల్లవారుజామున భారత్‌పై దాడికి సిద్ధమయ్యాం
- తొమ్మిదో తేదీ రాత్రే వ్యూహ రచన చేశాం
- మాకన్నా ముందే భారత్ క్షిపణులతో విరుచుకుపడింది
- మా వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి
- భారత్ దాడులపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలు
- శాంతి చర్చలకు ముందుకు రావాలని భారత్‌కు పిలుపు



న్యూఢిల్లీ, మే 29: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ చేసిన దాడులతో తమ వైమానిక స్థావరాలకు జరిగిన నష్టంపై పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ నోరువిప్పారు. పాక్ సైన్యం మేల్కొనేలోపే బ్రహ్మోస్ క్షిపణులతో భారత్ విధ్వంసం సృష్టించిందని వెల్లడించారు. తాము దాడి చేసే లోపే భారత్ బ్రహ్మోస్ ప్రయోగించి

మిగతా 2వ పేజీలో...

ఉగ్రవాదంపై చర్యలు తీసుకునేదాకా చర్చల్లేవ్

- పీవోకేని ఖాళీ చేసి, ఉగ్రవాదులను అప్పగించాల్సిందే
- నీళ్లు, రక్తం కలిసి ప్రవహించవు
- మా షరతుల్లో మార్పు లేదు 2
- శాంతి చర్చలపై భారత్ స్పష్టీకరణ


సీఐఐ సదస్సులో రాజ్‌నాథ్, నేవీ, ఐఏఎఫ్ చీఫ్‌లు దినేశ్, అమర్‌ప్రీత్

సంతకాలు అవుతాయి.. ఆయుధాలు రావు

- ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టు కూడా సకాలంలో పూర్తికాలేదు
- 2024 మార్చిలో అందాల్సిన తేజస్ విమానాలు ఒక్కటీ రాలేదు
- దేనికైనా కట్టుబడితే గడువులోగా అందించాలి
- సీఐఐ వార్షిక సదస్సులో వాయుసేన చీఫ్ అమర్‌ప్రీత్ సింగ్
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలోనే వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 29: ఆయుధాలు, ఆయుధ వ్యవస్థల ఉత్పత్తిలో మన దేశ సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ విమర్శించారు. ఆయుధాల సరఫరా కోసం కాంట్రాక్టుల మీద సంతకాలైతే చేస్తున్నారు కానీ, సరఫరా మాత్రం జరగదని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టు కూడా అనుకున్న సమయంలో పూర్తికాలేదని, సమయానికి ఇవ్వలేనప్పుడు

మిగతా 2వ పేజీలో...

పీవోకే తిరిగొస్తుంది

- ఆ రోజెంతో దూరం లేదు
- అక్కడి ప్రజలకు భారత్‌తో అనుబంధం ఉంది
- పాక్‌తో ఎప్పుడు చర్చలు జరిపినా ఉగ్రవాదం, పీవోకేనే కీలకం 2
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్

ఆర్థిక ఉగ్రవాదులను ఏరేస్తాం

- ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో పనిచేస్తాం
- వారిని రాజకీయాల్లో లేకుండా చేస్తాం
- వై నాట్‌లు.. గొడ్డలిపోట్లు మన రాజకీయం కాదు
- పాలన ఎలా ఉండాలనేందుకు టీడీపీ కేస్‌స్టడీ
- ప్రజా తీర్పు వైసీపీకి ఇంకా అర్థం కాలేదు
- మహానాడు ముగింపు సభలో ఏపీ సీఎం చంద్రబాబు


మహానాడు వేదికపై పార్టీ కార్యకర్తతో చంద్రబాబు విజయ సంకేతం

అమరావతి, మే 29 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను ఏరిపారేసిన 'ఆపరేషన్ సిందూర్' స్ఫూర్తితో.. ఆంధ్రప్రదేశ్‌లో ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్‌కు నాంది పలుకుతామని, ఆర్థిక ఉగ్రవాదులను తుడిచిపెడతామని ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. "వై నాట్లు.. గొడ్డలిపోట్లు.. మన రాజకీయం కాదు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా భావించి ప్రజాసేవ చేస్తున్నాం. ఏడాదిగా మన పాలన

మిగతా 3వ పేజీలో...

మూడు రోజుల్లో భారత్‌కు రావాలి

- ట్యాపింగ్ కేసు దర్యాప్తునకు సహకరించాలి
- కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలి
- ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టు ఆదేశాలు
- బలవంతపు చర్యలొద్దని సర్కారుకు సూచన.. ఆగస్టు 5న తదుపరి విచారణ 12

యూట్యూబర్ సన్నీ యాదవ్ అరెస్ట్ 2

- చెన్నైలో అదుపులోకి తీసుకున్న ఎన్‌ఐఏ
- బైక్‌పై అంతర్జాతీయ యాత్రలతో గుర్తింపు
- బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌తో నోటీసులు
- హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేక దుబాయ్‌కి, అటు నుంచి పాకిస్థాన్‌కు సన్నీ!

జూరాలకు వరద పోటు

- ప్రాజెక్టుకు భారీగా చేరుతున్న వరద
- నేటి ఉదయానికి లక్ష క్యూసెక్కులు
- దిగువకు 83 వేల క్యూసెక్కుల నీరు

మరో 4 రోజులు వర్షాలే! 3

- 2 దాకా రాష్ట్రానికి ఎల్లో అలెర్ట్
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

పదోవంతు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు సున్నా

- ఒక్కరూ చేరని కాలేజీలు 74
- 60,436 మందికి ప్రవేశాలు ఖరారు 12
- కామర్స్ కోర్సుల వైపు 36% మంది
- దోస్త్ తొలి విడత జాబితా విడుదల
- నేటి నుంచి రెండో విడత దరఖాస్తులు

భవనం పైనుంచి దూకి బీఆర్‌ఎస్ నేత ఆత్మహత్య

- మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ దంపతుల వేధింపులే కారణమంటూ బోరబండలో బంధువుల ఆందోళన
- ఇంటి ఆధునికీకరణ పనులు చేస్తుంటే డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణ
- ఫసియుద్దీన్, ఆయన భార్య, పీఏపై కేసు

పీఓకే తిరిగొస్తుంది: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, మే 29: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) త్వరలోనే తిరిగొస్తుందని, తాను భారత్‌లో అంతర్భాగమని ప్రకటించుకుంటుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పీఓకే ప్రజలు భారత కుటుంబంలో భాగమని, వారు తామంతట తాము భారత్‌వైపు వచ్చే రోజు ఎంతో దూరంలో లేదని చెప్పారు. గురువారం సీఐఐ వార్షిక సదస్సులో రాజ్‌నాథ్ ప్రసంగించారు. "ఒకే భారత్.. శ్రేష్ఠ భారత్ విజన్‌కు కట్టుబడి ఉన్నాం. భౌగోళికంగా, రాజకీయంగా విడిపోయినవారు ఏదో ఒకరోజు ఆత్మగౌరవంతో తిరిగి దేశంలో కలుస్తారని నమ్ముతున్నాను. విడిపోయి ఉన్నా అక్కడి ప్రజలకు భారత్‌తో బలమైన సాంస్కృతిక, మానసిక అనుబంధం ఉంది. అక్కడి వారిలో ఎవరో కొందరు తప్పుదారిపట్టి ఉండవచ్చు. భారత్ ది ఎప్పుడూ ఏకత్వం, నమ్మకం, ప్రేమమయమైన మార్గమే. పీఓకే ఏదో ఒకరోజు.. 'నేను భారత్. నేను తిరిగొచ్చాను' అని ప్రకటిస్తుందని ఆశిస్తున్నా" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో ఎప్పుడు చర్చలు జరిగినా ఉగ్రవాదం నిర్మూలన, పీఓకేను తిరిగి అప్పగించడమనే రెండు అంశాలే కీలకమని చెప్పారు.

పాక్ ర్యాలీలో 'పహల్గాం' సూత్రధారి

» బహిరంగ వేదికపై లష్కరే కమాండర్ సైఫుల్లా



న్యూఢిల్లీ, మే 29: పహల్గాం దాడి వెనుక కీలక సూత్రధారిగా అనుమానిస్తున్న ఉగ్ర సంస్థ లష్కరే తాయిబా కమాండర్ సైఫుల్లా కసూరీ మరోసారి బహిరంగ వేదికపై కనిపించాడు. అది కూడా పాకిస్థాన్ రాజకీయ నేతలు, పలువురు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు పాల్గొన్న ఒక ర్యాలీలో వారితో కలిసి వేదిక పంచుకున్నాడు. పాక్ అణుపరీక్షల వార్షికోత్సవం సందర్భంగా పాకిస్థాన్ మర్కాజీ ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో వీరంతా ఒక్కచోట చేరారు. ఈ సందర్భంగా రెచ్చగొట్టే ప్రసంగాలు, భారత వ్యతిరేక నినాదాలు చేశారు. ర్యాలీల్లో పాల్గొన్న వాళ్లలో లష్కరే వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్ కుమారుడు, భారత్ ఉగ్రవాదిగా ముద్ర వేసిన తల్హా సయీద్ కూడా పాల్గొన్నాడు.

ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులూ పైలట్ కావొచ్చు!

» పౌర విమానయాన శాఖకు డీజీసీఏ ప్రతిపాదన

న్యూఢిల్లీ, మే 29: సైన్స్ మ్యాథ్స్ చదివిన విద్యార్థులే పైలట్ శిక్షణకు అర్హులన్న నిబంధనకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్వస్తి పలకబోతోంది. ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులు కూడా పైలట్ శిక్షణ తీసుకోవచ్చని కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతమున్న నిబంధనల మేరకు.. 12వ తరగతి/ఇంటర్మీడియెట్‌లో ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులు చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులే కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) శిక్షణకు అర్హులుగా ఉన్నారు. దీంతో మిగతా స్ట్రీమ్‌ల విద్యార్థులు ఓపెన్ స్కూల్స్/ఇంటర్ ద్వారా ఆయా సబ్జెక్టులు చదివి శిక్షణ కోసం వచ్చేవారు. అయితే తాజాగా దీన్ని సవరించి మిగతా స్ట్రీమ్‌ల వారికి అవకాశం కల్పించాలనే ప్రతిపాదనను డీజీసీఏ కేంద్ర పౌర విమానయాన శాఖకు పంపింది. ఆ శాఖ ఆమోదం తర్వాత న్యాయ శాఖకు ఆమోదానికి ఆ ఫైలు వెళ్లనుంది. అనంతరం కొత్త నిబంధన అమల్లోకి రానుంది.

కేంద్ర డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌గా నెల్లూరు వాసి భానుప్రకాశ్ నియామకం

'ఆంధ్రజ్యోతి' విలేకరి నుంచి 2003లోనే ఐఏఎస్‌కు..



న్యూఢిల్లీ/నెల్లూరు, మే 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌గా రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన తెలుగు అధికారి భానుప్రకాశ్ ఏటూరి నియమితులయ్యారు. ఆయన అయిదేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. గతంలో ఆయన ఆంధ్రప్రదేశ్‌లో గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఐటీ విభాగం సెక్రటరీగా వ్యవహరించారు. ఏపీలోని నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇందుకూరుకు చెందిన భానుప్రకాశ్‌ది 2003 ఐఏఎస్ బ్యాచ్. అంతకుముందు ఆయన 'ఆంధ్రజ్యోతి' పత్రికకు అల్లూరు విలేకరిగా పని చేస్తుండేవారు. జర్నలిజంలో కొనసాగుతూనే ఐఏఎస్ చేసి రాజస్థాన్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. ఆ రాష్ట్రంలో పలు కీలకపోస్టుల్లో పని చేశారు.

కొవిడ్ బెడ్లు ఖాళీ లేకుంటే.. ఆ పేషెంట్‌ని చంపెయ్

» మహారాష్ట్రలోని లాతూర్‌లో తోటి వైద్యుడికి సర్జన్ సలహా

» 2021 నాటి ఆడియో.. మే 2 నుంచి వైరల్

లాతూర్, మే 29: 'బెడ్లు ఖాళీ లేకుంటే ఆ పేషెంట్‌ను చంపెయ్' అంటూ ఒక వైద్యుడు మరో వైద్యుడికి సలహా ఇచ్చాడు!! 2021లో కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో.. మహారాష్ట్రలోని లాతూర్‌లో జరిగిందీ ఘటన. లాతూర్‌కు చెందిన కౌసర్ ఫాతిమా అనే మహిళ కొవిడ్ బారిన పడడంతో.. ఆమె భర్త దయామీ అజీమొద్దీన్ గౌసుద్దీన్ ఆమెను 2021 ఏప్రిల్ 15న ఉద్గిర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ కొవిడ్ పేషెంట్లకు డాక్టర్ శశికాంత్ డాంగే వైద్యం చేశారు. ఆ ఆస్పత్రిలో ఆమె పదిరోజులపాటు చికిత్స చేయించుకుని డిశ్చార్జ్ అయ్యారు. అయితే.. ఏదో రోజున కౌసర్ ఫాతిమా భర్త దయామీ డాక్టర్ శశికాంత్ డాంగే వద్ద ఉన్న సమయంలో.. డాక్టర్ డాంగేకు సీనియర్ సర్జన్ డాక్టర్ శశికాంత్ దేశ్‌పాండే నుంచి ఫోన్ వచ్చింది. ఆ సమయంలో డాక్టర్ డాంగే భోజనం చేస్తుండడంతో.. ఫోన్‌ను స్పీకర్‌లో పెట్టి మాట్లాడారని, దీంతో వారి మాటల్లో కొన్ని తనకు కొంత అస్పష్టంగా వినిపించాయని ఫాతిమా భర్త దయామీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ప్రకారం.. ఆస్పత్రిలో పడకలు ఏవైనా ఖాళీగా ఉన్నాయా అని ప్రశ్నించారు. దీనికా డాక్టర్ డాంగే.. ఖాళీ పడకలేవీ లేవని బదులిచ్చారు. అప్పుడు దేశ్‌పాండే.. "ఎవర్నీ లోపలికి రానివ్వొద్దు (చేర్చుకోవద్దు). ఆ దయామీ పేషెంట్‌ని చంపెయ్" అన్నట్టుగా తనకు వినపడిందని దయామీ తన ఫిర్యాదులో వివరించారు. దీనికి డాక్టర్ డాంగే.. అప్పటికే ఆక్సిజన్ సపోర్టు తగ్గించినట్టు సమాధానమిచ్చారని తెలిపారు. ఇప్పుడు ఆ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. తనను నాడు ఎంతగానో కలచివేసిన ఆ వ్యాఖ్యలు మళ్లీ విని బాధపడ్డానని, తన మతపరమైన మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులో వెల్లడించారు. ఆయన ఫిర్యాదు మేరకు ఉద్గిర్ నగర పోలీసులు మే 24న డాక్టర్ దేశ్‌పాండేపై కేసు నమోదు చేశారు. వైరల్ అవుతున్న ఆడియో క్లిప్‌లో ఉన్నది ఆయన స్వరమేనా అని నిర్ధారించుకునే పనిలో ఉన్నామని పోలీసులు తెలిపారు.

సంతకాలు అవుతాయి.. ఆయుధాలు రావు

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు వాగ్దానాలు చేయాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా 'నేను ఒక్కసారి కమిటైతే.. నా మాట నేనే వినను' అనే సినిమా డైలాగ్‌ను గుర్తు చేశారు. దేనికైనా కట్టుబడితే గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. దేశీయంగా రక్షణ వ్యవస్థల ఉత్పత్తిని పెంచడానికి, మేకిన్ ఇండియా కోసం వాయుసేన కృషి చేస్తోందని చెప్పారు. సీఐఐ వార్షిక సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సమక్షంలోనే అమర్‌ప్రీత్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "రక్షణ పరికరాలు, ఆయుధాల సరఫరాలో నిర్ధారిత గడువు అన్నదే లేకుండా పోయింది. 83 తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల సరఫరా కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో 2021 ఫిబ్రవరిలో రూ.48 వేల కోట్ల కాంట్రాక్టు కుదిరింది. 2024 మార్చి నుంచే విమానాల డెలివరీ మొదలుకావాలి. కానీ ఇప్పటివరకు ఒక్కటి కూడా అందజేయలేదు. గతంలో తేజస్ ఎంకే1 విమానాల సరఫరాలోనూ జాప్యం జరిగింది. తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ అందాల్సి ఉంది. ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ప్రొటోటైప్ కూడా సిద్ధం కాలేదు. మన దేశంలో ఉత్పత్తి చేయడం కాదు, మన దేశంలోనే రూపొందించడం, అభివృద్ధి చేయడం (డిజైన్ అండ్ డెవలప్‌మెంట్)పై దృష్టిపెట్టాలి. సైనిక దళాలకు, పరిశ్రమకు మధ్య విశ్వాసం నెలకొనాలి. దేనికైనా కట్టుబడితే గడువులోగా అందించాలి. ప్రాణం పోయినా పర్లేదు, మాట పోవద్దనే సూక్తిని గుర్తుంచుకోవాలి" అని అమర్‌ప్రీత్‌సింగ్ పేర్కొన్నారు.

యూట్యూబర్ సన్నీ యాదవ్ అరెస్టు

హైదరాబాద్ సిటీ/నూతనకల్/చెన్నై, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు వ్లాగర్/యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేశారు. మోటార్ సైకిల్‌పై దేశవిదేశాల్లో పర్యటిస్తూ.. వ్లాగింగ్(అక్కడి పరిస్థితులను వివరించే వీడియోలు చేయడం) చేసే సన్నీ.. ఇటీవల పాకిస్థాన్‌ను సందర్శించారు. దీంతో.. పాక్ సందర్శనకు గల కారణాలపై విచారణ జరిపేందుకు ఎన్ఐఏ అధికారులు అతణ్ని చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన నేపథ్యంలో ఉద్రిక్తతలు ఉన్నా.. సన్నీ పాకిస్థాన్‌కు వెళ్లడం వివాదాస్పదమైంది. భారత రహస్యాలను పాక్‌కు చేరవేస్తున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, మరో 11 మంది అరెస్టు తర్వాత.. ఈ తరహా వ్లాగర్లపై ఎన్ఐఏ నిఘా పెంచింది. ఈ క్రమంలో సన్నీతోపాటు.. మరో ముగ్గురు వ్లాగర్ల కదలికలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. సన్నీ యాదవ్ అసలు పాకిస్థాన్‌కు ఎందుకు వెళ్లాడు? ఉద్రిక్తతల తరుణంలో శత్రుదేశాన్ని సందర్శించడానికి కారణమేంటి? అనే కోణంలో అతణ్ని విచారించనున్నట్లు సమాచారం. కాగా.. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం కల్పించిన కేసులోనూ సన్నీ నిందితుడిగా ఉన్నారు. పంజాగుట్ట కేసులో అతనికి నోటీసులు అందగా.. సూర్యాపేట పోలీసులు కూడా కేసు నమోదు చేశారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో అక్కడే?

సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల కేంద్రానికి చెందిన సన్నీ.. తనపై బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసు నమోదయ్యాక హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించారు. అది కుదరకపోవడంతో దుబాయ్ వెళ్లారు. దాంతో లుకౌట్ నోటీసు జారీ అయ్యింది. సన్నీ దుబాయ్ నుంచి పాకిస్థాన్ వెళ్లినట్లు సమాచారం. భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించిన సమయంలోనూ అతను పాక్‌లోనే ఉన్నట్లు ఎన్ఐఏ వర్గాలు అనుమానిస్తున్నాయి. గతంలో కూడా అతను ఐదుసార్లు పాకిస్థాన్‌కు బైక్‌పై వెళ్లినట్లు తెలిసింది. సన్నీ తన పాకిస్థాన్ ట్రిప్‌పైనా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. అతని కుటుంబ సభ్యులు మాత్రం అరెస్టు వార్త తమకు తెలియదని, సన్నీ నిత్యం బైక్ యాత్రలు చేస్తుంటాడని తెలిపారు. టీవీల్లో చూశాకే తమకు సమాచారం తెలిసిందని చెప్పారు. కుటుంబ సభ్యులు హైకోర్టులో హెబియస్ కార్పస్ రిట్ వేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.



సూర్యాపేట నుంచి ప్రస్థానం

సన్నీ పుట్టి పెరిగిందంతా సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం శిల్పకుంట్ల గ్రామంలో. తండ్రి ఓ ఫార్మసీ స్టోర్‌ను నడుపుతున్నారు. తల్లి గృహిణి. సన్నీ సోదరుడు కల్యాణ్ కబడ్డీ ఆటగాడు. మధ్యతరగతి నుంచి వచ్చిన సన్నీ.. చదువుల్లో ఫర్వాలేదనిపించి, మోటార్ సైక్లింగ్‌లో దూసుకువెళ్లేవారు. 13 ఏళ్ల వయసు నుంచే వాహనాన్ని నడపడం నేర్చుకున్న సన్నీ.. 18వ ఏట డ్రైవింగ్ లైసెన్సు తీసుకుని, యమహాపై రయ్‌మంటూ ట్రిప్పులు వేసేవారు. 2016లో వ్లాగింగ్ మీద ఆసక్తి పెంచుకుని, ప్రయత్నాలను మొదలుపెట్టారు. మొదట్లో 100-150 కిలోమీటర్ల దూరాలతో ప్రయత్నించారు. యూట్యూబ్ వీక్షణలు పెద్దగా లేకపోవడంతో.. 2018 నుంచి పెద్ద ట్రిప్‌లను ప్లాన్ చేసేవారు. 2019లో 21 రోజుల్లో లద్దాఖ్‌కు వెళ్లిన యాత్ర, అతని జీవితాన్ని మార్చేసింది. ఆ యాత్రతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఒక్కసారిగా మూడు లక్షలకు చేరుకుంది. దాంతో.. పూర్తిస్థాయి వ్లాగర్‌గా మారిపోయారు. 2019లోనే నేపాల్‌కు వెళ్లి.. తొలి విదేశీ యాత్రను పూర్తిచేశారు.

ట్రంప్ సుంకాలకు బ్రేక్!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం(ఐఈఈపీఏ) కింద సుంకాలను విధించే అధికారం అధ్యక్షుడికి ఉందన్నారు. ఇది జాతీయ అత్యవసర సమయాల్లో అసాధారణ ముప్పును, హెచ్చరికలను నిలువరించేందుకు ఉద్దేశించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రంప్ సుంకాల విధానాన్ని సమర్థించాలని కోర్టును కోరారు. లేనిపక్షంలో చైనాతో వాణిజ్య సంధి దెబ్బతినడంతోపాటు, భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉన్న వివాదం తిరిగి రాజుకుంటుందని పేర్కొన్నారు. "ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పాక్‌కు చెందిన ఉగ్రవాదులు దాడి చేశారు. అనంతరం అణ్వాయుధాలున్న రెండు దేశాలు ఘర్షణలకు దిగాయి. మే తొలి వారంలో ట్రంప్ తన సుంకాల అధికారాన్ని వినియోగించి ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు ఒప్పించారు. ఇది అధ్యక్షుడికి ఉన్న సుంకాల అధికారంతోనే సాధ్యమైంది" అని అధికారులు సైతం వివరించారు. వాణిజ్య సుంకాలకు సంబంధించి పలు దేశాలతో చర్చలు కొనసాగుతున్నాయని, వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసేందుకు జూలై 7 వరకు గడువు ఉందన్నారు. ఈ నేపథ్యంలో దీన్ని సున్నితమైనదిగా పరిగణించాలని కోర్టును అభ్యర్థించారు.

అపరిమిత అధికారాల్లేవ్!

ఐఈఈపీఏ కింద అధ్యక్షుడికి కాంగ్రెస్ అపరిమిత అధికారాలను కట్టబెట్టలేదని వాణిజ్య కోర్టు స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అసాధారణ ముప్పును ఎదుర్కొనేందుకు 'అవసరమైన' ఆర్థిక ఆంక్షలు విధించే అధికారం మాత్రమే అధ్యక్షుడికి ఉంటుందని ధర్మాసనం తేల్చి చెప్పింది.

> "విదేశాలతో వాణిజ్య విధివిధానాలను నియంత్రించే అధికారం అమెరికా రాజ్యాంగం కాంగ్రెస్‌కు కట్టబెట్టింది. కాంగ్రెస్‌కు దఖలు పడిన ఈ అధికారాన్ని దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడే పేరిట 'అధ్యక్షుడి అత్యవసర అధికారం' తోసిపుచ్చజాలదు. అలా చేస్తే అది రాజ్యాంగ విరుద్ధమే."
> - అంతర్జాతీయ వాణిజ్య కోర్టు



"విదేశాలతో వాణిజ్య విధివిధానాలను నియంత్రించే అధికారం అమెరికా రాజ్యాంగం కాంగ్రెస్‌కు కట్టబెట్టింది. కాంగ్రెస్‌కు దఖలుపడిన ఈ అధికారాన్ని దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడే పేరిట 'అధ్యక్షుడి అత్యవసర అధికారం' తోసిపుచ్చజాలదు. అలా చేస్తే అది రాజ్యాంగ విరుద్ధమే" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తీర్పు వచ్చిన వెంటనే ట్రంప్ ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. కాగా, కోర్టు తీర్పుపై ట్రంప్ కార్యాలయం మౌనం వహించగా ఆయన సలహాదారు స్టీఫెన్ మిల్లర్ మాత్రం తీవ్రంగా స్పందించారు. "న్యాయ వ్యవస్థ గాడి తప్పింది" అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మరోవైపు.. వీసాల నిషేధానికి సంబంధించి అమెరికా ప్రభుత్వం నూతన నిబంధన తీసుకొచ్చింది. అమెరికాకు చెందిన సామాజిక మాధ్యమాల్లో ఆ దేశ పౌరులు చేసే వ్యాఖ్యలపై ఏ ఇతర దేశ అధికారులైనా చర్యలు తీసుకుంటే.. అలాంటి వారికి వీసాలు ఇవ్వబోమని తెలిపింది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో ప్రకటించారు.

చర్చల్లో సుంకాల ప్రస్థావన లేదు

» ట్రంప్ వాదనను వ్యతిరేకిస్తున్నాం: భారత్

సుంకాలు విధిస్తామని హెచ్చరించినందునే భారత్-పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు ఒప్పుకొన్నాయన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాదనలను భారత్ తోసిపుచ్చింది. అసలు ఆనాటి చర్చల్లో సుంకాల ప్రస్థావన రాలేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. "మే నెల ప్రారంభంలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో సుంకాల అంశం అసలు లేనేలేదు." అని తేల్చి చెప్పింది. "ఈ ప్రత్యేక అంశాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మే 7న ఆపరేషన్ సిందూర్ ప్రారంభించి.. 10వ తేదీన కాల్పుల విరమణకు ఒప్పుకొనే వరకు భారత్-అమెరికాల మధ్య పలు మార్లు చర్చలు జరిగాయి. అయితే ఏ సందర్భంలోనూ ఈ సుంకాల వ్యవహారం మా మధ్యరాలేదు." అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ చెప్పారు.

ట్రంప్‌కు కోర్టులో ఎదురుదెబ్బ

» హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులు చేరకుండా చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట

» తాత్కాలికంగా నిలిపివేసిన ఫెడరల్ కోర్టు

వాషింగ్టన్, మే 29: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రఖ్యాత హార్వర్డ్ వర్సిటీలో విదేశీ విద్యార్థులు చేరకుండా ఆయన ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఫెడరల్ కోర్టు అడ్డుకొంది. ప్రభుత్వ ప్రయత్నాలను నిలిపివేస్తూ ఫెడరల్ కోర్టు జడ్జి ఎల్లిసన్ బరోస్ బుధవారం తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయమై గత వారం ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని తెలిపారు. తుది తీర్పు వెలువడే వరకు యథాతథ స్థితి కొనసాగుతుందని పేర్కొన్నారు. హార్వర్డ్ లాయర్ల వాదనలు విన్న అనంతరం ఆమె 'ప్రజలు భయపడుతున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా వేలాది మంది విదేశీ విద్యార్థులు అనిశ్చిత స్థితిలో చిక్కుకున్నారని వర్సిటీ న్యాయవాదులు తెలిపారు. వీరిలో 800 మంది భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారు. కొంతమంది ఇతర విద్యాసంస్థల్లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, మరి కొందరు ప్రవేశాలను వాయిదా వేసుకుంటున్నారని చెప్పారు. విదేశీ విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించకూడదని షరతు విధించిన నేపథ్యంలో చైనా వంటి దేశాల వారికి అధికారులు వీసాలు కూడా నిరాకరిస్తున్నారు. మరోవైపు హార్వర్డ్ యార్డ్‌లో జరిగిన సమావేశంలో 9,000 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డిగ్రీలను అందుకున్నారు. ఈ సందర్భంగా హార్వర్డ్ ప్రెసిడెంట్ అలన్ గార్బర్ మాట్లాడుతూ విదేశీయులకు ద్వారాలు తెరిచే ఉంటాయని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కాగా, హార్వర్డ్‌పై అధ్యక్షుడు ట్రంప్ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వర్సిటీని ఓ డిజాస్టర్‌గా అభివర్ణించారు. అక్కడి విద్యార్థులు సమస్యలను సృష్టించే(ట్రబుల్ మేకర్లు) అని వ్యాఖ్యానించారు. ఏటా 5 బిలియన్ డాలర్లకు పైగా నిధులు తీసుకుంటున్న హార్వర్డ్‌లో జాతి వ్యతిరేక ధోరణి పెరుగుతోందని విమర్శించారు.

ముగిసిన ట్రంప్-మస్క్ బంధం

» డోజ్ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించిన ఎలాన్ మస్క్

» ట్రంప్ బిల్లుపై వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే మస్క్ వైదొలగిన వైనం

వాషింగ్టన్, మే 29: ఫెడరల్ ప్రభుత్వ వ్యయాలను భారీగా తగ్గించడానికి ఏర్పాటైన 'డోజ్' చీఫ్‌గా వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్, ఆ పదవి నుంచి తప్పుకొంటున్నట్టు సంచలన ప్రకటన చేశారు. ప్రత్యేక ప్రభుత్వ ఉద్యోగిగా తన షెడ్యూల్ ముగింపునకు వచ్చినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు 'ఎక్స్'లో ఆయన తెలిపారు. అయితే, ట్రంప్ బడ్జెట్ ప్రణాళిక పట్ల మస్క్ తాజా గా తన నిరాశను ప్రకటించారు. ఈ ప్రణాళిక వల్ల పన్నుల్లో కోతల పరిమాణం పెరుగుతుందని, మిలిటరీ ఖర్చు భారీస్థాయికి చేరుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే ఆయన తాను డోజ్ చీఫ్ పదవి నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించడం గమనార్హం. దీంతో ట్రంప్-మస్క్ మధ్య బంధం ముగిసిపోయినట్టేనని భావిస్తున్నారు.

మేం దాడి చేసేలోపే.. బ్రహ్మోస్‌తో కొట్టారు

(మొదటిపేజీ తరువాయి)

తమ వైమానిక స్థావరాలను ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. పాకిస్థాన్-తుర్కియే-అజర్‌బైజాన్ మధ్య అజర్‌బైజాన్ వేదికగా బుధవారం జరిగిన త్రైపాక్షిక సదస్సులో షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. మే 10న తెల్లవారుజామున భారత్‌పై తాము దాడి చేద్దామని అనుకున్నామని, ఆ లోపే భారత్ దాడి చేసిందని తెలిపారు. "భారత్ చేస్తున్న దాడులకు బదులు చెప్పాలని మే 9వ తేదీ రాత్రి మేము నిర్ణయించుకున్నాం. 10వ తేదీ ఉదయం ప్రార్థనల అనంతరం, నాలుగున్నర గంటలకు దాడి చేసి శత్రువు(భారత్)కు పాఠం చెప్పాలని అనుకున్నాం. కానీ, దాని కంటే ముందే మా సైన్యం ఊహించని విధంగా భారత్ మరోసారి దాడి చేసింది. రావల్పిండి విమానాశ్రయం సహా అనేక కీలక ప్రాంతాలపై బ్రహ్మోస్ క్షిపణులు ప్రయోగించింది" అని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. దాడుల ప్రణాళికను తమ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ తనకు ముందుగానే చెప్పారని షరీఫ్ వివరించారు. ఇక, ఇరుదేశాల మధ్య దీర్ఘకాలిక సమస్యలైన కశ్మీర్, నీటివాటాలు, ఉగ్రవాదం అంశాలపై కూర్చొని మాట్లాడుకుందామంటూ పాక్ ప్రధాని ఈ సందర్భంగా మరోమారు భారత్‌ను కోరారు. శాంతి కోసం ఇరుదేశాలు మాట్లాడుకోవాలని, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ప్రతిపాదించారు. ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి తీర్మానాలు, కశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కశ్మీర్ సమస్య పరిష్కారానికి సిద్ధమని అన్నారు. అలాగే, సీమాంతర ఉగ్రవాదంపైనా చర్చలకు సిద్ధమన్న షరీఫ్.. ఇరుదేశాల మధ్య వాణిజ్యం తిరిగి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. అదే సమయంలో పాక్ తాగు, సాగు నీటి అవసరాలకు ఎంతో కీలకమైన సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో భారత్ తీరును తీవ్రంగా విమర్శించారు.

అప్పటిదాకా మాటల్లేవ్ : భారత్

పాకిస్థాన్‌తో శాంతి చర్చల విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ స్పష్టమైన, కఠినమైన చర్యలు తీసుకునేంత వరకు ఆ దేశంతో ఎలాంటి చర్చలు జరపబోమని పునరుద్ఘాటించింది. అలాగే, సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు ఇచ్చేంత వరకు సింధు నదీ జలాల ఒప్పందం అమలు కాదని స్పష్టం చేసింది. ఉగ్రవాదులను అప్పగించడంతోపాటు పీవోకే(పాక్ ఆక్రమిత కశ్మీర్)ను ఖాళీ చేసిన తర్వాతే జమ్మూకశ్మీర్ అంశంపై చర్చిస్తామని తేల్చిచెప్పింది. శాంతి చర్చలకు భారత్ ముందుకు రావాలంటూ పాక్ ప్రధాని ఇచ్చిన పిలుపునకు భారత్ ఈ విధంగా స్పందించింది. భారత విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, రక్తం కలిసి ప్రవహించవని, ఉగ్రవాదం, చర్చలు కలిసి జరగవని, ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే చోట ఉండవంటూ ప్రధాని మోదీ గతంలో చెప్పిన వ్యాఖ్యలను గుర్తు చేశారు.

సాహితీ దిగ్గజం గూగీ వా థియాంగో కన్నుమూత

» కథ, నవల, నాటకం, విమర్శ తదితర ప్రక్రియల్లో అద్భుత సాహిత్యం

» తెలుగు సాహిత్యానికీ సుపరిచితుడే

» నోబెల్ స్థాయి రచయితగా గుర్తింపు

» ఆయన రాసిన నవలా పాత్ర మీద కూడా కేసు నమోదవడం నాడు సంచలనం

» గూగీ మృతికి సాహిత్యలోకం నివాళి



హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కెన్యా రచయిత, ప్రపంచ ప్రసిద్ధ మార్క్సిస్టు సాహితీ దిగ్గజం గూగీ వా థియాంగో (87) ఇకలేరు. కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మే 28 ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) అమెరికాలోని బ్యూఫోర్ట్ నగరంలో తుదిశ్వాస విడిచారు. గూగీ 1938లో కెన్యాలోని కియాంబు జిల్లా కమిరితాలో ఓ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల ప్రభావంతో.. విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. కథ, నవల, నాటకం, విమర్శ తదితర సాహిత్య ప్రక్రియల్లో అద్భుత సృజన ఆయన సొంతం. నాడు ఆంగ్ల భాష ఆధిపత్యంపై ధిక్కార పతాకాన్ని ఎగరేశారు. తన మాతృభాష గికుయులో సాహిత్య సృజన చేసిన మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. తమ దేశంలో ప్రజాస్వామ్యం కోసం నినదించారు. కెన్యాకు స్వాతంత్ర్యం వచ్చాక నాటి పాలకుల వివక్షాపూరిత పోకడలను నిరసిస్తూ 'ఐ విల్ మ్యారీ వెన్ ఐ వాంట్' నాటకం రాసి ప్రదర్శించారు. దీనితో 1977లో ఏడాది పాటు జైలు నిర్బంధంలో ఉన్నారు. ఆ సమయంలోనే టిష్యూ పేపర్‌పై 'డెవిల్ ఆన్ ది క్రాస్' నవల రాశారు. దాన్నే ప్రముఖ విప్లవ కవి వరవరరావు 'మట్టికాళ్ల మహారాక్షసి' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఆయన రచనలతో పలుమార్లు నోబెల్ పోటీలో నిలిచారు. ఆ అవార్డు రాకున్నా.. నోబెల్ స్థాయి రచయితగా ప్రపంచమంతా గుర్తింపు పొందారు. గూగీ రాసిన 'ది అప్‌రైట్ రెవల్యూషన్' కథానిక 100 భాషల్లోకి అనువాదమవడం విశేషం. కెన్యాలో తీవ్ర నిర్బంధాన్ని, అణచివేతను ఎదుర్కొన్న గూగీ.. అమెరికాకు వలస వెళ్లారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో కంపారిటివ్ లిటరేచర్ ప్రొఫెసర్‌గా, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రైటింగ్ అండ్ ట్రాన్స్‌లేషన్ విభాగం మొదటి డైరెక్టర్‌గా పనిచేశారు.

భారతీయులు మెచ్చిన మహా రచయిత

గూగీ వా థియాంగో నవలలు 'బందీ', 'మాటిగరి', 'ఏడవకు బిడ్డ' పేరిట తెలుగులోకి అనువాదమయ్యాయి. ఆయన ఆత్మకథ మొదటి భాగాన్ని 'యుద్ధకాలంలో స్వప్నాలు-బాల్య జ్ఞాపకాలు' పేరుతో ఆచార్య జీఎన్ సాయిబాబా నాగపూర్ జైలులో ఉన్న సమయంలో అనువదించారు. నాంపల్లి తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో 2018 ఫిబ్రవరి 18న జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభకు గూగీ అతిథిగా హాజరయ్యారు కూడా. ఉగాండాలోని మకరెరె యూనివర్సిటీలో గూగీకి హైదరాబాదీ ప్రొఫెసర్ సుసీ తారు సహాధ్యాయి. అలా ఆయనకు భారతదేశంలోని దళిత, బహుజన, వామపక్ష ఉద్యమాలు, ముఖ్యంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రతో పరిచయం ఉంది. గూగీ రాసిన మాటిగరి నవల విడుదల అనంతరం.. అందులోని మాటిగరి పాత్ర మీద కూడా కెన్యా పోలీసులు కేసు నమోదు చేయడం ఆనాడు ఒక పెద్ద సంచలనంగా నిలిచింది. గూగీ రాసిన 'పెన్స్ అండ్ గన్స్', 'డీకాలనైజేషన్ మైండ్స్' తదితర రచనలు కన్నడ, మలయాళ తదితర భాషల్లోకి కూడా అనువాదం అయ్యాయి. గూగీతో తమకున్న అనుబంధంతో పాటు ఆయన సాహిత్య కృషిని కె.శ్రీనివాస్, వీక్షణం వేణుగోపాల్, మలుపు బాల్‌రెడ్డి, గుర్రం సీతారాములు తదితర తెలుగు సాహిత్య, సామాజిక రంగాలకు చెందిన వారంతా సామాజిక మాధ్యమాల వేదికగా గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించారు. గూగీ 1996లో భారత్‌కు వచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన ఒక సదస్సులో ప్రసంగించారు. ఆ సమయంలోనే హుస్నాబాద్‌లోని అతిపెద్ద మావోయిస్టుల స్థూపాన్ని సందర్శించారు.

పాక్‌కు గూఢచర్యం అనుమానంపై రాజస్థాన్ ప్రభుత్వోద్యోగి అరెస్ట్

జైసల్మేర్, మే 29: పాక్ గూఢాచార సంస్థ ఐఎస్ఐకి దేశ రహస్యాలు చేరవేస్తున్నాడన్న అనుమానంపై రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వోద్యోగి సకూర్‌ఖాన్ మంగళియార్‌ను సీఐడీ పోలీసుల బృందం బుధవారం అరెస్ట్ చేసింది. జైసల్మేర్‌లోని ఆయన ఆఫీసులోనే సకూర్‌ఖాన్ మంగళియార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. తదుపరి విచారణకు జైపూర్‌కు తరలించనున్నారు. అతడికి కాంగ్రెస్ నేతలతో సంబంధం ఉందని, గత ప్రభుత్వంలో ఆ పార్టీ నేతకు సహాయకుడిగా పని చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఓ సరిహద్దు గ్రామ వాసి సకూర్‌ఖాన్ ఫోన్‌లో పలువురు పాక్ పౌరుల ఫోన్ నంబర్లున్నాయి. తమ ప్రశ్నలకు సరైన జవాబులివ్వడం లేదని పోలీసు వర్గాలు తెలిపాయి.

లోకం తీరు






కడప మహానాడు బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన జనం. కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు

ఆర్థిక ఉగ్రవాదులను ఏరేస్తాం..!

(మొదటి పేజీ తరువాయి)

అదే విధంగా సాగుతోంది." అని ఆయన పేర్కొన్నారు. కడపలో గురువారం జరిగిన మహానాడు ముగింపు సభలో మాట్లాడిన చంద్రబాబు.. "పరిపాలన ఎలా ఉండాలో, పార్టీ ఎలా ఉండాలో చెప్పేందుకు కేస్ స్టడీ టీడీపీ. పాలన ఎలా ఉండకూడదో, పార్టీని ఎలా నడపకూడదో తెలిపేందుకు కేస్ స్టడీ వైసీపీ." అని వ్యాఖ్యానించారు. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ టీడీపీ అని.. సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిన నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. రాయలసీమ బిడ్డగా రాళ్ల సీమను రతనాల సీమగా మారుస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఒకప్పుడు సీమలో ఉన్న ఫ్యాక్షన్ భూతాన్ని రూపుమాపింది టీడీపీనేనని గుర్తుచేశారు. "రాయలసీమ అభివృద్ధికి నా వద్ద స్పష్టమైన బ్లూప్రింట్ ఉంది. లేపాక్షి, ఓర్వకల్లు కారిడార్‌లో డిఫెన్స్, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీ, ఆటోమొబైల్ సిటీని ఏర్పాటుచేస్తాం. కర్నూలుకు హైకోర్టు బెంచి తీసుకొస్తాం. గత ప్రభుత్వం కడప స్టీల్ ప్లాంటుకు నేను వేసిన పునాది తీసివేసి కొత్తది వేసి నాటకాలాడింది. కడపకు స్టీల్ ప్లాంట్ మాత్రం రాలేదు. ఈ ఏడాది జూన్ 12లోగా కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ ప్రాంభమవుతుందని హామీ ఇస్తున్నా. మూడు వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. కొప్పర్తి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులు రెండింటికీ ఐదువేల కోట్లు వస్తాయి " అని బాబు పేర్కొన్నారు.

మంచి పాలనను ఆశీర్వదించండి

మంచి పాలన కొనసాగాలని.. అభివృద్ధి వైకుంఠపాళి కారాదని చంద్రబాబు తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. 2019లో టీడీపీ అధికారంలోకి రాకపోవడం వల్ల ఏపీ ఎంతో నష్టపోయిందని.. నాడు గెలిచి ఉంటే అనుకున్న పనులన్నీ పూర్తయ్యేవని అన్నారు. "ఈ మహానాడుకు ఓ ప్రత్యేకత ఉంది. అదే లోకేశ్ తెచ్చిన ఆరు శాసనాలు. దీన్ని పక్కాగా అమలు చేసి 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తాం. నా జీవితంలో ఇలాంటి మహానాడు చూడలేదు" అంటూ చంద్రబాబు ప్రసంగం ముగించారు.

"దేశంలోని ఉగ్రవాదులతోనే కాదు, రాజకీయ ముసుగులోని ఆర్థిక ఉగ్రవాదుల వల్ల కూడా చాలా నష్టం. ఏపీలో ఆర్థిక ఉగ్రవాదులు భూములు, గనులు, ఇసుక దోచేసుకున్నారు. జే బ్రాండ్‌తో కొల్లగొట్టారు. కొండల్ని మింగేశారు. అడవుల్ని ఆక్రమించి ప్యాలెస్‌లు, ఎస్టేట్లు నిర్మించుకున్నారు. చెరువులను చెరబట్టారు. ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్‌లో భాగంగా వీటన్నిటికీ చెక్ పెడతాం. వారిని రాజకీయాల్లో లేకుండా చేస్తాం."

\- ఏపీ సీఎం చంద్రబాబు

4 లక్షల మందికి 'మహా'భోజనం

కడపలో నిర్వహించిన మహానాడులో మూడో రోజు గురువారం 2 లక్షల మందికి పైగా భోజన వసతి కల్పించారు. చికెన్ బిర్యానీ తయారు చేసి ప్యాకెట్ల ద్వారా పంపిణీ చేశారు. వాటర్ బాటిళ్లను అందించారు. మొదటి రోజు 70 వేల మందికి, రెండోరోజు లక్ష మందికి భోజన వసతి కల్పించారు. మొత్తం మూడు రోజుల పాటు నిర్వహించిన మహానాడులో దాదాపు 4 లక్షల మందికి పసందైన వంటకాలతో భోజనాన్ని అందించారు.

23 తీర్మానాలు..

మహానాడు తొలి రోజు ఐదు అంశాలపై తీర్మానాలు చేశారు. ఇవన్నీ లోకేశ్ ప్రతిపాదిత 6 శాసనాల్లో భాగం కావడం గమనార్హం. మరుసటి రోజు 9 తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలిపారు. తెలంగాణకు సంబంధించి ఐదు తీర్మానాలను ఆమోదించారు. రెండు రాష్ట్రాలకు కలిపి 4 తీర్మానాలు చేశారు. వైఎస్ఆర్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న కడప గడ్డపై మహానాడు విజయ సంరంభం ముగిసింది. సీకే దిన్నె మండలం పబ్బాపురంలో మంగళవారం ప్రారంభమైన మహానాడు.. గురువారం భారీ బహిరంగ సభతో సమాప్తమైంది.

'రెడ్ బుక్'తో గుండెపోటు!

- ఒకడు బాత్రూమ్‌లో జారిపడ్డాడు
- ఇంకొకడు ఏమయ్యాడో అందరికీ తెలుసు: లోకేశ్



రెడ్‌బుక్ చెప్పగానే ఒకడికి గుండెపోటు వచ్చింది. మరొకడు బాత్రూమ్‌లో కాలు జారిపడ్డాడు. ఇంకొకడు ఏమయ్యాడో మీ అందరికీ తెలుసు. అర్థమైందా రాజా' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. రెడ్‌బుక్ అంటే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయడమేనన్నారు. ఎవరైతే చట్టాలను ఉల్లంఘించి ప్రజలను, టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టారో వారిని చట్టప్రకారం శిక్షిస్తామని చెప్పామని.. ఇప్పుడు రెడ్‌బుక్ అదే చేస్తోందని చెప్పారు. కడప మహానాడు ప్రాంగణంలో బహిరంగ సభ వేదికపై నుంచి ఆయన మాట్లాడారు. రెడ్‌బుక్ నుంచి ఎవరూ తప్పించుకోలేరని. ఇప్పుడు మనం డెవలెప్‌మెంట్ బుక్‌పై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

వాళ్లే పారిపోయే పరిస్థితి..

మన జెండా పీకేస్తామన్నారు. వాళ్లే ఇప్పుడు పార్టీ కార్యాలయానికి టూలెట్ బోర్డు పెట్టుకుని పారిపోయే పరిస్థితి.. మన పార్టీని లేకుండా చేస్తామన్నారు.. వాళ్లే అడ్రస్ లేకుండా పోయే పరిస్థితి.. వైనాట్ 175 అన్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వని పరిస్థితి.. ఏ తప్పు చేయని మన అధినేత చంద్రబాబును బంధించారు. ప్రజలు ఏకంగా ఆ నాయకుడినే ప్యాలెస్‌లో పెట్టి తాళాలు వేశారు. 2024 ఎన్నికల్లో మాస్ విక్టరీ చూశాం. మనకు అధికారం కొత్త కాదు.. ప్రతిపక్షం కొత్త కాదు. కానీ గత ఐదేళ్ల విధ్వంస పాలన ఎదుర్కొన్నాం. మన నాయకులు, కార్యకర్తలపై దాడులు, హత్యలు చేశారు. ప్రశ్నిస్తే కేసులు, పోరాడితే అరెస్టులు. మన అధినేతను అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టారు. అంతులేని ధనదాహంతో విషం కంటే ప్రమాదకరమైన మద్యాన్ని ఏరులై పారించి.. 30 వేల మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నారు. వేల కోట్లు దోచుకుని రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వెళ్లిపోయారు. వైసీపీ వాళ్లకు రూ.వెయ్యి పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు పడితే.. మేం వచ్చిన తొలిరోజు నుంచే వెయ్యి పెంచి ఇస్తున్నాం. పేదవాళ్లు కడుపు నిండా భోజనం చేయడం జగన్‌కు ఇష్టం ఉండదు. అందుకే అప్పట్లో అన్న క్యాంటీన్లను మూయించాడు. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పడింది.

సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆరే

కడప మహానాడులో ఏకగ్రీవంగా ఆమోదించిన ఆరు శాసనాలను పొలిట్‌బ్యూరో సభ్యుడి నుంచి సామాన్య కార్యకర్త వరకు శ్వాసగా భావించి చిత్తశుద్ధితో అమలుకు కృషి చేయాలి. ఎన్టీఆర్ అంటే మూడక్షరాలు కాదు.. ఓ ప్రభంజనం.

ఇంటికి భోజనానికి పిలిచి అత్యాచారం

- ఆ ఘటననంతా ఫొటోలు, వీడియోలుగా తీసి బ్లాక్‌మెయిల్
- ఇప్పటికే రూ.20 లక్షలు ఇచ్చుకున్న బాధితురాలు
- మరో కోటి రూపాయలు ఇవ్వాలంటూ ఆ వ్యక్తి డిమాండ్

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్నేహం పేరుతో ఓ యువతిని కేటుగాడు దారుణంగా వంచించాడు. బ్లాక్‌మెయిల్‌కు దిగి ఆమె నుంచి రూ.20 లక్షలు కాజేసి, ఇంకా రూ.కోటి ఇవ్వాలంటూ బెదిరిస్తున్నాడు. అతడి వేధింపులను భరించలేక ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లో నివసిస్తున్న 24 ఏళ్ల యువతికి 2023 ఫిబ్రవరిలో ఫేస్‌బుక్ ద్వారా మహేంద్రవర్ధన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నట్లు ఆమెతో చెప్పుకొన్నాడు. ఇద్దరి మధ్య కొన్నాళ్లు ఫోన్లో మాటలు నడిచాయి. కాఫీషాప్‌కు రమ్మని ఆ వ్యక్తి పిలిస్తే ఆమె వెళ్లింది. అదే ఏడాది ఆగస్టు 15న ఆమెను ఆ వ్యక్తి తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. ఇంటికొచ్చిన ఆమెను మాటల్లో పెట్టి మత్తుమందు కలిపిన పానీయం ఇచ్చాడు. అది తాగిన కొద్దిసేపటికి మగతలోకి జారుకున్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ దారుణాన్నంతా ఫొటోలు, వీడియోలు తీశాడు. మర్నాడు ఉదయం నిద్రలోంచి మేల్కొన్న ఆమెకు ఆ ఫొటోలు, వీడియోలు చూపించి.. తనకు రూ.20 లక్షలు ఇవ్వాలని, లేదంటే వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించాడు. తీవ్ర ఆందోళనకుగురైన బాధితురాలు, అతడు అడిగిన ఆ మొత్తాన్ని చేతుల్లో పెట్టింది. కాగా కొన్నాళ్లుగా తనకు రూ.కోటి ఇవ్వాలంటూ బాధితురాలిని మహేంద్రవర్ధన్ డిమాండ్ చేస్తున్నాడు. తాను అంత ఇచ్చుకోలేనని ఆమె వేడుకున్నా.. ఫొటోలు, వీడియోలు నెట్‌లో పెడతానంటూ బెదిరిస్తున్నాడు. వేధింపులు పెరగడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తండ్రి నడుపుతున్న ట్రాక్టర్ కిందపడి కొడుకు మృతి

మిరుదొడ్డి, మే29 (ఆంధ్రజ్యోతి): తండ్రితో కలిసి పొలానికి వెళ్లిన ఆ బాలుడు.. పొలంలో తండ్రి నడుపుతున్న ట్రాక్టర్ కిందే పడి ప్రాణాలు కోల్పోయాడు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాలకు చెందిన బీడ కనకయ్య, లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు. కనకయ్య గురువారం ఉదయం పొలానికి వెళుతుండగా పెద్ద కుమారుడు వికాస్(6) వెంట వస్తానని మారం చేశాడు. దీంతో లావణ్య.. తన భర్త కనకయ్య నడుపుతున్న ట్రాక్టర్‌పై వికాస్‌ను కూర్చోబెట్టి పంపింది. అయితే, వికాస్‌ను ట్రాక్టర్‌పైనే ఉంచుకుని కనకయ్య రోటవేటర్‌తో పొలం దున్నుతుండగా.. వికాస్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారి పడ్డాడు. రోటవేటర్ కింద నలిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

కొంచం మానవత్వం ప్రదర్శించండి

- తీన్మార్ మల్లన్న పాస్‌పోర్ట్‌పై అధికార్లకు హైకోర్టు సూచన

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రతిదాన్ని వ్యతిరేకించడం సరికాదని, కొన్ని అంశాల్లో కొంచం మానవత్వం ప్రదర్శించాలని రీజనల్ పాస్‌పోర్ట్ అథారిటీకి హైకోర్టు సూచించింది. కుమార్తె చికిత్స కోసం విదేశాలకు వెళ్లాల్సి ఉన్న ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న పాస్‌పోర్ట్ తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. క్రిమినల్ కేసులు ఉన్నందున ఆయన పాస్‌పోర్ట్‌ను పాస్‌పోర్ట్ అథారిటీ సీజ్ చేసింది. దీనిపై మల్లన్న హైకోర్టును ఆశ్రయించారు. పాస్‌పోర్టు జారీచేయాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణ జూన్ 27కు వాయిదా పడింది.

మరో 4 రోజులు వర్షాలే!

హైదరాబాద్/సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. జూన్ 2 వరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణ అంతటా నైరుతి రుతుపవనాలు విస్తరించినట్లు పేర్కొంది. గురువారం కొత్తగూడెం జిల్లాలో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవగా, మహబూబాబాద్, సిరిసిల్ల, ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి.

జూరాలకు వరద పోటు

- 12 గేట్లు ఎత్తి దిగువకు 83 వేల క్యూసెక్కుల విడుదల

హైదరాబాద్, అమరచింత/ధరూరు/దోమలపెంట, మే 29 (ఆంధ్రజ్యోతి): వానాకాలానికి ముందే ఈ ఏడాది కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. రాష్ట్రంలోని జలాశయాలకు వరద పోటెత్తుతోంది. వనపర్తి, గద్వాల జిల్లాల సరిహద్దులోని జూరాల ప్రాజెక్టుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి మే నెలలోనే వరద వచ్చింది. ఎగువన ఉన్న ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టుకు గురువారం ఒక్కసారిగా 40 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి 66 వేల క్యూసెక్కుల నీటిని వదిలేశారు. ఆ తర్వాత మరో 2 గేట్లను కూడా ఎత్తారు. మొత్తం 12 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం ఉదయానికి మరో లక్ష క్యూసెక్కుల వరద నీరు జూరాల ప్రాజెక్టుకు చేరే అవకాశం ఉందని తెలిసింది. కాగా, గురువారం రాత్రి తొమ్మిది గంటల నాటికి అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం.. జూరాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 9.6 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.864 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 99 వేల క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 83,616 క్యూసెక్కులు ఉండగా నెట్టెంపాడు వద్ద మరో 1500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇక, శ్రీశైలం ప్రాజెక్టుకూ వరద పోటెత్తుతోంది. శ్రీశైలం డ్యామ్‌కు ఎగువన ఉన్న సుంకేసుల నుంచి 4,379 క్యూసెక్కులు, జూరాల నుంచి 66,000 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుతం 22,527 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. గడిచిన 24 గంటల వ్యవధిలో ప్రాజెక్టు ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో 7,582 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 3.338 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ఇక, కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 70 వేల క్యూసెక్కుల వరద వచ్చిచేరింది. మరో నాలుగురోజుల పాటు ఆల్మట్టి, జూరాలకు వరద ఇదే విధంగా వస్తుందని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) సమాచారం ఇచ్చింది. కాగా, ముందుగానే వచ్చిన వరదల వల్ల తెలుగు రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య రెండు నెలలుగా నెలకొన్న తాగునీటి వివాదాలకు తెరపడనుంది.



జూరాల గేట్ల ద్వారా దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణానది నీరు

తీరందాటిన తీవ్ర వాయుగుండం

విశాఖపట్నం, అమరావతి, మే 29 (ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగిన వాయుగుండం ఉత్తరంగా పయనించే క్రమంలో గురువారం తీవ్ర వాయుగుడంగా బలపడింది. ఆ తరువాత ఉత్తర ఈశాన్యంగా పయనించి బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ మధ్య తీరం దాటింది. ఇది రానున్న 12 గంటల్లో మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, బంగాళాఖాతంలో మరిన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతంలో మిగిలిన ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. రానున్న రెండు రోజుల్లో బిహార్ వరకు రుతుపవనాలు విస్తరించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

జలాశయం	పూర్తి నీటినిల్వ (టీఎంసీల్లో)	గతేడాది నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	129.72	22.19	41.70	70,000
నారాయణపూర్	37.64	19.27	23.57	1000
జూరాల	9.66	3.73	6.42	99,000
తుంగభద్ర	105.79	3.34	12.33	7799
శ్రీశైలం	215.81	31.83	39.03	22,527
నాగార్జునసాగర్	312.02	122.85	135.95	7591
పులిచింతల	45.77	0.42	25.44	-
జైక్వాడి	102.73	29.87	48.91	258
సింగూరు	29.91	14.74	16.99	-
నిజాంసాగర్	17.80	4.85	5.84	434
శ్రీరాంసాగర్	80.50	10.17	12.56	3310
ఎల్లంపల్లి	20.18	5.21	8.41	679

సింగరేణిలో పొదుపు మంత్రం

- సంస్థ పరిరక్షణకు తప్పవన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- సింగరేణి, కోల్ ఇండియా భవితవ్యంపై సమీక్ష



హైదరాబాద్/ గోదావరి ఖని, మే 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని కాపాడుకునేందుకు సంస్థలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఇబ్బందులు తలెత్తకుండా బొగ్గు ఉత్పాదక ఖర్చు గణనీయంగా తగ్గించుకోవాలని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు కార్మిక సంఘాల సహకారం తీసుకుని, సంస్థలో పని సంస్కృతిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. సింగరేణితోపాటు కోల్ ఇండియా సంస్థల పురోగతికి బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, బొగ్గు పంపిణీలో ఎదురవుతున్న సవాళ్ల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ విషయమై ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఆయా సంస్థల పనితీరుపై సమీక్షించారు. భవిష్యత్తులో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధనకు డిమాండ్‌కనుగుణంగా ప్రభుత్వ బొగ్గు సంస్థలు సమయాత్తం కావాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తి వ్యయం తగ్గింపునకు బొగ్గు గని మంత్రిత్వశాఖ, సింగరేణి అధికారులతో కమిటీ వేయాలని హితవు చెప్పారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా బొగ్గు గనుల్లో క్షేత్రస్థాయిలో కార్మికుల పనితీరు, తదితర అంశాలను పరిశీలించి తగు సూచనలు చేస్తుందన్న మంత్రి కిషన్ రెడ్డి.. వాటిలో ఆచరణాత్మక సిఫారసులను అమలు చేసి ఉత్పత్తి ఖర్చు తగ్గించాలని పేర్కొన్నారు. వినియోగదారులు సింగరేణికి దూరం కాకుండా బొగ్గు ఉత్పత్తిలో నాణ్యతపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సింగరేణి తరఫున వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సంస్థ సీఎండీ ఎన్.బలరామ్.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంస్థ ప్రగతి, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లాలో అనిశ్చితి

ఎన్నికలు డిసెంబరులోనే జరగాలంటూ ఖలీదాజియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) బుధవారం నిర్వహించిన భారీ ప్రదర్శన అక్కడి రాజకీయ పరిస్థితులకు అద్దంపడుతోంది. బిఎన్‌పి కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఖలీదా కుమారుడు అయిన తారిఖ్ రహ్మాన్ లండన్ నుంచి ఒక వీడియోలింక్ ద్వారా వేలాది మంది కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. గత పదినెలల కాలంలో మహ్మద్ యూనిస్ ప్రభుత్వాన్ని బిఎన్‌పి ఎన్నడూ ఇంతగా తప్పుబట్టలేదు. తాత్కాలిక ప్రభుత్వాలంటే ఓ మూడునెలల్లో ఎన్నికలు జరిపి, ప్రజలు ఎన్నుకున్నవారికి అధికారం అప్పగించాలే తప్ప, ఏళ్ళకు ఏళ్ళు దేశాన్ని పాలించవని ఆయన విమర్శించారు. ఎన్నికలతో సంబంధం లేకుండా అధికారాన్ని అనుభవిస్తున్నవారు విదేశాంగ విధానాన్ని ఎలా నిర్ణయిస్తారు, దేశభవిష్యత్తుతో ముడివడిన కీలక నిర్ణయాలు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. నోబెల్ విజేత మహ్మద్ యూనిస్‌కు పదవీకాంక్ష పట్టుకుందని, ఎన్నికల నిర్వహణను కుట్రపూరితంగా వాయిదావేస్తూ, అధికారాన్ని అనుభవిస్తున్నారన్న అర్థం వచ్చేలా తారిఖ్ వ్యాఖ్యలు చేశారు. డిసెంబరులో ఎన్నికలు జరపాలన్న ఈ డిమాండ్‌కు జవాబుగా, వచ్చే ఏడాది జూన్ లోపు గ్యారంటీ అంటూ టోక్యోలో ఉన్న యూనిస్ సమాధానం చెప్పారు. ఎవ్వరు ఏమనుకున్నా ఎన్నికలకు ఇంకొంత సమయం పడుతుందన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం.

ఢిల్లీకాదు, పిండి కాదు, బంగ్లాదేశ్‌కే ప్రాధాన్యం అంటూ ఈ ప్రసంగంలో తారిఖ్ రహ్మాన్ ఉద్ఘాటించడమే కాక, కార్యకర్తలతో పలుమార్లు నినాదాలు చేయించారు. న్యూఢిల్లీతో, రావల్పిండితో రాసుకుపూసుకోవడం కాక, బంగ్లాదేశ్ ప్రయోజనాలే తనకు ముఖ్యమని అర్థం. రేపు ఈ పార్టీ అధికారంలోకి వస్తే, ఆచరణ అలాగే ఉంటుందన్న నమ్మకం ఏ మాత్రం లేదు. పాకిస్థాన్‌తో ఖలీదాజియా కుటుంబానికి ఉన్న అనుబంధం తెలియనిదేమీ కాదు. కానీ, తాత్కాలికంగా కుర్చీలో కూర్చున్న యూనిస్ కఠినమైన భారత వ్యతిరేకవైఖరి తీసుకొని, పాకిస్థాన్‌తో రాసుకుపూసుకు తిరుగుతున్న నేపథ్యంలో, ఆ విధానాన్ని ప్రశ్నిస్తూ, దేశానికి నష్టం జరుగుతోందని తారిఖ్ హెచ్చరించడం విశేషమైనదే.

హసీనాను దేశం నుంచి వెళ్ళగొట్టి పదినెలలు అవుతున్నా ఇంకా ఎన్నికల దిశగా అడుగులుపడకపోవడం బిఎన్‌పికి ఆగ్రహం కలిగిస్తోంది. సమస్త వ్యవస్థలు కట్టకట్టుకొని అవామీలీగ్ మీద నిషేధం విధించి, ఎన్నికల్లో పాల్గొనకుండా చేసిన నేపథ్యంలో, తనకు ఇక ఎదురుండదన్న ధైర్యం బిఎన్‌పికి వచ్చింది. ఎన్నికలు వెంటనే జరిగితే తనకు ఘన విజయం ఖాయమన్న నమ్మకంతోపాటు, ఆలస్యమవుతున్న కొద్దీ కొత్తశక్తులు బలపడతాయన్న భయం దానిది. వెంటనే ఎన్నికల రోడ్‌మ్యాప్ ప్రకటిస్తేనే ప్రభుత్వానికి సహకరిస్తానని అది బెదిరిస్తోంది. హసీనా విధించిన నిషేధంనుంచి ఈ మధ్యనే బయటపడిన జమాతే ఇస్లామీ కూడా బిఎన్‌పి వాదనలనే బలపరుస్తోంది. హసీనామీద తిరుగుబాటుచేసిన విద్యార్థులంతా ఏర్పాటు చేసుకున్న జాతీయ నాగరిక్ పార్టీ (ఎన్సీపీ) మాత్రం ముందుగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం పట్టుబడుతోంది. బిఎన్‌పిని ఈ యువకులంతా అణచివేతకు, నియంతృత్వానికీ మారుపేరుగా, మరో అవామీలీగ్‌గా అభివర్ణిస్తున్నారు. ఎన్నికలు జరిగేలోగానే సమస్తవ్యవస్థల ప్రక్షాళన పూర్తికావాలని, ఎన్నికల, రాజకీయ సంస్కరణలు సమూలంగా జరగాలని వీరు పట్టుబడుతున్నారు. మరోపక్క, దేశభద్రతకు సంబంధించిన కీలక నిర్ణయాలు మీరెలా తీసుకుంటారంటూ ఆర్మీచీఫ్ వకార్ కూడా యూనిస్‌ను ప్రశ్నిస్తున్నారు. ఆర్మీకీ, యూనిస్‌కు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొని, ఒక దశలో సైన్యం తిరుగుబాటు అవకాశాలమీద విశ్లేషణలు కూడా వెలువడ్డాయి. రోహింగ్యాలకు మానవతా సాయం, చట్టోగ్రామ్ పోర్టు విదేశీ నిర్వహణ, ఎలాన్‌మస్క్ స్టార్‌లింక్‌కు అనుమతి ఇత్యాది విషయాల్లో ఈ ఘర్షణ ఇంకా పెరిగింది. హసీనాకు వ్యతిరేకంగా ఉద్యమించి, ఆమెను దేశం విడిచిపోయేట్టుగా చేసి, అమెరికా ఆదేశాలమేరకు యూనిస్‌ను తాత్కాలిక అధినేతగా ప్రకటించడం వరకూ మనకు కనిపించిన ఏకాభిప్రాయం ఇప్పుడు లేకుండా పోవడం విచిత్రం. హసీనాపార్టీని నిషేధించి, ఆ నాయకులను జైళ్ళలో కుక్కుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడు జరిగినా, అవి విస్తృత ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించబోవన్నది వాస్తవం.

బలూచీ నుంచీ పాఠం నేర్చుకోవాలా?



రాజకీయాలను రెండు రకాలుగా చూడొచ్చు. స్థూల దృష్టితో చూసి రేఖామాత్రంగా ఒక అవగాహన ఏర్పరచుకోవటాన్ని మొదటిదిగా చెప్పుకోవచ్చు. సాధారణ పౌరులు చాలావరకూ ఈ దృష్టితో సరిపెట్టుకుంటారు. దీనికి భిన్నంగా సూక్ష్మదృష్టితో రాజకీయాలను చూసి అందులోని మంచిచెడులను లోతుగా అవగాహన చేసుకుని వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాడుకోవటం రెండోదిగా భావించొచ్చు. ముఖ్యంగా విదేశీ వ్యవహారాల విషయంలో రెండోదానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. దీన్ని ప్రస్తుత పరిస్థితుల్లో అర్థంచేసుకోటానికి బలూచిస్థాన్ వ్యవహారాలను నిదర్శనంగా తీసుకోవచ్చు. కశ్మీరు సమస్యను పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికల మీద లేవనెత్తినప్పుడల్లా బలూచిస్థాన్‌లో మీరేం చేస్తున్నారంటూ భారత్ తరఫు నుంచి ప్రశ్నించటం ఇటీవల ఎక్కువైంది. సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ కొన్నాళ్ల క్రితం పాకిస్థాన్‌ను ఇలాగే హెచ్చరించారు. పహల్గాం దారుణం అనంతరం బలూచిస్థాన్ వేర్పాటువాదులు పాక్ భద్రతాదళాలపై దాడులను ముమ్మరం చేశారు. కొంత ప్రాంతం పాక్ నుంచి విముక్తం అయినట్లూ ప్రకటించారు. అంతకుముందు జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును నిర్బంధించి పాక్ సైన్యంతో ముఖాముఖీ తలపడ్డారు. అటూఇటూ చాలా ప్రాణనష్టం అనంతరం మాత్రమే పాక్ భద్రతాదళాలు పరిస్థితిపై పట్టుసాధించినట్లు ప్రకటించుకున్నాయి. ఈ తరహా హింసాత్మక చర్యలు బలూచీ చరిత్రలో కొత్తవి కావు. 1948 నుంచి ఇప్పటి వరకూ ఏదోరూపంలో కొనసాగుతూనే ఉన్నాయి.

బలూచిస్థాన్ సమస్యను వ్యూహాత్మక దౌత్య ప్రేమతో కాకుండా అక్కడి ప్రజల దృష్టి నుంచి చూస్తే... దారుణ అణచివేతలు, చిందిన రక్తపాతాలు, విచ్చలవిడి వనరుల దోపిడీలు, స్థానికులను అధమస్థానంలోకి నెట్టటం, రాజకీయ అధికారంలో భాగస్వామ్యాన్ని నిరాకరించటం, స్వపరిపాలనా కాంక్షను జాతి విద్రోహంగా పరిగణించటం, సైనిక బలంతో పెత్తనం సాగించటం, స్థానిక తెగలను అభివృద్ధి నిరోధకులుగా ముద్రవేయటం, రాజకీయ ప్రత్యర్థులను మాయం చేయటం, బూటకపు ఎన్‌కౌంటర్లతో ప్రజలను మట్టుబెట్టటం, స్థానిక భాషను తృణీకరించటం.. లాంటి ఎన్నో దురాగతాలతో ఆ నేలకు నిలువెల్లా గాయాలయినట్లు స్పష్టంగా కనపడుతుంది. పాక్‌కు బలూచిస్థాన్ పక్కలో బల్లెంలా మారటం మనలో కొందరికి సంతోషం వేయవచ్చు. అక్కడి ప్రభుత్వ వ్యతిరేక ప్రతిఘటనా రాజకీయాలకు వివిధ రూపాల్లో సహాయాన్ని అందించటం మన దౌత్యవ్యూహ చాతుర్యంగా భావించొచ్చు. కానీ దానికి మించి అక్కడి పరిస్థితిని సమగ్ర దృష్టితో, మానవతాకోణం నుంచి చూస్తే ఎన్నో గుణపాఠాలనూ నేర్చుకోవచ్చు. స్వపాలనా ఆకాంక్షలను, జాతి గుర్తింపు కోసం చేసే ప్రయత్నాలను బలప్రయోగంతో అణచివేస్తే తీవ్రవాదాలు పుట్టుకొచ్చి పరిస్థితిని ఎంత భయంకరంగా మార్చుతాయో తెలుసుకోవచ్చు. బ్రిటిషు పాలకులు, ఆ తర్వాత అమెరికా, సోవియట్ రష్యా, చైనా సాగించిన నిర్వాకాలతో అక్కడి పరిస్థితి విషమంగా మారి జన జీవితాల్ని ఎంత ఛిద్రంచేసిందో అర్థం చేసుకోవచ్చు.

బలూచిస్థాన్ చరిత్రే చాలా విచిత్రమైంది. అదెన్నో మలుపులు తిరిగింది. ఏ మలుపులోనూ స్థానికుల స్వరాన్ని లెక్కచేయకపోవటమే అక్కడ కనిపిస్తుంది. బ్రిటిషు వలసపాలకులు బలూచిస్థాన్‌లో అడుగుపెట్టే నాటికి అక్కడ బలమైన రాజ్యవ్యవస్థ లేదు. తెగల సమాహారంగా సమాజం ఉండేది. తెగల నాయకులు, పెద్దలు చెప్పేదే చెల్లుబాటు అయ్యేది. పన్నులను, శిస్తులను కూడా వాళ్లే నిర్ణయించేవాళ్లు. సున్నీ ముస్లిం మతం ప్రబలంగా ఉన్నా అది తెగల హద్దులను దాటి అందరినీ ఏకంచేసే స్థాయికి చేరలేదు. మతం జాతీయతా భావాన్ని కలగచేయలేదు. పర్షియన్, ఆఫ్గాన్, సింధీ, సిక్కు సైన్యాలు బలూచిస్థాన్‌పై దండెత్తినా తెగలను పూర్తిగా లొంగదీసుకోలేకపోయాయి. తెగల నుంచి కప్పం వసూలు చేసుకుని వాటి అంతర్గత విషయాల్లో పెద్దగా జోక్యం చేసుకోని పరిస్థితే ఉండేది. 18వ శతాబ్దంలో మాత్రమే తెగలను ఒక రాజ్యవ్యవస్థ కిందకు సమీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. కలాత్ ప్రాంతానికి చెందిన నజీర్‌ఖాన్ సారథ్యం కింద 25000 మందిని సైనికులుగా సమీకరించటంతో అక్కడ ప్రాథమిక రాజ్యవ్యవస్థ ఏర్పాటైంది. నజీర్‌ఖాన్ మరణం (1794) తర్వాత ఆ వ్యవస్థ కూడా బలహీనపడి పోయి, మళ్లీ విడివిడి తెగల ప్రాబల్యం పెరిగింది. కలాత్ ఖాన్‌ల కింద ఉన్న ప్రాంతంలోనే రాజ్యవ్యవస్థ కాస్త బలంగా ఉండేది. ఈ పరిస్థితి 1884 వరకూ కొనసాగింది. ఆ ఏడాది బ్రిటిషు వలసపాలకులు బలూచిస్థాన్‌ను మొత్తంగా స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. బ్రిటిషు సైన్యం రాకపోకలకూ రవాణా అవసరాలకూ వారికి బలూచిస్థాన్ కావాల్సి వచ్చింది. అందుకోసం కలాత్ పాలకుడితో ఒప్పందం కుదుర్చుకున్నారు. దాన్ని కొన్ని తెగలు గుర్తించకుండా బ్రిటిషు వారికి అడ్డంకులు సృష్టించాయి. దీన్ని సాకుగా తీసుకుని కలాత్ మీద దాడి చేసి అక్కడి ఖాన్‌ను చంపేశారు. బలూచిస్థాన్‌ను ఏడు ముక్కలు చేశారు. రెండు ముక్కలను ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల్లో కలిపారు. మూడో భాగాన్ని బ్రిటిష్ బలూచిస్థాన్ పేరుతో తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. మిగతా నాలుగు ముక్కల్లో కలాత్ కింద కొంత భాగాన్ని మిగిలిన మూడు ముక్కలను మూడు చిన్న సంస్థానాల కింద విభజించారు. దేశ విభజన నాటికి బలూచిస్థాన్‌ను ఏంచేయాలన్న ప్రశ్న వచ్చినప్పుడు బ్రిటిషు పాలకులు గతంలో ఇరాన్, ఆఫ్గానిస్థాన్‌ల్లో తాము కలిపేసిన ప్రాంతాల గురించి ఆలోచించలేదు. భారత్, పాక్‌ల్లో దేంట్లోనైనా చేరేందుకూ అందుకు ఇష్టం లేకపోతే స్వతంత్రంగా ఉండేందుకూ అప్పటి సంస్థానాలకు స్వేచ్ఛను ఇచ్చారు. మూడు చిన్న సంస్థానాలు పాకిస్థాన్‌లో చేరటానికి అంగీకరించినా కలాత్ పాలకుడు స్వతంత్రంగా ఉండటానికే నిర్ణయించుకున్నాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర పాలకుడిగా తనను ప్రకటించుకున్నాడు. ఎంతో ఒత్తిడి వచ్చినా రక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా మిగతా వ్యవహారాల్లో స్వయం నిర్ణయాధికారాన్నే కోరుకోవటంతో 1948 ఏప్రిల్‌లో పాక్ సైనిక చర్యను చేపట్టి విలీనం చేసుకుంది. 1947కు ముందు నుంచీ కూడా ప్రత్యేక దేశంగా ఉండటానికి బలూచీలు గట్టిగానే ప్రయత్నించారు. పాక్‌లో బలవంతంగా కలిపేసుకున్నా ఒక రాష్ట్రంగా సొంతంగా వ్యవహారాలు నడిపే హక్కుని కూడా ఇవ్వకపోవటంతో బలూచీల విషాదం మొదలైంది.

> బలూచీ చరిత్ర చెప్పే సత్యం ఒక్కటే. రాజకీయ, ఆర్థిక అధికారాల్లో సముచిత ప్రాతినిధ్యం ఇవ్వకుండా, రాష్ట్రాల అధికారాలకు కత్తెరవేస్తూ, జాతీయ సమగ్రత పేరుతో ప్రాంతీయ ఆకాంక్షలను నేలరాస్తూ, వేర్పాటువాదులుగా ముద్రలువేస్తూ, సైనికబలంతో సమస్యలను పరిష్కరిద్దామనే వ్యూహం లెక్కలేనన్ని విపరిణామాలకు దారితీస్తుంది. హింసనే నమ్ముకునే విపరీత భావజాలాలను సృష్టిస్తుంది. బలూచిస్థాన్ అనుభవం నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం అదే!

బలూచీల హక్కులను నిరాకరించటం పాక్ వ్యవస్థాపకుడైన జిన్నాతోనే మొదలైంది. బలూచిస్థాన్‌ని నియంత్రించటానికి తన నేతృత్వంలో ఒక సలహా మండలిని ఏర్పాటు చేసుకున్నారు. సర్వాధికారాలు కేంద్రం గుప్పిట్లో పెట్టుకునే వ్యవహారాలు అట్లా ఆనాడు మొదలయ్యాయి. అయూబ్ ఖాన్ సైనిక పాలనలో (1958) దేశం మొత్తాన్ని రెండు విభాగాలు చేశారు. దాన్నే 'వన్ యూనిట్ స్కీం'గా పిలిచేవారు. తూర్పు బెంగాల్‌ను ఒక యూనిట్‌గా, పశ్చిమ ప్రాంతాలను మరో యూనిట్‌గా పరిగణించటంతో రాష్ట్రాల హక్కులన్నీ హరించుకుపోయాయి. ఆ పరిస్థితిని వ్యతిరేకిస్తూ బలూచిస్థాన్‌లో మొదలైన ప్రతిఘటనను సైన్యంతో అణచివేశారు. 1962లో వామపక్ష అనుకూల జాతీయవాదులకూ ఆ పరిస్థితి తప్పలేదు. 1973 నుంచి 1977 వరకూ సాగిన అణచివేత బలూచిస్థాన్ చరిత్రలోనే అత్యంత ఘోరమైంది. 5300 మంది గెరిల్లాలూ, 3300 మంది సైనికులూ మరణించారు. పౌరుల మరణాలకు లెక్కేలేదు. 55000 బలూచీలు ఆయుధాలు పట్టారు. ఎన్నుకున్న ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయటంతో ఆనాటి ప్రతిఘటన రాజుకుంది. పాక్‌లో వయోజన ఓటు హక్కు కింద మొదటి ఎన్నికలు 1970లోనే జరిగాయి. ఇక ఆ ఏడాదే బలూచిస్థాన్‌కు రాష్ట్ర ప్రతిపత్తినీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన నేషనల్ అవామీ పార్టీ స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వటం మొదలుపెట్టింది. బలూచీ ఆకాంక్షలను ఒక్కొక్కటిగా తీర్చటానికి అడుగులు వేయటం ప్రారంభించింది. పాక్ పాలకులకు అవి జాతి వ్యతిరేక చర్యలుగా కనపడ్డాయి. ప్రధానిగా జుల్ఫికర్ అలీ భుట్టోను పదవీచ్యుతుణ్ని చేసిన సైనిక పాలకులు కాల్పుల విరమణను ప్రకటించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో రష్యా సేనల ప్రవేశంతో (1979) పరిస్థితి మారిపోయింది. బలూచీల పోరాటం వెనుకపట్టు పట్టింది. 1999లో ముషారఫ్ సైనిక పాలన రావటంతో మళ్లీ చిచ్చురగిలింది. చైనా-పాక్ ఎకనమిక్ కారిడార్‌లో భాగమైన గ్వాదర్ పోర్టు నిర్మాణంతో మొత్తం కారిడార్‌పైనే వ్యతిరేకత తలెత్తింది. స్వదేశీ-విదేశీ పెత్తనాలపై బలూచీల పోరాటం మళ్లీ ఉధృతమైంది. 2005 నుంచి పరిస్థితి రగులుతున్న రాక్షసి బొగ్గులలాగానే తయారైంది. ఒకప్పుడు తెగల నాయకుల నుంచి నాయకులూ, గెరిల్లాలూ వస్తే రెండు దశాబ్దాల నుంచి మధ్య తరగతి, నగర జీవుల నుంచి ఆందోళనకారులు పుట్టుకొస్తున్నారు. రకరకాల పేర్లతో బలూచీ విముక్తి దళాలు రంగంలోకి వచ్చాయి. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, కిడ్నాపులు, ఆత్మాహుతి దాడులు, భద్రతా దళాలపై బాంబులు వేయటం నిత్యకృత్యంగా మారిపోయాయి.



■ రాహుల్ కుమార్

> 1947కు ముందు నుంచీ కూడా ప్రత్యేక దేశంగా ఉండటానికి బలూచీలు గట్టిగానే ప్రయత్నించారు. పాక్‌లో బలవంతంగా కలిపేసుకున్నా ఒక రాష్ట్రంగా సొంతంగా వ్యవహారాలు నడిపే హక్కుని కూడా ఇవ్వకపోవటంతో బలూచీల విషాదం మొదలైంది.

ఆఫ్గాన్ సరిహద్దులోని పష్తూన్ ప్రజల్లో ప్రాబల్యాన్ని పెంచుకున్న తాలిబాన్ తీవ్రవాదం, బలూచీల తిరుగుబాటు పాక్ పాలిట ప్రస్తుతం పెను సమస్యలుగా మారాయి. అధికారంలో ఏళ్లపాటు ప్రాతినిధ్యం లేకుండా చేసి, ఆర్థికంగా అట్టడుగుకు నెట్టేస్తే ఉత్పన్నమయ్యే పరిణామాలకు సూచికగా, బలూచిస్థాన్‌ను నిదర్శనంగా పేర్కొంటూ ఎన్నో విశ్లేషణలు వచ్చాయి. పాక్‌లో విస్తీర్ణం పరంగా బలూచిస్థానే పెద్ద రాష్ట్రం. కానీ జనాభాపరంగా దిగువన ఉంది. నిరుద్యోగం, నిరక్షరాస్యత ఎక్కువ. తలసరి ఆదాయం తక్కువ. నీటి సౌకర్యాలు అంతంత మాత్రమే. వ్యవసాయంపై ఆధారపడటం కష్టం. పశుపోషణే ఒకప్పుడు ప్రధానంగా ఉండేది. సహజవాయువు, ఖనిజ వనరులు, ముడి చమురు నిల్వలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. వీటిపై వచ్చే రాయల్టీల్లో సింహభాగం ఇప్పటికీ పంజాబీ, సింధీలే తన్నుకుపోతున్నారు. ఉన్నత, సాధారణ ఉద్యోగాల్లోనూ పంజాబీ, సింధీలదే ఆధిపత్యం. వ్యాపార, పరిశ్రమలూ వీరి చేతుల్లోనూ ఉన్నాయి. ఇక మిలటరీలో పంజాబీల గుత్తాధిపత్యానికి తిరుగులేదు.

బలూచీ చరిత్ర చెప్పే సత్యం ఒక్కటే. రాజకీయ, ఆర్థిక అధికారాల్లో సముచిత ప్రాతినిధ్యం ఇవ్వకుండా, రాష్ట్రాల అధికారాలకు కత్తెరవేస్తూ, జాతీయ సమగ్రత పేరుతో ప్రాంతీయ ఆకాంక్షలను నేలరాస్తూ, వేర్పాటువాదులుగా ముద్రలువేస్తూ, సైనికబలంతో సమస్యలను పరిష్కరిద్దామనే వ్యూహం లెక్కలేనన్ని విపరిణామాలకు దారితీస్తుంది. హింసనే నమ్ముకునే విపరీత భావజాలాలను సృష్టిస్తుంది. బలూచిస్థాన్ అనుభవం నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం అదే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

విద్యుత్ వాహనాలకు కొత్త విధానం

అన్ని దేశాలు తమ సమస్త వాహనాలను విద్యుదీకరించవలసిన అవసరమున్నది. ఇందుకు మూడు కీలక కారణాలు ఉన్నాయి. అవి: మొదటిది– వాతావరణ మార్పు. రవాణా రంగం చమురు– పెట్రోల్, డీజిల్ – ను భారీ పరిమాణంలో వినియోగించుకుంటున్నది. ప్రపంచ వ్యాప్తంగా వార్షిక కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలలో రవాణా రంగం వాటా ఇంచుమించు 15 శాతంగా ఉన్నది. చమురుకు ప్రత్యామ్నాయంగా విద్యుత్‌ను వినియోగించుకునే జీరో-ఎమిషన్ వెహికల్స్ లేదా విద్యుత్ వాహనా(ఈవీ)లను కాలుష్యకారక ఉద్గారాల సమస్యకు పరిష్కారంగా పరిగణిస్తున్నారు; రెండు– స్థానిక కాలుష్యాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో జీరో-ఎమిషన్ వాహనాలను వినియోగించుకోవాలి. ఇది మన నగరాలను కాలుష్యరహితంగా ఉంచేందుకు చాలా ముఖ్యం; మూడు– వాహనాల విద్యుదీకరణ వల్ల చమురు వినియోగం తగ్గిపోయి విలువైన విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఈ మూడు కారణాలు సుసంగతమైనవే. అయితే ఇవి మాత్రమే ఆవశ్యక మార్పుకు దోహదం చేయలేవు. విద్యుత్ వాహనాల విషయంలో మనం ఏం చేస్తున్నాం, ఎందుకు చేస్తున్నాం అనే దాన్ని సమీక్షించుకోవాలి. తద్వారా వాహన విద్యుదీకరణ ఎజెండాను పటిష్ఠంగా అమలుపరచుకోవడమే కాకుండా తక్షణమే అవసరమైన ప్రయోజనాలను పొందగలుగుతాం.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

నగరాలలో వాహనాల విద్యుదీకరణ వల్ల పలు ప్రయోజనాలు సంయుక్తంగా సమకూరుతాయి. వాయు కాలుష్యం తగ్గుతుంది, విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది; హరిత గృహ వాయు ఉద్గారాల నివారణతో విశేష లబ్ధి చేకూరుతుంది. 2030 సంవత్సరం నాటికి దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం ఏ స్థాయిలో ఉంటుందో 2019లో నీతి ఆయోగ్ అంచనా వేసింది: ఈవీల విక్రయాలు కొత్త వాణిజ్యకారుల అమ్మకాలలో 70 శాతం; ప్రైవేట్ కారులలో 30 శాతం, బస్సుల అమ్మకాలలో 40 శాతం, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అమ్మకాలలో 80 శాతం మేరకు ఉండాలి. 2025 సంవత్సర నడిమికాలానికి మనం ఆ లక్ష్య పరిపూర్తికి చాలా దూరంలోనే ఉండిపోయాం. ఒక్క త్రిచక్ర వాహనాల విషయంలో మాత్రమే పురోగతి కనిపిస్తోంది.

మనం శ్వాసిస్తున్న విషవాయువులకు కారణం పెద్ద వాహనాలు అన్న వాస్తవాన్ని విస్మరించలేం. ఏ ఏ రకం వాహనాలు– బస్సులు, లారీలు, కార్లు మొదలైనవి ఏ స్థాయిలో వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయనే విషయాన్ని అటుంచి, రోడ్లపై ఆయా వాహనాల సంఖ్య లెక్కకు మిక్కుటంగా ఉండడంతో రద్దీ విపరీతంగా పెరిగిపోయి వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. ఈ దృష్ట్యా వాయు కాలుష్య నియంత్రణ విధిగా కాలుష్యకారకం కాని వాహనాల వినియోగం పెరుగుదలకు, రోడ్లపై మొత్తంగా వాహనాల సంఖ్య తగ్గుదలకు దోహదం చేయాలి. ఈ శతాబ్ది తొలినాళ్లలో ఢిల్లీలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)తో నడిచే వాహనాలను వినియోగించడం ప్రారంభమయింది. ఏ నగరంలో అయినా బస్సులు, టాక్సీలు, ఆటో రిక్షాలు ప్రయాణం చేసిన దూరం అధికంగా ఉండడం కద్దు. ఇది ఢిల్లీలో మరీ ఎక్కువగా ఉంటుంది. వాహనాలు ప్రయాణం చేసిన దూరం ఎంత ఎక్కువగా ఉంటుందో వాటి నుంచి ఉద్గారాలు కూడా అంత అధికంగా ఉంటాయని నిపుణులు నిర్ధారించారు.



> నీతి ఆయోగ్ 2019లో అంచనా వేసిన విధంగా విద్యుత్ వాహనాల విక్రయాలు పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా రోజూ పదివేల కొత్త ప్రైవేట్ కార్లు రోడ్ల మీదకు వస్తున్నాయి. నగరాలలో ట్రాఫిక్ రద్దీ మూలంగా వాహనాల సగటు వేగం తగ్గిపోయి కాలుష్యం పెరిగిపోతోంది. విద్యుత్ వాహనాలను ఇతోధికంగా పెంచడంతో పాటు రోడ్లపై మొత్తం వాహనాలు తక్కువగా ఉండేలా చేసినప్పుడే వాయు నాణ్యత మెరుగుపడుతుంది.


ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణ కథ సవ్యంగా సాగలేదు. సీఎన్‌జీ వాహనాలను ప్రవేశపెట్టిన రెండు దశాబ్దాల తరువాత కూడా రోడ్లపై వాహనాల సంఖ్యను తగ్గించేందుకు వీలుగా ప్రజా రవాణా వ్యవస్థను తగిన విధంగా మెరుగుపరచలేదు. దేశ రాజధాని నగరంలో ప్రతిరోజూ దాదాపు 1800 కొత్త వ్యక్తిగత వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. వీటిలో ప్రైవేట్ వాహనాలు 500కు పైగా ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతిరోజూ 10,000కు పైగా కొత్త ప్రైవేట్ కార్లు రోడ్ల మీదకు వస్తున్నాయి. ఆసేతు హిమాచలం రహదారులపై నానా రకాల వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. కొత్త ఫ్లైఓవర్లు, సరికొత్త రోడ్లు ఎన్ని నిర్మించినా వాహనాల రాకపోకలకు తరచు అంతరాయమేర్పడుతూనే ఉంది. ప్రజలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంటున్నారు. వాహనాల గమన వేగం తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల పర్యవసానాలను సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌లోని నా సహచరులు సమగ్రంగా అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా రెండు ప్రదేశాల మధ్య ప్రయాణించడానికి ఎంత సమయం పడుతుందో వివరణాత్మక రికార్డు నందించే 'గంటవారీ ప్రయాణ సమయ డేటా' (Hourly travel time data)ను విశ్లేషించారు. ఢిల్లీలో, వాహనాల సగటు వేగం రోడ్లపై వాహనాల రద్దీ ఉదయం పూట అత్యంత రద్దీగా ఉన్న వేళల్లో వాహనాల సగటు వేగం 41 శాతం తగ్గిపోతుందని, సాయంత్రం పూట రద్దీ తీవ్రంగా ఉన్న సమయంలో 56 శాతం తగ్గుతుందని వెల్లడయింది.

నగరాలలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) కాలుష్యకారక వాయువులను ఉద్గారించని వాహనాల సంఖ్య పెరుగుదలకు, రోడ్లపై రాకపోకలు సాగించే మొత్తం వాహనాల సంఖ్య తగ్గుదలకు తోడ్పడాలి. కొత్త విద్యుత్ వాహనాల సంఖ్యను పెంచడమే కాదు, ట్రాఫిక్‌లో వాటి మోడల్ వాటా (ఇతర రకాల వాహనాలతో పోలిస్తే ఈవీలు అయిన వాహనాల నిష్పత్తిని సూచిస్తుంది) ఇతోధికంగా పెరగవలసి ఉన్నది. ఇందుకు అనుగుణంగా నగరాలలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచాలి. ఇది జరిగినప్పుడు మాత్రమే మనం నిర్మలమైన గాలిని శ్వాసించగలుగుతాం. దైనందిన రాకపోకలపై సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోగలుగుతాం. ఆఖరుగా అసలు ప్రశ్న : భారత్‌లో గానీ, మిగతా ప్రపంచ దేశాలలో గానీ ప్రైవేట్ విద్యుత్ వాహనాల అవసరం నిజంగా ఉన్నదా?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఆఫ్రికా సాహితీ ఆత్మ గూగీ

గూగీ వా థియాంగో కెన్యా రచయిత. ఆయన ప్రసిద్ధ నవల 'వీప్ నాట్ చైల్డ్' (1964) తూర్పు ఆఫ్రికన్ రచయిత రాసిన ప్రప్రథమ ప్రధాన ఆంగ్ల నవల. ఆఫ్రికాలో వలసవాద ప్రభావాలను నిశితంగా నిరసించి తన ప్రజల భాషలో రాయడం ప్రారంభించారు. ఒక రచయితగా గూగీలో వచ్చిన ఈ మార్పే ఆయనకు అంతర్జాతీయంగా ప్రఖ్యాతిని సమకూర్చింది. గూగీ సాహిత్యంపై పరిశోధన చేసి నేను పిహెచ్.డి పట్టా పొందాను. తనకు నోబెల్ సాహిత్య పురస్కారం లభించగలదని ఆయన ఆశించారు. అయితే పురస్కార నిర్ణేతలు తమ సొంత పరిగణనలనే ప్రమాణంగా తీసుకున్నారు. మహాత్మాగాంధీ కూడా ఇదేవిధంగా భారత్, దక్షిణాఫ్రికా ప్రజలకు, విశాల ప్రపంచానికి చేసిన సేవలకు నోబెల్ శాంతి పురస్కార నిర్ణేతల గుర్తింపును పొందలేకపోయారు. గూగీ తన ప్రవాస జీవితాన్ని అట్లాంటాలోనే గడిపారు. ఆయన కుమార్తె తండ్రి మరణాన్ని 'ది గార్డియన్'లో రాసిన వ్యాసం ద్వారా ప్రపంచానికి వెల్లడించారు.



'I Will Marry When I Want' అనే నాటకాన్ని గూగీ రాశారు. ఈ నాటక రచనా సమయంలో ఆయన నైరోబి విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగంలో ప్రధానాచార్యుడుగా ఉన్నారు. ఆయన తన ప్రజలు మాట్లాడే గికుయు భాషలో రచనలు చేశారు. ఈ కారణంగానే అసంఖ్యాక ప్రజలు ఆయన నవలలు, నాటకాలు, ఇతర రచనలను అమితంగా అభిమానించారు. ప్రజల ప్రతిస్పందనలకు ముగ్ధుడైన గూగీ సొంత భాషలోనే రాయాలని దృఢంగా నిర్ణయించుకున్నారు, తుదిదాకా కట్టుబడి ఉన్నారు. గికుయు భాషలో రాసిన 'Citani Marthabani'ని ఆంగ్లంలోకి 'Devil on the Cross'గా అనువదించారు. ప్రవాసం నుంచి నైరోబీకి రెండో పర్యాయం వెళ్లినప్పుడు, మొదటిసారి వెళ్లినప్పుడు గురైన నిర్బంధం కంటే చాలా ఘోరమైన పరిస్థితిని ఆయన చవిచూడవలసి వచ్చింది.

నేను కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ప్రధానాచార్యుడుగా ఉన్నప్పుడు గూగీ సాహిత్యాన్ని ఎంఏ సిలబస్‌లో చేర్చాను. నేను గూగీ సాహిత్యంపై డాక్టొరేట్ తీసుకున్నానని, తాము ఒక గొప్ప ఆఫ్రికన్ సాహిత్యవేత్త రచనలను చదువుతున్నామని తెలిసి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన నా విద్యార్థులు సంతోషించేవారు. ప్రతి జనవరి 1న ఆయనకు నేను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేవాణ్ణి. ఆయన ఎంతో ప్రేమాదరాలతో ప్రతిస్పందించేవారు. నేను నాలుగున్నర సంవత్సరాల పాటు ఆఫ్రికాలో బోధించాను. అక్కడ ఉన్నప్పుడు ఆయన్ని చాలా పర్యాయాలు కలిశాను. ఆయననూ, ఆయన భార్యను ఒకసారి నా గృహానికి ఆహ్వానించాను. భారతీయ దైవ పురుషులలో ఒకరైన కృష్ణుడు తన మాదిరిగానే నలుపు రంగులో ఉంటాడని చెప్పినప్పుడు గూగీ చాలా సంతోషించారు.

■ కంచర్ల ఇంద్రసేనారెడ్డి
విశ్రాంత ఆచార్యులు, కాకతీయ విశ్వవిద్యాలయం

దిగజారిపోతున్న నైతిక విలువలు


బంధాలు, అనుబంధాలు కనుమరుగవుతున్నాయి. ఆస్తి సమానంగా పంచినా ఇంకా ఎక్కువ ఆశించటం; కూతుళ్లకు ఇచ్చారని చనిపోయిన తల్లిదండ్రులకు తలకొరివి పెట్టకుండా మొఖం చాటేయడం జరుగుతున్నాయి. అలాంటి వారికి గ్రామ పెద్దలు దహన సంస్కారాలు జరిపించిన ఘటనలు ఉన్నాయి. ఆస్తి కోసం సొంత అన్నదమ్ముల్ని హత్య చేయడం, ఆస్తి రాయించుకుని తల్లిదండ్రులను వీధిపాలు చేస్తున్న ఘటనలు కూడా చాలా ఉన్నాయి. వృద్ధాప్యంలో అండదండలుగా ఉంటారనుకున్న కొడుకులు, కూతుళ్లు పట్టించుకోకపోవడంతో భిక్షాటన చేస్తున్న వారి వార్తలు పేపర్లలో చూస్తూనే ఉన్నాం. వృద్ధాప్యంలో దిక్కులేని పక్షులుగా జీవించే కంటే, చావే నయమని కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోయి, చిన్న కుటుంబ వ్యవస్థ వచ్చింది. నైతిక విలువలు, మానవతా విలువలు మృగ్యమైపోతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ఇప్పుడు యువకులుగా ఉన్నవారు మున్ముందు వృద్ధులవుతారు. అప్పుడు తమ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలి.

– అయినం రఘురామారావు

అణుశక్తి పరిశోధనల పథనిర్దేశకుడు

ఇటీవలే భారతదేశం ఇద్దరు అణు విజ్ఞానవేత్తలను కోల్పోయింది. వారిలో ఒకరు ఆర్. చిదంబరం కాగా, మరొకరు ఎం.ఆర్ శ్రీనివాసన్. మే 20న శ్రీనివాసన్ ఊటీలో కన్నుమూశారు. అటామిక్ ఎనర్జీ కమిషన్ అయిదవ ఛైర్మన్‌గా శ్రీనివాసన్ సేవలు అనుపమానమైనవి. హోమీ జహంగీర్ బాబా, విక్రమ్ సారాభాయ్, హెచ్.ఎన్. సేత్నా, రాజా రామన్న తర్వాత భారతదేశపు అణుశక్తి పరిశోధనలకు శ్రీనివాసన్ బాధ్యత వహించారు. వియన్నాలోని అంతర్జాతీయ సంస్థలోనూ సేవలందించారు. మనదేశంలో అణుశక్తి వాడకం సురక్షితమైనదని పబ్లిక్ డిబేట్ ప్రారంభించిన తొలి శాస్త్రవేత్త.

ఎం.ఆర్.ఎస్.గా ప్రఖ్యాతులైన మాలూరు రామస్వామి శ్రీనివాసన్ 1952లో కెనడాలోని మ్యాగ్గిల్ యూనివర్సిటీలో చేరి 'కంబషన్ ప్రాబ్లమ్స్ ఇన్ గ్యాస్ టర్బైన్స్'పై పరిశోధన చేశారు. 1954లో పీహెచ్‌డీ పట్టా పొందారు. 1955లో భారతదేశానికి తిరిగి వచ్చి పాతికేళ్ల వయసులో డాక్టర్ హోమీ జహంగీర్ బాబా నేతృత్వంలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ'లో శాస్త్రవేత్తగా చేరారు.



అప్పటికే నిర్మాణంలో ఉన్న భారతదేశపు తొలి అణు రియాక్టర్ 'అప్సర'లో చురుకుగా పని చేశారు. 1959లో తొలి అటామిక్ పవర్ స్టేషన్ నిర్మాణానికి ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆసియాలో రష్యా తర్వాత మనదేశంలోనే అటామిక్ పవర్ స్టేషన్ విజయవంతంగా ప్రారంభమైంది. దీనికి శ్రీనివాసన్ చేసిన కృషి చాలా ఉంది. అనంతర కాలంలో మద్రాసులో అటామిక్ పవర్ స్టేషన్ చీఫ్ ప్రాజెక్ట్ ఇంజినీర్‌గానూ శ్రీనివాసన్ బాధ్యతలు నిర్వర్తించారు. 1974లో పవర్ ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ డివిజన్ డైరెక్టర్‌గానూ, 1984లో న్యూక్లియర్ పవర్ బోర్డ్ ఛైర్మన్‌గాను బాధ్యతలు స్వీకరించారు. 1987లో భారతదేశపు అటామిక్ ఎనర్జీ కమిషన్ అయిదవ ఛైర్మన్‌గా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెక్రటరీగా, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్‌గానూ సేవలందించారు.

శ్రీనివాసన్ హయాంలో తలపెట్టిన 18 న్యూక్లియర్ పవర్ యూనిట్స్‌లో ఏడు ప్రారంభం కాగా, మరో ఏడు నిర్మాణంలో, మిగిలిన నాలుగు ప్రణాళికల స్థాయిలోనూ ఉన్నాయి. 1990లో అటామిక్ ఎనర్జీ కమిషన్ ఛైర్మన్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత రెండేళ్ల పాటు వియన్నాలోని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి సీనియర్ అడ్వైజర్‌గా కొనసాగారు. మనదేశంలో ఎనర్జీ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించి 1996–98 మధ్యకాలంలో ప్రణాళిక సంఘం సభ్యుడిగా సేవలందించారు. 2002–2004తో పాటు 2006–2008 కాలంలోనూ 'నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డ్' సభ్యులుగా ఉన్నారు. అలాగే కర్ణాటకలో 'హయ్యర్ ఎడ్యుకేషన్ టాస్క్‌ఫోర్స్' ఛైర్మన్‌గా రెండేళ్ల పాటు సేవలందించారు. వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ న్యూక్లియర్ ఆపరేటర్స్ వ్యవస్థాపక సభ్యుడైన శ్రీనివాసన్‌ను 1984లో పద్మశ్రీ, 2015లో పద్మవిభూషణ్ వరించాయి. పదవీ విరమణ అనంతరం ఆయన ఊటీలో స్థిరపడ్డారు. శ్రీనివాసన్ మొత్తం మూడు పుస్తకాలు రచించారు. వాటిలో 'ఫిషన్ టు ఫ్యూషన్: ది స్టోరీ ఆఫ్ ఇండియన్ అటామిక్ ఎనర్జీ ప్రోగ్రామ్' ప్రముఖమైనది. శ్రీనివాసన్ భార్య గీత. ఆమె ఇంటాక్ సంస్థ నీలగిరి చాప్టర్ కార్యకలాపాల్లో చాలా చురుకుగా పాల్గొనేవారు. వీరికి శారద, రఘువీర్ సంతానం. భారత్, అమెరికాల మధ్య అణు ఒప్పందం జరిగినప్పుడు అనేక విమర్శలు వచ్చాయి. వాటికి మద్రాసులో ఆయన జవాబులు చెప్పిన తీరు నేటికీ ఎంతోమందికి గుర్తుండిపోయే అంశం. భారతదేశపు సంస్కృతీ సంప్రదాయాల మూలాలు తెలిసిన కర్మయోగి వంటి శాస్త్రవేత్త ఎం.ఆర్.శ్రీనివాసన్.

• ఎన్. హంసవర్ధిని

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 కనిష్ఠం 23.8

0006 ఫ్యాన్సీనంబర్‌కు రూ.20.07 లక్షలు


హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రవాణా శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక నంబర్ల వేలంలో టీజీ 08 ఏసీ 0006 నంబర్‌కు రికార్డు స్థాయి ధర పలికింది. రూ.20 లక్షల 07వేల 127 లకు లాడియా డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వేలంపాడి ఈ నెంబర్‌ను దక్కించుకుంది. టీజీ 08 క్యూ 9999 నంబర్‌ను రూ.6.80 లక్షలకు రత్నదీప్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్, టీజీ 08 ఏసీ 0001 నంబర్‌ను రూ.2.01 లక్షలకు శ్రీశిక్ష ఎడ్యుకేషన్ ట్రస్ట్ పొందాయి.



మొలకెత్తిన ధాన్యం

ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతుకు అకాలవర్షం కడగండ్లను మిగిల్చింది. నగర శివారులోని దుండిగల్ ఔటర్ సర్వీసు రోడ్డులో ఎండకు ఆరబెట్టిన ధాన్యం బుధవారం ఆకస్మికంగా కురిసిన వర్షానికి తడిచి ముద్దయింది. ఆ ధాన్యాన్ని వేరుచేసినప్పటికీ ఒక్కరోజు తర్వాత ఏకంగా మొలకలెత్తింది. రేయనక.. పగలనక కష్టపడి పండించిన రైతన్న కన్నీరు పెడుతున్నారు. సర్వీసు రోడ్డులో ప్రయాణించేవారు రైతన్నను ఆదుకోవాలని కోరుతున్నారు.

- దుండిగల్, మే 29 (ఆంధ్రజ్యోతి)



జీవితాంతం అవస్థే

మల్టిపుల్ స్క్లెరోసిస్ అకస్మాత్తుగా అటాక్

నరాలను కప్పే రక్షణ కవచంపై ప్రభావం

మాట రాదు.. వచ్చినా తడబాటే

చూపు మందగింపు

పురుషుల్లో కంటే మహిళల్లోనే ఎక్కువ

ముందే గుర్తిస్తే తీవ్రతకు చెక్

నేడు వరల్డ్ మల్టిపుల్ స్క్లెరోసిస్ డే

6

దేశవాళీ తుపాకులు విక్రయించే
అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

● 5 తుపాకులు, 16 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ తుపాకులు విక్రయించే అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను ఎస్‌వోటీ, బాలానగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎల్‌బీనగర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఎస్‌ఓటీ ఏడీసీపీ షాకీర్ హుస్సేన్‌తో కలిసి రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రామ్‌పూర్‌కు చెందిన మహ్మద్ జీషాన్ అలియాస్ జీఖాన్ (28), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ అమీర్ అలియాస్ అమీర్ అలియాస్ రాజా (24)లు స్నేహితులు. జీషాన్ తన తల్లిదండ్రులతో కలిసి 2016లో నగరానికి వలస వచ్చాడు. కొన్నాళ్లపాటు సెలూన్‌లో పనిచేసి



స్వాధీనం చేసుకున్న తుపాకులను చూపుతున్న సీపీ సుధీర్‌బాబు

మిగతా 6వ పేజీలో..

రిటర్న్ స్టాక్స్ తక్కువ ధరకంటూ బురిడీ
రూ.2.69లక్షలు కాజేత

● సైబర్ మోసానికి బలైన వ్యాపారి



హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): అమెజాన్, ఫ్లిప్‌కార్టులలో ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా రిటర్న్ అయిన వస్తువుల స్టాక్‌ను తక్కువ ధరకు విక్రయిస్తామంటూ నగర వ్యాపారిని బురిడీ కొట్టించిన సైబర్ క్రిమినల్స్ అతని నుంచి రూ. 2.69లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన వ్యాపారికి ఇటీవల ఓ వ్యక్తి ఫోన్ చేసి ఫ్లిప్‌కార్టు, అమెజాన్‌లలో ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా రిటర్న్ అయిన వస్తువుల స్టాక్‌ను హోల్‌సేల్‌గా విక్రయించే విభాగం అధిపతిగా పరిచయం చేసుకున్నాడు. రిటర్న్ అయిన ఫ్యాన్‌లు, బ్యాగులు, టపాసులు, గడియారాలు, బూట్లు, స్కూలు బ్యాగుల స్టాక్ ఎక్కువగా ఉందని, వాటిని తక్కువ

మిగతా 6వ పేజీలో..

స్పెషల్ రూల్స్!

అత్యవసర బృందాల టెండర్ నోటిఫికేషన్‌లో..

కొన్ని సంస్థలకు మేలు చేకూర్చేందుకేనా..?

అధికారుల బినామీ ఏజెన్సీలూ ఉన్నాయని ప్రచారం

బీటీ మిక్స్, విరిగిన చెట్ల కొమ్మల తరలింపు ఎలా

150 వాహనాలు.. యేటా రూ.11.25 కోట్లు

కాలవ్యవధి యేడాది.. పనితీరు బాగుంటే మరో రెండేళ్లు





హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అత్యవసర, తక్షణ మరమ్మతు బృందాల ఏర్పాటు విషయంలో ముందస్తు ఒప్పందాలు జరిగాయా..? కొన్ని సంస్థలకు ప్రయోజనం కలిగేలా టెండర్ నోటిఫికేషన్‌లో జీహెచ్‌ఎంసీ రవాణా విభాగం 'ప్రత్యేక' నిబంధనలు పెట్టిందా..? అంటే ఔనన్న సమాధానమే వినిపిస్తోంది. గతానికి భిన్నంగా ఈ సారి టెండర్ నోటిఫికేషన్ ప్రకటించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాన్‌సూన్ నేపథ్యంలో ప్రతి యేటా అత్యవసర బృందాలు(ఎంఈటీ), తక్షణ మరమ్మతు బృందాల (ఐఆర్‌టీ)ను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తోంది. ఈ బృందాలకు సంబంధించి అద్దె ప్రతిపాదికన వాహనాలు సమకూర్చే టెండర్లను బల్దియాలోని రవాణా విభాగం, కార్మికులు, పరికరాల టెండర్ నోటిఫికేషన్‌ను ఇంజనీరింగ్ విభాగం ప్రకటిస్తుంది. డివిజన్‌కు ఒకటి చొప్పున 150 కొత్త వాహనాల ఏర్పాటు కోసం రూ.11.25కోట్ల ప్రతిపాదనలకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇటీవల పాలనాపరమైన అనుమతులిచ్చారు. జోన్ల వారీగా టెండర్ నోటిఫికేషన్లు ప్రకటిస్తున్నారు. ఖైరతాబాద్ జోన్‌లో బిడ్‌ల దాఖలుకు నేడు ఆఖరు. ఇతర జోన్లలో టెండర్ల ప్రక్రియ వివిధ దశల్లో ఉంది.

గతానికి భిన్నంగా..

ఎంఈటీ, ఐఆర్‌టీల ఏర్పాటు టెండర్లలో గతానికి భిన్నంగా నిబంధనలు ఉండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతకుముందు టాటా ఏస్, ట్రాక్టర్లను ఆయా బృందాల కోసం వినియోగించే వారు. ఈసారి పలు ప్రత్యేకతలతో కూడిన వాహనాల వినియోగానికి బల్దియా ఆసక్తి చూపుతోంది. టీజీఎస్‌పీడీసీఎల్, తెలంగాణ అగ్నిమాపక శాఖలు అత్యవసర, నిర్వహణ పనుల కోసం నిర్వహించే వాహనాల తరహాలోనే ఎంఈటీ, ఐఆర్‌టీల్లో వాడాలని బల్దియాలోని రవాణా విభాగం సర్క్యులర్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. అయితే, టెండర్ నిబంధనల్లో మాత్రం కంపెనీ పేరు ప్రస్తావించకుండా.. ఆ వాహనాల ప్రత్యేకతలను మాత్రమే పొందుపర్చారు. తొమ్మిది ప్యాకేజీలుగా బిడ్‌లు ఆహ్వానించగా.. ఒక్కో సంస్థకు ఒకటి లేదా రెండు ప్యాకేజీలు దక్కేలా ముందస్తు ఒప్పందాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి.

పలు కాంట్రాక్టు సంస్థలకు..

ఎంఈటీ, ఐఆర్‌టీల్లో ప్రత్యేకతలున్న వాహనాలను వినియోగించనున్నారన్న సమాచారం కొన్ని కాంట్రాక్టు సంస్థలకు ముందే అందినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ సంస్థలు వాహనాల కంపెనీతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం. ఇందులో కొన్ని అధికారుల బినామీ ఏజెన్సీలు కాగా.. ఇంకొన్ని కొందరు అధికారులకు సన్నిహితంగా ఉండే కాంట్రాక్టర్లవని చెబుతున్నారు. టెండర్ నోటిఫికేషన్ జారీ అనంతరం కొందరు కాంట్రాక్టర్లు సదరు ప్రత్యేకతలున్న వాహనాల కోసం కంపెనీలను సంప్రదిస్తే ఆరు నెలల వరకు సరఫరా చేయలేమని చెబుతున్నట్టు

మిగతా 6వ పేజీలో..



ఉస్మానియా సూపరింటెండెంట్ నిర్వాకం

● ఆస్పత్రి కారు కేటాయించినా.. అద్దెకు కారు 6

● అదనంగా కిరాయి వసూలు

ఎస్టీపీల పనులు వేగిరం : అశోక్ రెడ్డి 6

నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం


కాప్రాలో అత్యధికంగా 3.7 సెంటీమీటర్ల వర్షపాతం 6



ఎఫ్‌ఆర్‌ఏఎస్ ఎందుకు !

● శానిటరీ జవాన్లు, పీహెచ్ వర్కర్ల అభ్యంతరం

● అక్రమార్జనకు చెక్ పడుతుందనేనా..?



హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ విభాగంలో అక్రమాల నియంత్రణకు ఉన్నతాధికారులు అమలు చేయాలనుకుంటోన్న సంస్కరణలకు క్షేత్రస్థాయిలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేస్తోన్న విధానాన్ని వర్తింపజేయాలన్న ప్రతిపాదనపై రెగ్యులర్ ఉద్యోగులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గురువారం కొందరు ఉద్యోగులు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను కలిశారు. ఇది సంస్థలో చర్చనీయాంశమైంది. నగరంలో రహదారులు ఊడుస్తోన్న 18వేల మంది అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు ముఖ ఆధారిత హాజరు విధానం (ఎఫ్‌ఆర్‌ఏఎస్) ద్వారా హాజరు తీసుకుంటున్నారు. గతంలో బయోమెట్రిక్ విధానం అమలు చేసినా పారిశుధ్య కార్మికుల హాజరు విషయంలో అవకతవకలు జరగడంతో నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇదే విభాగంలో పని చేసే పబ్లిక్‌హెల్త్ (పీహెచ్) కార్మికులు, శానిటరీ జవాన్లకూ ముఖ ఆధారిత హాజరు తీసుకోవాలని తాజాగా సంస్థ నిర్ణయించింది. ఇందుకోసం గురువారం జోనల్ కార్యాలయాలకు వచ్చి

మిగతా 6వ పేజీలో..

మారనున్న అమీర్‌పేట రూపురేఖలు!

● మల్టీ-మోడల్ ఇంటిగ్రేషన్‌తో ట్రాఫిక్ కష్టాలకు చెల్లు

● 500చ.మీటర్ల పరిధిలో పార్కింగ్ జోన్లు.. వెండింగ్ జోన్ల గుర్తింపు

● హెచ్‌ఎండీఏ-ఉమ్టా ఆధ్వర్యంలో పలు శాఖలతో కసరత్తు



అమీర్‌పేట జంక్షన్

హైదరాబాద్ సిటీ, మే29 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట.. హైదరాబాద్ మహానగరంలో అత్యంత రద్దీ గల ప్రాంతాల్లో ఇదొకటి. మెట్రో ఇంటర్‌చేంజ్ స్టేషన్, బస్ స్టేషన్‌లు, పలు రహదారుల కలయిక ఉండడంతో వాహనాల రద్దీ, వ్యాపార లావాదేవీలతో ఈ ప్రాంతం పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. అయితే, ఈ ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు, ఫుట్‌పాత్ వ్యాపారాలకు, పార్కింగ్ సౌకర్యాలకు తగిన స్థలాలను చూపేలా హెచ్‌ఎండీఏలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఉమ్టా) ప్లాన్ చేసింది. పైలెట్ ప్రాజెక్టు పద్ధతిలో మల్టీ-మోడల్ ఇంటిగ్రేషన్ ప్లాన్‌ను తెరమీదకు తెచ్చింది. ఇందుకోసం ఇప్పటికే ట్రాఫిక్, పోలీసు, జీహెచ్‌ఎంసీ, మెట్రో, టీజీఎస్ఆర్టీసీ ఇలా పలు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అడుగులు ముందుకు వేస్తోంది. ఈ విషయంలో ఏడాది నుంచి అంతర్గతంగా సమావేశాలు జరుపుతూ ప్రస్తుతం ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పైలెట్ ప్రాజెక్ట్ అమలయితే అమీర్‌పేట రూపురేఖలు మారనున్నాయి. దీని ఆధారంగా భవిష్యత్తులో నాంపల్లి, సికింద్రాబాద్ తదితర రద్దీ గల ప్రాంతాల్లో మల్టీ-మోడల్ ఇంటిగ్రేషన్‌ను అమలు చేయాలని భావిస్తున్నారు. మెట్రోరైలు, బస్సు, వివిధ ప్రజా రవాణా వ్యవస్థలను ప్రజలకు అందుబాటులో ఉండేలా మల్టీ-మోడల్ ఇంటిగ్రేషన్‌ను తీర్చిదిద్దుతున్నారు. మెట్రో దిగినవారు బస్సు, బస్సు దిగినవారు మెట్రో ఎక్కేందుకు అనువుగా చర్యలు చేపడుతున్నారు. ఇందుకు 500చదరపు మీటర్ల పరిధిని ప్రభావితం చేసేలా వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకోవడానికి అనువైన జోన్లకు ప్రణాళికలు రూపొందించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేలా, రోడ్లను దాటుతూ బస్టాప్‌ల వద్దకు వెళ్లకుండా ఉండేలా రూపకల్పన చేస్తున్నారు. స్వర్ణ జయంతి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న బస్టాప్‌లను మెట్రో స్టేషన్‌కు సమీపంలోకి తీసుకొస్తే ఎలా ఉంటుందనే అంశంపై ప్లాన్ చేస్తున్నారు. అమీర్‌పేట చౌరస్తాలో ఇప్పటికే జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఐలాండ్ పనులు

మిగతా 6వ పేజీలో..

శిథిల భవనాలను ఖాళీ చేయించాలి

● ఇప్పుడు మరమ్మతు చేస్తామంటే అంగీకరించొద్దు

● దుర్ఘటన జరిగితే అధికారిపై చర్యలు తప్పవు

● వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని గ్రేటర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన ఇళ్లలో ఏదైనా దుర్ఘటన జరిగితే సంబంధిత అధికారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో గురువారం జోనల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలున్నాయన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అప్రమత్తంగా

మిగతా 6వ పేజీలో..

నేటి నుంచి సెల్లార్ తవ్వకాలపై నిషేధం 6

సైబర్ నేరాలపై ఉక్కుపాదం

ప్రతి జోన్‌కు ఒక సైబర్ సెల్

ఏడు జెడ్‌సీసీలను ప్రారంభించిన సీపీ

రూ. లక్ష లోపు మోసం కేసులన్నీ జెడ్‌సీసీలోనే విచారణ

హైదరాబాద్ సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలని, ఇకపై ప్రతి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఏడు జెడ్‌సీసీ (జోనల్ సైబర్ క్రైమ్ సెల్)లను సీపీ ప్రారంభించారు.

కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణ

సిటీ కమిషనరేట్ పరిధి పెరిగిపోవడం, నేరాలూ విపరీతంగా పెరగడంతో కమిషనరేట్‌ను పునర్వ్యవస్థీకరించినట్లు సీపీ ఆనంద్ తెలిపారు. కొత్తగా లా అండ్ ఆర్డర్ జోన్స్, పోలీస్ స్టేషన్స్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్స్, ఉమెన్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకు తగ్గట్టుగా సిబ్బందిని కేటాయించామన్నారు.



జోనల్ సైబర్ సెల్ యూనిట్స్‌ను ప్రారంభిస్తున్న సీపీ సీవీ ఆనంద్

రూ.25వేలకు పైబడితే జెడ్‌సీసీలకు

సైబర్ క్రైమ్ యూనిట్స్‌ను పెంచడానికి నిర్ణయించి జీవో నంబర్ 50 ప్రకారం.. నగరంలోని ఏడు జోన్‌లలోని ప్రతి జోన్‌కు ఒక సైబర్ క్రైమ్ యూనిట్ ఉండేలా డీసీపీ

మిగతా 6వ పేజీలో..

రూ.29లక్షలు లూటీ

● స్నేహం ముసుగులో నమ్మక ద్రోహం

● నమ్మికంగా పిలిచి డబ్బు దోపిడీ

● ముఠాను అరెస్ట్ చేసిన బాలాపూర్ పోలీసులు

హైదరాబాద్‌సిటీ, మే29(ఆంధ్రజ్యోతి): నమ్మకంగా ఉంటూ స్నేహితుడి డబ్బును కాజేసే ప్రయత్నం చేసిన ముఠాను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎల్‌బీనగర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. ఎర్రకుంట ప్రాంతానికి చెందిన కబీర్, ఖాదర్‌లు స్నేహితులు. కబీర్ ఓ స్థలం కొనుగోలు కోసం తన మామ జకీర్‌ను రూ.29 లక్షల



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డబ్బు

మిగతా 6వ పేజీలో..

బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి

- సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన సురవరం
- శాసనమండలి చైర్మన్ గుత్తా, జి. చిన్నారెడ్డి

రవీంద్ర భారతి, మే 29(ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన సామాజికవేత్త, కవి, రచయిత, ప్రముఖ సంపాదకులు, బహుముఖ ప్రజ్ఞాశాలిని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి అన్నారు. గురువారం రవీంద్ర భారతిలో నిర్వహించిన సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి దశాబ్దం క్రితమే తెలంగాణ గళం గట్టిగా వినిపించారని, అన్ని సామాజిక వర్గాలలో చైతన్యాన్ని రగిల్చిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఆ మహనీయుని పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. సురవరం గొప్ప పరిశోధకులు అని, సొంతంగా 11 వేల పుస్తకాలు సేకరించి భావితరాల కోసం రెడ్డి హాస్టల్ లైబ్రరీలో భద్రపర్చారని వివరించారు. కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానంద రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. బాలాచారి, ప్రముఖ సాహితీ విమర్శకులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి ఏనుగు నర్సింహా రెడ్డి, సురవరం కృష్ణ వర్ధన్ రెడ్డి, నిర్వాహకులు బడే సాబ్, మనోహర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సరోజినీ దేవి, కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, కవయిత్రి రాధా కుసుమ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ రూల్స్

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. అంటే ముందస్తుగా సమాచారం తెలిసి ఇప్పటికే ఒప్పందం చేసుకున్న సంస్థలు ఎంపికయ్యే అవకాశముంది. ఇదంతా పక్కా ప్లాన్ ప్రకారం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. సాధారణంగా ఎంఈటీ, ఐఆర్‌టీల కోసం సంవత్సరానికోమారు టెండర్లు పిలుస్తారు. ఈ సారి మాత్రం యేడాది కాలవ్యవధికి బిడ్‌లు ఆహ్వానిస్తూ పనితీరు సంతృప్తికరంగా ఉంటే మరో రెండేళ్లు పొడిగిస్తామనే 'ప్రత్యేక' నిబంధన పెట్టారు.

మరమ్మతు పనులపై ప్రభావం

గతంలో వినియోగించిన టాటా ఏస్, ట్రాక్టర్లలో రెండు నుంచి మూడు క్యూబిక్ మీటర్ల బీటీ మిక్స్ తరలించి రోడ్లపై గుంతలు పూడ్చేవారు. ఇప్పుడు పేర్కొన్న ప్రత్యేక వాహనాల్లో ఒక క్యూబిక్ మీటర్‌కు మించి బీటీ మిక్స్ తీసుకెళ్లే అవకాశం ఉండదు. నగరం నడిబొడ్డున ఉన్న చుడిబజార్‌లోని ప్లాంట్ నుంచి శివారు ప్రాంతాలకు ఒక క్యూబిక్ మీటర్ బీటీ తీసుకెళ్లి ఎంత మేర మరమ్మతు చేస్తారు..? వాహనాలు నిత్యం ఎన్నిసార్లు తిరగాల్సి ఉంటుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరమ్మతు పనులపై ఇది ప్రభావం చూపే అవకాశం ఉందన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. గతంలో వర్షాకాలంలో కూలిన/విరిగిన చెట్ల కొమ్మలనూ ఎంఈటీ/ఐఆర్‌టీ బృందాలకు వినియోగించే ట్రాక్టర్లలో తరలించే వారు. కొత్త వాహనాల్లో ఆ పరిస్థితి కూడా ఉండదని ఓ అధికారి పేర్కొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ ఎందుకు!

(5వ పేజీ తరువాయి)

ఇదీ లెక్క..

గ్రేటర్‌లో గుర్తించిన శిథిల భవనాలు	428
మరమ్మతుకు అవకాశం ఉన్నవి	131
నోటీసులు జారీ, నిర్మాణ స్థిరత్వం పరిశీలించాల్సినవి	297

రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సర్కిళ్ల వారీగా ఏఎంఓహెచ్‌లు సూచించారు. ఈ విధానంపై కొందరు జవాన్లు, పీహెచ్ వర్కర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా కేంద్ర కార్యాలయానికి వచ్చి ఎఫ్‌ఆర్‌ఎస్ తమకు వద్దని చెబుతుండడం గమనార్హం. అయితే వీరి అక్రమార్జనకు చెక్ పడుతుందనే కారణంతోనే అభ్యంతరం చెబుతున్నట్లు ఆరోపణలున్నాయి.

పని చేయకున్నా వేతనాలు.. జవాన్లకు మూమూళ్లు

గ్రేటర్‌లో జవాన్ల పర్యవేక్షణలో పీహెచ్ వర్కర్లు రహదారుల స్వీపింగ్ చేయాలి. కానీ చాలామంది పీహెచ్‌సీ వర్కర్లు వేళలు పాటించడం లేదన్న ఫిర్యాదులున్నాయి. కొందరు విధులకు రాకుండా ప్రైవేట్ వ్యక్తులతో పనిచేయిస్తున్నట్లు సమాచారం. తమకు వచ్చే జీతంలో కొంతమొత్తాన్ని (రూ.15వేల నుంచి రూ.18వేలు) వారికి వేతనంగా చెల్లిస్తున్నారు. ఇందుకు అంగీకరించిన జవాన్లకు నెలకు రూ.5 వేల నుంచి రూ.10వేలు ముట్టచెబుతున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు జవాన్లూ సమయపాలన పాటించకపోవడంతోపాటు.. స్వీపింగ్ పర్యవేక్షణను విస్మరించి హోటళ్లు, ఇతర సంస్థల నుంచి వసూళ్లకు ప్రాధాన్యమిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో వారంతా సక్రమంగా విధులకు హాజరయ్యేలా ముఖ ఆధారిత హాజరు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలి

- శుక్రవారం సాయంత్రంలోగా ప్రకటన చేయాలి
- లేకుంటే జూన్ 8న గాంధీ భవన్ ఎదుట నిరసన



చీర, గాజులు ప్రదర్శిస్తున్న లంబాడీ హక్కుల పోరాట సమితి మహిళా విభాగం, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు

పంజాగుట్ట, మే29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి మహిళా విభాగం, గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్ చేశాయి. శుక్రవారం సాయంత్రంలోగా లంబాడీ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని ప్రకటన చేయాలని, లేనిపక్షంలో జూన్ 8న నాంపల్లిలోని గాంధీ భవన్ ఎదుట చీరెలు, గాజులతో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహిస్తామని ఆయా సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్నా పోస్టరును లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ధారావత్ గణేష్ నాయక్, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా, లంబాడి హక్కుల పోరాట సమితి మహిళా విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు పున్నీ బాయి ఆవిష్కరించారు. గాజులు, చీరలను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో పది శాతం ఉన్న లంబాడీ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకుగానే చూస్తోందని, ప్రజాపాలన ముసుగులో లంబాడీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తమ సామాజిక వర్గానికి రాష్ట్ర క్యాబినెట్‌లో స్థానం కల్పించకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించి ఆ పార్టీ అభ్యర్థులను ఓడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో లంబాడి హక్కుల పోరాట సమితి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిత బాయి, ఉపాధ్యక్షురాలు దేవి బాయి, కార్యదర్శి అచ్చి బాయి, వసంతా బాయి, పరుశురాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రూ.29లక్షలు లూటీ..

(5వ పేజీ తరువాయి)

సాయం కోరాడు. దీంతో అతను తన కుమారుడు ఇలియాస్ ద్వారా డబ్బు పంపాడు. ఈ సమయంలో స్థానికంగా కబీర్ లేకపోవడంతో డబ్బును తన స్నేహితుడైన ఖాదర్‌కు ఇవ్వాలని సూచించాడు. ఈ విషయాన్ని ముందస్తుగా ఖాదర్‌కు సైతం చెప్పి డబ్బును భద్రపరచమన్నాడు. దీనిని అవకాశంగా భావించిన ఖాదర్ డబ్బు కాజేసేందుకు ముంతాజ్‌బాగ్ ప్రాంతానికి చెందిన తన బంధువు హబీబ్ హరూన్, చాంద్రయణగుట్టకు చెందిన స్నేహితులు వర్ధన్, రషీద్‌ఖాన్, రషికాంత్ బర్దన్‌లతో కలిసి పథకం పన్నాడు. పథకంలో భాగంగా డబ్బులు ఇచ్చేందుకు వస్తున్న ఇలియాస్‌ను ఎర్రకుంటలోని నిర్మానుష్య ప్రాంతానికి రావాలని లొకేషన్ పంపాడు. ఇలియాస్ తన స్నేహితుడు హబీబుల్లాతో కలిసి డబ్బులు ఇచ్చేందుకు నిర్మానుష్య ప్రాంతానికి వచ్చాడు. ఖాదర్ కోసం వేచిచూస్తున్న అతనిపై పల్సర్ బైక్‌పై వచ్చిన రషీద్‌ఖాన్, రిషికాంత్‌లు కర్రలతో దాడి చేసి డబ్బు లాక్కొని పరారయ్యారు. ఈ దోపిడీ ఘటనపై ఇలియాస్ బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన బాలాపూర్ పోలీసులు నిందితులు ఖాదర్, హరూన్, వర్ధన్, రషికాంత్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.28.20లక్షలు, పల్సర్ బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో రూ.80 వేలను దోపిడీకి సహకరించిన వారికి ఖాదర్ పంచినట్లు సీపీ తెలిపారు. మరో నిందితుడు రషీద్ ఖాన్ పరారీలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రిటర్న్ స్టాక్స్ తక్కువ ధరకంటూ బురిడీ

రూ.2.69లక్షలు కాజేత

(5వ పేజీ తరువాయి)

ధరకు డోర్ డెలివరీ చేస్తామని నమ్మించాడు. అంతేకాకుండా అతని ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డు వాట్సాప్ చేశాడు. అవి నిజమైనవని తేలడంతో బాధితుడు 750 స్కూలు బ్యాగులు, 25 మిస్టు ఫ్యాన్లు, 60 సాధారణ ఫ్యాన్‌లు ఆర్డర్ చేశాడు. అయితే, వాటిని ట్రాన్స్‌పోర్టులో పశ్చిమ బెంగాల్ నుంచి పంపిస్తున్నామని, 5 రోజుల్లో డోర్‌డెలివరీ అవుతాయని, అవసరమైన రవాణా చార్జీలు చెల్లించాలని కోరాడు. దాంతో బాధితుడు ముందుగా రూ.18వేలు బదిలీ చేశాడు. ఆ తర్వాత ఎంతకీ వస్తువులు డెలివరీ కాకపోవడంతో ఆరా తీయగా.. 25రోజుల తర్వాత స్పందించిన నిందితుడు ట్రాన్స్‌పోర్టు వెహికిల్ ప్రాబ్లమ్ వచ్చిందని, వరంగల్ సమీపంలో ఆగిపోయిందని, కొంత డబ్బు పంపిస్తే సమస్య పరిష్కరించుకొని వెహికిల్ బయల్దేరుతుందని సమాధానమిచ్చాడు. తర్వాత రెండు రోజులకు నిందితుడు ఫోన్‌చేసి, తానే స్వయంగా రైల్లో బయల్దేరుతున్నానని నమ్మించాడు. అలా రకరకాలుగా నమ్మించిన నిందితుడు వివిధ కారణాలు చెప్తూ.. విడతలవారీగా రూ.2.69లక్షలు కొల్లగొట్టాడు. ఆ తర్వాత ఎంతకీ వస్తువులు డెలివరీ కాకపోవడంతో బాధితుడు ఆరా తీయగా అది సైబర్ మోసమని తేలింది. బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేస్తున్నారు.

దేశవాళీ తుపాకులు విక్రయించే అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

(5వ పేజీ తరువాయి)

ఆ తర్వాత సొంతంగా నగరంలో మూడు సెలూన్‌లను ప్రారంభించాడు. అందులో పనిచేసేందుకు తన స్నేహితుడు అమీర్‌ను నగరానికి పిలిపించుకున్నాడు. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో యూపీ నుంచి తుపాకులను తెచ్చి నగరంలో విక్రయించాలని ఇద్దరూ పథకం వేశారు. అందులో భాగంగా జీషాన్ ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్‌కు చెందిన తన స్నేహితుడు అర్షిఖాన్‌ను తుపాకులు కావాలని సంప్రదించి, 5 రకాల దేశవాళీ తుపాకులు (తపంచా)లతో పాటు బుల్లెట్లు కొనుగోలు చేసి, నగరానికి తీసుకువచ్చారు. పక్కా సమాచారమందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ, బాలాపూర్ పోలీసులు వీరి కదలికలపై నిఘా పెట్టారు. తుపాకులను బాలాపూర్‌లోని సెలూన్‌లో దాచి పెట్టేందుకు తీసుకువెళుతున్న జీషాన్, అమీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 దేశవాళి తుపాకులు (తపంచాలు), 13 లైవ్ రౌండ్ బుల్లెట్లు, 5 షాట్‌గన్ షెల్స్ రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాలపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

కార్యాలయాల్లో ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ఇకపై రూ. 25 వేల లోపు మోసం కేసులన్నీ లోకల్ పీఎస్‌లలో విచారణ చేస్తారని, రూ.25వేల నుంచి లక్షలోపు మోసం జరిగిన కేసులను లోకల్ పీఎస్‌లోనే రిజిస్టర్ చేసి, వాటి దర్యాప్తు బాధ్యతను జెడ్‌సీసీలకు అప్పగిస్తారని తెలిపారు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తులు వేధింపులకు గురిచేస్తున్నట్లయితే సెంట్రల్ సైబర్ క్రైమ్ పీఎస్‌లో, తెలిసిన వ్యక్తులు వేధింపులకు పాల్పడినట్లయితే లోకల్ పీఎస్‌లోనే కేసులు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తారని తెలిపారు. ఇన్వేస్టిగేషన్‌లో జెడ్‌సీసీల సహకారం తీసుకొని నిందితులను పట్టుకుంటామని సీపీ పేర్కొన్నారు. గత పదేళ్లలో సైబర్ నేరాలు పదిరెట్లు పెరిగాయని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు.

అవగాహన సదస్సులు..

వివిధ రకాల స్కీములతో అమాయకులను, అత్యాశపరులను బురిడీ కొట్టిస్తున్న సైబర్ క్రిమినల్స్.. వారు చేస్తున్న 39 రకాల సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా పాఠశాల స్థాయి నుంచి కాలేజీలు, యూనివర్సిటీలు, కమ్యూనిటీ సెంటర్‌ల వరకు జెడ్‌సీసీ (జోనల్ సైబర్ సెల్) అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తారని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో 7జోన్‌ల డీసీపీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

శిథిల భవనాలను ఖాళీ చేయించాలి

(5వ పేజీ తరువాయి)

ఉండాలన్నారు. ఇప్పుడు మరమ్మతు చేస్తామంటే అంగీకరించవద్దన్నారు. ఆయా నిర్మాణాల్లో ఉంటోన్న వారికి అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. భవనాల నిర్మాణ స్థిరత్వం పరిశీలించి నోటీసులు జారీ చేయాలని, శిథిల భవనాలను సీజ్ చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాల్లో ఉండేందుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని స్పష్టం చేశారు.

నేటి నుంచి సెల్లార్ తవ్వకాలపై నిషేధం

హైదరాబాద్ సిటీ, మే 29త (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో సెల్లార్ల తవ్వకాన్ని తాత్కాలికంగా నిషేధిస్తూ జీహెచ్‌ఎంసీ నిర్ణయం తీసుకుంది. నేటినుంచి వర్షాకాలం ముగిసే వరకు సెల్లార్ల తవ్వకానికి అనుమతి ఇవ్వొద్దని, ఇప్పటికే తవ్వి.. పనులు జరుగుతోన్న సెల్లార్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. నిబంధనలు పాటించని వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సాధారణంగా జూన్ రెండో వారంలో నగరంలో సెల్లార్ తవ్వకాలపై నిషేధం విధిస్తూ బల్దియా నిర్ణయం తీసుకుంటుంది. ముందస్తు వర్షాల నేపథ్యంలో ఈ యేడాది మేలోనే సెల్లార్ల తవ్వకాలను నిషేధించారు.

మారనున్న అమీర్‌పేట రూపురేఖలు!

(5వ పేజీ తరువాం)

తుదిదశకు చేరాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు స్పష్టత ఏర్పడినట్లయింది.

ఫుట్‌పాత్ వ్యాపారాలకు అనువుగా..

పంజాగుట్ట-అమీర్‌పేట రోడ్డు మార్గంలో ఇరువైపులా మూడు లైన్ల రహదారి ఉన్నా కానీ, ఫుట్‌పాత్ వ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే, ఈ మార్గంలోని మూడు లైన్లు అందుబాటులోకి రావాలంటే ఫుట్‌పాత్ వ్యాపారాలన్నింటినీ మరోచోటకు చేర్చేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. సత్యం థియేటర్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో, థియేటర్ ఎదురుగా ఉన్న వన్ వే రోడ్డులో ఓ వైపు ఫుట్‌పాత్ వ్యాపారాలు ఉండేందుకు ప్లాన్ చేస్తున్నారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం మార్గంలో ఓ వైపు ఇప్పటికే ఫుట్‌పాత్ వ్యాపారాలుండగా వాటిని క్రమబద్ధీకరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇది అమలులోకి వస్తే పంజాగుట్ట-అమీర్‌పేట రోడ్డు పూర్తిగా ప్రజా రవాణాకు అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.

పార్కింగ్ జోన్లు సైతం..

అమీర్‌పేటకు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి రెండు రకాల పార్కింగ్ జోన్లకు ప్లాన్ చేస్తున్నారు. వాహనాన్ని నిలిపి అరగంటలోపు ఏదైనా షాపింగ్ చేయాలనేవారికి ఓ రకమైన పార్కింగ్ స్థలాన్ని, కొన్ని గంటలపాటు వాహనాన్ని పార్కింగ్ చేయాలనుకునే వారికి మరో రకమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ రెండు పార్కింగ్ స్థలాల్లో మల్టీలెవల్ పార్కింగ్ విధానాన్ని తీసుకొచ్చేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు.

నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం

- కాప్రాలో అత్యధికంగా 3.7 సెంటీమీటర్ల వర్ష పాతం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. కాప్రా, ఉప్పల్ ప్రాంతాల్లో 3.70 సెంటీమీటర్ల వర్ష పాతం నమోదైనది. వర్షపునీరు రోడ్లపై చేరడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. నేరేడ్‌మెట్, మౌలాలి, ఉస్మానియా యూనివర్సిటీ ,ఈస్ట్ ఆనంద్ బాగ్, ముషీరాబాద్, హబ్సిగూడ ఏఎస్‌రావునగర్ ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఉప్పల్ పరిసరాల్లో కురిసిన వర్షంతో రోడ్లపై నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి మల్కాజిగిరి ఫైర్ స్టేషన్ ముందు భారీగా నీరు నిలిచింది.

నగరంలో కురిసిన వర్షపాతం వివరాలు

కాప్రా	3.7 సెంటీమీటర్లు
ఉప్పల్,మల్లాపూర్	3.7 సెంటీమీటర్లు
నేరేడ్‌మెట్	3.3 సెంటీమీటర్లు
రాజీవ్‌నగర్	2.9 సెంటీమీటర్లు
మౌలాలి	2.6 సెంటీమీటర్లు
ఉస్మానియా యూనివర్సిటీ	2.1 సెంటీమీటర్లు
ముషీరాబాద్	1.8 సెంటీమీటర్లు
హబ్సిగూడ	1..7 సెంటీమీటర్లు
ఏఎస్‌రావ్‌నగర్	1..6 సెంటీమీటర్లు

జీవో జారీ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

బర్కత్‌పుర, మే 29(ఆంధ్రజ్యోతి): బీసీ 42శాతం రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో జారీ చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. జీవో జారీ చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో ఉద్యమ బాట పడుతామని ఆయన హెచ్చరించారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణభారత ఇన్‌చార్జి సూర్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి సన్నాహాలు చేస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసిందని, 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ఇంత వరకు ప్రభుత్వం క్లారిటీ ఇవ్వలేదన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతూ తక్షణమే జీవో జారీ చేస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని, రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటోందని, కేంద్రంపై నెట్టవద్దన్నారు.

బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో బీఆర్ఎస్ నేతల పర్యటన



మూతలేని మ్యాన్‌హోల్‌ను చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

రాజేంద్రనగర్, మే 29(ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో గురువారం మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్ యాదవ్, నాయకులు సోమశ్రీనివాస్ గుప్తా పర్యటించారు. ఈసందర్భంగా వారు ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రతిరోజూ భయంగా గడుపుతున్నామని స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. రోడ్లపై నోరు తెరిచిన మ్యాన్‌హోళ్లతో ఇబ్బందిగా మారిందని, రోడ్లు తవ్వి వదిలేయడంతో రోడ్లపై పెద్దపెద్ద సిమెంటు దిమ్మెలు రాకపోకలకు ఇబ్బందిగా మారాయని గుర్తు చేశారు. విద్యుత్ స్తంభాలు పడిపోయేలా తయారయ్యాయన్నారు. ఇంటికి ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని కోరారు. స్థానిక ప్రజా ప్రతినిధులు బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో పర్యటించి అధికారులకు పనులు చేయాలని సూచించిన అధికారులు చేయడం లేదన్నారు. ఈవిషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్లకాడి సూర్యం, మైసిరెడ్డి, చిరంజీవి, జి.రాజు, హనుమంతు, కార్తీక్, వెంకటరమణ, ఉప్పల్ శ్రీను, అశోక్ కుమార్, భూదేవి, సరిత, మహేశ్, అరుణరెడ్డి, కిషోర్, సందీప్, సునీల్, రమేశ్, రాజ్‌కుమార్, రవి, తిమ్మిగిర్ని రాజు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తై బజార్ వేలం



జల్‌పల్లి కార్యాలయంలో జరిగిన తై బజార్ వేలంలో పాల్గొన్న కమిషనర్

పహాడిషరీఫ్, మే 29(ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ తై బజార్ వేలం రూ.11,03,500, లక్షలుగా పలికింది. మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్‌రామ్ సమక్షంలో గురువారం నిర్వహించిన ఈ వేలంలో ఆరుగురు సీహెచ్ నవీన్‌గౌడ్, మొహమ్మద్ అలీ, ఎస్‌కే అమీర్, బి.నాగభూషణం, ఎండీ అలీ, ఎండీ జమీయుద్దీన్, ముందుకు రావడంతో వేలం నిర్వహించగా రూ.11,03,500, మొహమ్మద్ అలీ దకించుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తై బజార్ దక్కించుకున్నవారు వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు వీధి వ్యాపారుల వద్ద రుసుం వసూలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాము సూచించినంత మేరకే వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవన్యూ అధికారి జ్యోతి, రెవన్యూ ఇన్‌స్పెక్టర్ భానుచందర్, మహమ్మద్ మస్తాన్ వలీ, పాల్గొన్నారు.

నాల్గవ సింహం కవితా సంకలనం ఆవిష్కరణ



కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్

బర్కత్‌పుర, మే 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ దూత రామకోటేశ్వరరావు సారథ్యంలో తీసుకొచ్చిన నాల్గవ సింహం కవితా సంకలనం ఏసీపీ (ఆర్థిక నేరాల విభాగం) కేఎం కిరణ్‌కుమార్ గురువారం బషీర్‌బాగ్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. 54మంది ప్రముఖ కవులు రచించిన కవితలను సంకలనంగా తీసుకురావడం అభినందనీయమని ఆయన అన్నారు. ఇలాంటి మంచి ప్రయత్నాలు పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డాక్టర్ దూత కోటేశ్వర రావు, జేవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ముదిరాజ్ కమ్యూనిటీ విభాగం అధ్యక్షుడు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్‌ను క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ నియామక పత్రం అందజేశారు.
– అఫ్జల్‌గంజ్, మే 29(ఆంధ్రజ్యోతి)



‘నీటి పంపిణీలో కేంద్రం జోక్యం చేసుకోవాలి’

బర్కత్‌పుర, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి, కృష్ణానదుల నీటి పంపిణీలో కేంద్రం జోక్యం చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. నీటి పంపిణీలో తెలంగాణకు నాటి నుంచి నేటి వరకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గత కేసీఆర్, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు వీటిపై పూర్తిస్థాయిలో స్పందించడం లేదన్నారు. గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బచావత్ ట్రిబ్యూనల్, బ్రిజేష్ ట్రిబ్యూనల్‌కు వ్యతిరేకంగా తెలంగాణకు నీటి పంపకంలో వాటా ఇవ్వకుండా ఏపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. గత వైఎస్ జగన్, ప్రస్తుత చంద్రబాబు అదే ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. సముద్రంలో కలిసే నీటిని మాత్రమే తాము వినియోగించుకుంటున్నామని ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడడం సరైంది కాదన్నారు. గోదావరి, కృష్ణానది జలాలను అధికంగా వాడుకుని మరచిపోయి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై మాట్లాడే నైతికహక్కు చంద్రబాబుకు లేదన్నారు.

కమిషన్ కన్నెర్రజేసినా కదలరా?

- చిన్నపాటి సమస్యలను పరిష్కరించడంలో బల్దియా, జలమండలి అధికారుల ఉదాసీనత
- విద్యుత్తు శాఖ అలసత్వం

గన్‌పార్క్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పలు ప్రింట్ మీడియాలో వరుసగా ప్రచురితమైన పలు సమస్యల కథనాలపై మానవ హక్కుల కమిషన్ అధికారుల పనితీరు అలసత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని, పాడైన వాటిని సత్వరమే పునరుద్ధరించాలని బల్దియా అధికారులను హక్కుల కమిషన్ ఆదేశించింది. నగరం నడిబొడ్డున ఉన్నా, అసెంబ్లీకి చేరువలో ఉన్నా ప్రజలకు కానరావడంలేదు.

● రెడ్‌హిల్స్‌లో వారం రోజులుగా ప్రధాన రోడ్డుపై మ్యాన్‌హోల్ పొంగిపొర్లడంతో పాదచారులు, కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిని మానవ హక్కుల కమిషన్ విచారణకు ఆదేశించింది. ఇలాంటివి పునరావృతం కాకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీని ఆదేశించి విచారణకు హాజరుకావాలని కోరింది. ఇలా మచ్చుకు రెండు మాత్రమే. సాక్షాత్తు మానవ హక్కుల కమిషన్ ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినా జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ అధికారులు అలసత్వం వీడటం లేదు. ప్రజా సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని మానవ హక్కుల కమిషన్ ఆదేశించి కన్నెరజేసినా ఆయా శాఖల అధికారులు కదలడంలేదు. క్షేత్రస్థాయిలో సక్రమంగా పర్యటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● బల్దియాలో చిన్నపాటి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పరిష్కారానికి నోచుకోనివి మచ్చుకు కొన్ని సమస్యలు రెడ్‌హిల్స్‌లోని బజార్‌గట్ ప్రధాన రోడ్డులో రూ.1కోటికి పైగా చేపట్టిన మురుగు నీటి సీవరేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫలితంగా జేసీబీ తవ్వకాల్లో పైపులు పగిలి మ్యాన్‌హోల్ నుంచి లీకేజీలు ఏర్పడుతున్నాయి.

ఇదే ప్రాంతంలోని కెమికల్స్ భవన్‌లో విద్యుత్ పోలు శిథిలావస్థకు చేరి ఒకవైపు వంగిపోయింది. అప్పుడో ఇప్పుడో కూలిపోయేందుకు ప్రమాదకరంగా మారింది. అసలే భారీగా దంచుతున్న వర్షాలతో విద్యుత్ సరఫరా సమయంలో పోలు కూలిపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

చిన్న పిల్లల నీలోఫర్, కేన్సర్ ఆస్పత్రి సమీపంలో నిత్యం చెత్తాచెదారం, అధ్వానపు రోడ్లు, అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గాంధీభవన్, నాంపల్లి ప్రధాన రహదారుల పక్కన మ్యాన్‌హోళ్ల నుంచి తొలగించిన పూడిక మట్టిని రోజుల తరబడి తొలగించడంలేదు. మాసబ్ ట్యాంక్, బజార్‌గట్, రెడ్‌హిల్స్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కానరావడంలేదు.



రెడ్‌హిల్స్‌లో ఒక పక్కకు వంగి ప్రమాదకరంగా మారిన విద్యుత్తు పోలు

‘జైజైజై భారత్ జెండా’ పాటకు నృత్య పోటీలు



నృత్యపోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

రవీంద్రభారతి, మే 29(ఆంధ్రజ్యోతి): వందే భారత్ సేవ్ ఇండియా సినిమాలో జాతీయ ఉత్తమ గీత రచయితగా అవార్డు పొందిన సుద్దాల అశోక్ తేజ రాసిన జైజైజై భారత్ జెండా పాటకు నృత్య ప్రక్రియలో నర్తించిన వారికి నగదు బహుమతి అవార్డులు బహూకరిస్తామని చిత్ర నిర్మాత దర్శకుడు మల్లం రమేష్ విలేకరులకు తెలిపారు. ఆ నృత్యం ఎట్టి ప్రక్రియలో నైనా వీడియో చేసి వాట్సప్ 9866140088కు జూలైలోగా పంపాలని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి మసబ్ టాంక్ వద్దనున్న తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. పెహల్గాం సంఘటన తరువాత భారత్ పాక్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల సందర్భంలో ఈ పాట యువత విద్యార్థులకు చేరాలనీ, ఇందుకు మల్లం రమేష్ వినూత్న ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు వేదికపై కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపి వెంకట రమణ సామాజిక కళాకారులు రామడుగు వసంత్ అరుణ సుబ్బారావు వెంకటేశ్వర్లు ఆంజనేయులు, మైపాడు రాజా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయకుండా నిధుల దుర్వినియోగం

- బల్దియా కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా

చాంద్రాయణగుట్ట, మే 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు వేయకుండానే నిధుల దుర్వినియోగంపై బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం దక్షిణ మండలం బల్దియా కార్యాలయం ఎదుట బల్దియా అధికారులకు వేతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చెపట్టారు. ఈసందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. ఐఎస్ సదన్ డివిజన్ వాంబే కాలనీలో రోడ్డు వేయకుండానే నిధులు దుర్వినియోగం చేయడం వెనుక అధికారులకు వాట ఉందని వాపోయారు. నాలుగు సంవత్సరాలుగా జరిగిన పనుల పై ఏసీబీ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అరుణ రెడ్డి, ఆలే భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, సుభాష్ చందర్, మధుకర్‌రెడ్డి, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ కన్వీనర్ ఎడ్ల పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

యూపీలో విద్యుత్ ప్రైవేటీకరణకు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఖైరతాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఉత్తరప్రదేశ్‌లో ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ సంస్థ పిలుపు మేరకు నగరంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మింట్ కాంపౌండ్‌లోని కార్పోరేట్ కార్యాలయం ఎదుట యూపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. యూపీలో 184 రోజులుగా విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని, వారి సర్వీస్ రెగ్యులేషన్లను మార్చి రిమూవల్ చేసేందుకు అక్కడి ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ విద్యుత్ వ్యవస్థలు ప్రైవేట్ పరం కాకుండా ఎంతవరకైనా వెళ్తామని పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా దాదాపు 27 లక్షల మంది విద్యుత్ ఉద్యగులు ఉత్తరప్రదేశ్ ఉద్యోగులకు అండగా ఉన్నారని, వెంటనే అక్కడి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిరసనలో జేఏసీ నాయకులు బీసిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గోవర్ధన్, మోజెస్, శ్రీనివాస్, సదానందం, భూపాల్‌రెడ్డి, తాజుద్దీన్, వరప్రసాద్, వేణు, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

యూసుఫ్‌గూడ, మే 29(ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీసులు ఇద్దరు వ్యక్తుల నుంచి ఒక గ్రాము గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన షేక్ సోహెల్, జవహర్‌నగర్‌కు చెందిన బోయిన్ సతీష్ యూసుఫ్‌గూడ బస్తీ సులబ్ కాంప్లెక్స్ వద్ద అనుమానాస్పదంగా రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసులకు తారసపడ్డారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, గంజాయి తాగుతున్నామని అంగీకరించారు. వారినుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతా..

- బ్లేడ్‌తో చేయి కోసుకున్న యువకుడు

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతా అని బెదిరిస్తూ బ్లేడ్‌తో యువకుడు చేయి కోసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ లక్ష్మీనరసింహనగర్‌లో నివసించే యువతి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ఎంఆర్‌డీగా పనిచేస్తుంది. వెంకటగిరిలో నివసించే సమీప బంధువు ఎస్.అరవింద్ రెండు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నానంటూ వెంబడించాడు. ఆమె ఒప్పుకోలేదు. పట్టు వదలకుండా వెంబడిస్తుండడంతో ప్రేమను అంగీకరించింది. ఇదే విషయాన్ని యువతి తల్లిదండ్రులకు చెప్పగా వారు వ్యతిరేకించారు. దీంతో తాను పెళ్లి చేసుకోలేనని చెప్పింది. ఈనెల 27న ఆమె ఆస్పత్రిలోని పార్కింగ్‌లో ఉండగా, అరవింద్ అక్కడికి వెళ్లాడు. పెళ్లి చేసుకుంటావా? లేదా? అంటూ ప్రశ్నించాడు. ఆమె కుదరదని చెప్పడంతో తనతో తెచ్చుకున్న బ్లేడ్ తీసి చేతిని కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడిని ఆస్పత్రిలో చేర్పించారు. యువతి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. ఘరానా దొంగ అరెస్ట్

- చోరీ సొత్తుతో జల్సాలు, బెట్టింగ్‌లు, డైలీ ఫైనాన్స్
- రూ. 20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను పహాడిషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎల్బీనగర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ గాజులపేటకు చెందిన అల్లం శివ(27) కొంత కాలం క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అంబర్‌పేట బతుకమ్మకుంటలో ఉంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం, గంజాయికి అలవాటుపడ్డ ఇతడు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి, చోరీలు చేశాడు. వ్యసనాలతోపాటు విలాసాల కోసం ఇతడు చోరీల బాటపట్టాడు. అంబర్‌పేట్, వెల్దండ, ఉర్కొండ, మిడ్జిల్, మంచాల, కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 9దొంగతనాలు చేశాడు. ఈ కేసుల్లో పోలీసులు శివను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి 2024 అక్టోబర్‌లో విడుదలైన ఇతడు డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. బెట్టింగ్‌లకు, వ్యసనాలకు డబ్బు సరిపోకపోవడంతో తిరిగి చోరీలు చేయడం ప్రారంభించాడు. పహాడిషరీఫ్ పోలీస్టేషన్, హయత్‌నగర్, ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఏడు ఇళ్లలో చోరీలు చేశాడు. చోరీ చేసిన అనంతరం కేటీఎం బైక్‌పై పరారయ్యేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పహాడిషరీఫ్ పోలీసులు నిందితుడిని గుర్తించారు. చోరీ సొత్తును విక్రయించే ప్రయత్నంలో ఉండగా కాపుకాసిన పోలీసులు షాలిబండ క్రాస్‌రోడ్స్ వద్ద నిందితుడు శివను గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ. 20 లక్షల విలువైన 13 తులాల బంగారు నగలు, 41 తులాల వెండి నగలు, రూ. 50వేలు, కేటీఎం బైక్, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నా రు. చోరీ కేసులు ఛేదించిన పోలీసులను సీపీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, డబ్బు

బీజేపీ నేత ప్రతాప్‌రెడ్డికి నివాళి

రాజేంద్రనగర్, మే 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, రాజేంద్రనగర్ సర్కిల్‌లో బీజేపీ వ్యవస్థాపకుడు, ప్రేమావతిపేట్ వాస్తవ్యులు దివంగత బండి ప్రతాప్‌రెడ్డి వర్ధంతిని శుక్రవారం ఆయన నివాసమైన ప్రేమావతిపేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయన కూతురు దుంబాల ఝాన్సీరెడ్డి, దుంబాల ఉమారెడ్డి, డి.వీరమ్మ, బి. ముకుంద్‌రెడ్డి, అర్వింద్‌రెడ్డి, ఆదిత్యరెడ్డి, మజ్జిగ విజయ్‌కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ రిటైర్డ్ ఉద్యోగులకు కార్యాలయం ఏర్పాటు

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రి రిటైర్డ్ ఉద్యోగుల కోసం సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఆస్పత్రి సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణతో కలిసి డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్‌బాబు, రామరాజు శరత్, డీన్ ప్రొఫెసర్ లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శాంతివీర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/kU7gz33లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

సాంస్కృతిక రంగానికి డోలక్ కృష్ణ సేవలు మరువలేనివి



డోలక్ కృష్ణ (ఫైల్)

గోషామహల్, మే 29(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ, సాంస్కృతిక రంగానికి డోలక్ కృష్ణ చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. రంగనాథ సేవాసమితి కల్చరల్ అసోసియేషన్ మాజ అధ్యక్షుడు, కురుమ సంఘం నాయకుడు డోలక్ కృష్ణ(73) మరణించాడనే సమాచారంతో జియాగూడలోని ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం డోలక్ కృష్ణ అంతిమ సంస్కారాలు బుధవారం సాయంత్రం పురానపూల్ హిందూ శ్మశానవాటికలో జరిగాయి. ఆయన అభిమానులు, కురుమ సంఘం నాయకులు పార్థివదేహంపై పూలవర్షం కురిపించి వీడ్కోలు పలికారు. భౌతిక కాయాన్ని సందర్శించినవారిలో కురుమ సంఘం నాయకులు బండారు నారాయణ, కొలుపుల నరసింహ, కట్ట మల్లేశం, జియాగూడ కార్పొరేటర్ బోయిన దర్శన్, రాష్ట్ర ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ అధ్యక్షుడు పూస నరసింహ, కాలే కృష్ణ, కాలే ఆనంద్, కాలే శ్రీనివాస్, కాలే అమర్నాథ్, కాలే శ్రీకాంత్, కాలే అభిలాష్, కాలే సాయికుమార్, విలాష్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



షేక్ అవైస్

మదీన, మే 29(ఆంధ్రజ్యోతి): మసీదులో నమాజ్‌కని వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈసంఘటన కామాటిపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ షాహిద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... ఫతేదర్వాజ హిమ్మత్‌పురాకు చెందిన షేక్ జైనుద్దీన్ కుమారుడు షేక్ అవైస్(35)కి మతిస్థిమితం సరిగా లేదు. ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈనెల 23న స్థానికంగ ఉండే వజీర్‌అలీ మసీదులో శుక్రవారం నమాజ్ కోసం వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో కూడా చెప్పకుండా వెళ్లిపోయి రెండు మూడు రోజుల తర్వాత వచ్చాడు. ఈసారి కూడా తిరిగి వస్తాడని భావించిన కుటుంబసభ్యులకు ఆరురోజులైనా రాకపోవడంతో కామాటిపురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరానగర్ కాలనీలో మహిళ..



రాజమ్మ(ఫైల్)

ఖైరతాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీలో నివాసముండే ఫాతిమా అలియాస్ రాజమ్మ(43) ఈనెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు బాబు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫాతిమా 5 అడుగుల ఎత్తు, నల్లటి రంగులో ఉంటుందని, తెలుగు, హిందీ మాట్లాడుతుందని, ఇంటి నుంచి వెళ్లిన సమయంలో ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్నదని ఎస్ఐ శ్రీరాములు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గాని, 9912820552ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ప్రేమిస్తున్నా.. నాకు నువ్వు కావాలి

- గృహిణికి మెసేజ్ పెట్టిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): ‘ప్రేమిస్తున్నాను.. నాకు నువ్వు కావాలి’ అంటూ గృహిణికి మెసేజ్ పెట్టిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీ ప్రగతినగర్‌లో నివసించే గృహిణి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లో బోటిక్ నిర్వహిస్తుంది. ఈమె కుమారుడు జూబ్లీహిల్స్‌లోని ఓ పాఠశాలలో చదువుతున్నాడు. అదే పాఠశాలలో దీక్షిత్ చదువుతున్నాడు. గృహిణి కుమారుడికి దీక్షిత్ తన తండ్రి మురళి నెంబర్‌తో తరచూ ఫోన్ చేసేవాడు. కొన్నిరోజుల తర్వాత మురళి గృహిణికి ఫోన్ చేస్తూ దీక్షిత్ చదువు గురించి మాట్లాడేవాడు. ఈనెల 17న ఆమె విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా మురళి అడ్డుపడి మాట్లాడేందుకు ప్రయత్నించాడు. తప్పించుకున్న గృహిణి అతడి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేసింది. మరుసటి రోజు మురళి ఆమెను కలిసి మరోసారి ఇబ్బంది పెట్టను అని చెప్పడంతో అన్ బ్లాక్ చేసింది. కాగా, ఈనెల 27న ఆమె ఫోన్‌కు ‘నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నాకు నువ్వు కావాలి’ అంటూ మురళి ఇంగ్లిష్‌లో మెస్సేజ్ పెట్టినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. మురళిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రేమికురాలికి వేధింపులు

బంజారాహిల్స్, మే 29(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రేమికురాలిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండలో నివసించే యువతి అక్కడే బోటిక్ నిర్వహిస్తుంది. 2024లో అభిలాష్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కొన్నిరోజులు సహజీవనం చేశారు. అభిలాష్ ప్రతీ విషయానికి ఆమెను బెదిరింపులకు గురిచేస్తుండడంతో వేరుగా ఉంటోంది. అభిలాష్ ఆమెను పలు రకాలుగా వేధించడంతోపాటు నకిలీ ఐడీలతో సోషల్ మీడియాలో ఖాతాలు తెరిచి ఆమె ఫొటోలను స్నేహితులకు పంపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఆమె ఉంటున్న అడ్రస్‌కు ఆహార పదార్థాలు ఆర్డర్లు పెడుతూ బిల్లులు చెల్లించేలా చేస్తున్నాడు. ఈ విషయంపై యువతి అభిలాష్‌ను నిలదీయగా, ‘నువ్వు ఎలా పెళ్లి చేసుకుంటావో నేను చూస్తా’ అంటూ బెదిరించాడు. యువతి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను దూషించిన ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం పార్కింగ్ విషయంలో మహిళను దూషించిన ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ బస్తీలో నివసించే ఫరా ప్రైవేట్ ఉద్యోగి. ప్రతీ రోజు ఆమె తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్కింగ్ చేస్తుంది. ఈనెల 25న ఈ విషయమై ప్రభాకర్ పల్లె, మంజుల, మోహన్‌తో గొడవ జరిగింది. ప్రభాకర్, మంజుల రెచ్చిపోయి ఫరాను దుర్భాషలాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవయవదానం.. ఆరుగురికి ప్రాణదానం


అశోక్

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలతో ఆరుగురికి ప్రాణదానం చేశారు. నిమ్స్ జీవన్దాన్ అధికారుల తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా కొండపాక కుకునూర్ పల్లికి చెందిన కె.అశోక్ (32) ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 26న టూవీలర్‌పై వస్తున్నాడు. అకస్మాత్తుగా మరో ద్విచక్రవాహనం ఎదురు రావడంతో వాహనం ఆపే క్రమంలో కింద పడ్డాడు. తలకు గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం అశోక్ బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు తెలిపారు. అతడి భార్య హారికకు అవయవ దానంపై జీవన్దాన్ వైద్యులు అవగాహన కల్పించారు. దీంతో లివర్, కిడ్నీలు, లంగ్, 2 కార్నియస్ సేకరించారు. ఈ అవయవ దానంతో మరో ఆరుగురికి ప్రాణదానం చేశారు.


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

కష్టపడితేనే లక్ష్యాన్ని చేరుకోగలం

బంజారాహిల్స్, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో పాటు కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటేనే భారీ లక్ష్యాలను ఛేదించగలుగుతారని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప అన్నారు. నిమ్స్ పారామెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 33వ వార్షికోత్సవ వేడుకలు ఆసుపత్రి ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన చదువులో విశేష ప్రతిభ కనబరిచిన ఉద్యోగుల పిల్లలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. నేటి విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తమలో ఉన్న ప్రతిభను చాటాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిమ్స్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ సంత్ వీర్, యూనియన్ అధ్యక్షురాలు శాంతకుమారి, ప్రధాన కార్యదర్శి భరత్ భూషణ్, నాయకులు శుభదా, సుధ తదితరులు పాల్గొన్నారు.

'కృషి సంకల్ప్ అభియాన్'ను సద్వినియోగం చేసుకోవాలి

రాజేంద్రనగర్, మే 29(ఆంధ్రజ్యోతి): రైతుల వద్దకు వెళ్లి వారికి వ్యవసాయ సూచనలు, సలహాలు ఇవ్వడానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి జూన్ 12 వరకు చేపట్టనున్న వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) యాక్టింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌సి అగర్వాల్, అటారికి చెందిన డాక్టర్ షేక్ మీరా లు తెలిపారు. నార్మ్ నుంచి ఆరు బృందాలుగా వివిధ జిల్లాల రైతులకు వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించేందుకు వెళ్లిన శాస్త్రవేత్తలకు వారు దిశానిర్దేశం చేశారు. 64 కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా 15 రోజుల పాటు 216 మంది వ్యవసాయ నిపుణులు రైతులకు కావాల్సిన అన్ని సూచనలు సలహాలు అందజేస్తారన్నారు. కాగా, రాజేంద్రనగర్ లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి ఆధ్వర్యంలో 20 మంది ఐఐఎంఆర్ శాస్త్రవేత్తలు ఐదు కేవీకేల పరిధిలో రైతులకు చిరుధాన్యాల పంటలు, వాటి వలన కలిగే లాభాలు, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తారన్నారు.

ఎస్టీపీల పనులు వేగిరం : అశోక్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): ఎస్టీపీల పనుల్లో వేగంపెంచి తుదిదశలో ఉన్న వాటిని ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఈడీ మాయాంక్ మిట్టల్‌తో కలిసి ఆయన అంబర్‌పేట్, అత్తాపూర్ ఎస్టీపీలను సందర్శించారు. తొలుత అంబర్‌పేట్ ఎస్టీపీకి వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. చిన్నచిన్న సివిల్ వర్క్‌లు గార్డెనింగ్, పెయింటింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణం వంటి పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అలాగే సుందరీకరణ పనులను చేపట్టి ప్రాంగణంలో చెత్తాచెదారం తొలగించి నేలను చదును చేయాలని సూచించారు. అనంతరం అత్తాపూర్ ఎస్టీపీని సైతం సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించి మిగిలిపోయిన పనుల్ని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం సుజాత, ఎస్టీపీ ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్, కాలుష్య రహిత సమాజం రావాలి


యూసుఫ్ గూడ, మే 29 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడలని, ప్లాస్టిక్ కవర్‌లు, వస్తువులను నిషేధించి, గోనే, జనపనార, క్లాత్ సంచులను వాడాలని ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ అరోరా అన్నారు. యూసుఫ్‌గూడ నిమ్స్‌మేలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, నిమ్స్ మే ఆధ్వర్యంలో ఎన్విరాల్‌మెంట్ సోషల్ ప్రభుత్వం అనే అంశం పై జాతీయ సమావేశం గురువారం జరిగింది. ఎస్ఈఎం డైరెక్టర్ ఇ.విజయ ప్రారంభోపన్యాసం చేశారు. సీఎఫ్ఐ పూర్తి చేసిన 20 మంది విద్యార్థులకు ఇంటర్నల్ సర్టిఫికె ట్‌లను అందజేశారు. అనంతరం వియుక్త పుస్తకం ఆవిష్కరించారు.

నాలుగు చోట్ల ఎన్ఐఏ తనిఖీలు

హైదరాబాద్ సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): ఎన్ఐఏ అధికారులు నగరంలోని నాలుగు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. వారికి సిటీ పోలీసులు సహకారం అందించారు. ఉగ్రవాద సానుభూతిపరులు, విజయనగరంతో పాటు ఇతర రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర పన్నిన కేసులో సిరాజ్ ఉర్ రహమాన్, సయ్యద్ సమీర్‌ల ఈ అధికారులు విచారిస్తుండటం విదితమే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈ ఇద్దరి రహస్య కార్యకలాపాలపై కూపీ లాగుతున్నారు. ఇందులో భాగంగా నిందితులిద్దరూ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు తేలింది. సికింద్రాబాద్ పరిధిలో రెండు ప్రాంతాలు, పాతబస్తీ పరిధిలోని మరో రెండు ప్రాంతాల్లో ఇటీవల తనిఖీలు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. అధికారులకు తాము సహకరిస్తున్నట్లు తెలపారు.

జీవితాంతం అవస్థ..

మల్టిపుల్ స్క్లెరోసిస్.. ఆకస్మాత్తుగా అటాక్



- నరాలను కప్పే రక్షణ కవచంపై ప్రభావం
- మాట రాదు.. వస్తే తడబాటు తప్పదు
- చూపు మందగింపు
- పురుషుల్లో కంటే మహిళల్లోనే ఎక్కువ
- ముందే గుర్తిస్తే తీవ్రతకు చెక్
- నేడు వరల్డ్ మల్టిపుల్ స్క్లెరోసిస్ డే

హైదరాబాద్ సిటీ, ఖైల్‌కాలనీ మే 29 (ఆంధ్రజ్యోతి) సాధారణంగా మల్టిపుల్ స్క్లెరోసిస్ యువతలో ఎక్కువగా కనిపిస్తోంది. టీనేజీ వయస్సులో మొదలు కావచ్చు. కొందరిలో 20 ఏళ్లలో మరికొందరిలో 30 ఏళ్ల లోపు రావచ్చు. పురుషుల కంటే మహిళల్లోనే ఈ జబ్బు తీవ్రత ఎక్కువ. మరణం ఏర్పడదు కాదు. కానీ జీవితాంతం ఇబ్బంది పెడుతుంది. నయం చేయలేని వ్యాధి అయిన్నప్పటికీ ప్రతీ యేడు పరిశోధనలతో కొత్త పురోగతులు జరుగుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. అవగాహన పెరిగే కొద్దీ, దీని కారణాలు, నివారణలపై పరిశోధనలు మనను ఈ వ్యాధికి ఒక పరిష్కారం గుర్తించే అవకాశాలు ఉంటాయంటున్నారు.

ఆటో ఇమ్యూన్ డిజార్డర్

మల్టిపుల్ స్క్లెరోసిస్ (ఎంఎస్) ఒక ఆటో ఇమ్యూన్ డిజార్డర్. శరీర రక్షణ వ్యవస్థ మన సొంత ఆరోగ్యకరమైన కణాలను ఈ సందర్భంలో నరాలను కప్పే రక్షణ కవచంపై దాడి చేస్తోంది. దీంతో నరాలకు సంకేతాలు సరిగ్గా అందదు. ఈ సమస్యను నివారించడానికి మందులు అందుబాటులో ఉన్నాయి. ఇవి వ్యాధిని పూర్తిగా నయం చేయకపోయినా, వ్యాధి తీవ్రతను తగ్గించడానికి అవకాశముందని వైద్యులు చెబుతున్నారు.

ఆకస్మిత్తుగా మాట పడిపోతుంది. లేకుంటే తడబాటు ఎదుర్కొంటారు. చూపు కూడా మందగిస్తుంది. కాళ్లు చేతులు తిమ్మిరిగా అనిపిస్తుంటే ఇది మల్టిపుల్ స్క్లెరోసిస్ వ్యాధి లక్షణాలు కావొచ్చు. ఈ జబ్బు వచ్చేంత వరకు గుర్తించలేరు. ఒకసారి వస్తే జీవితాంతం అవస్థ పడాల్సిందే. సాధారణంగా అనేక రకాల లక్షణాలతో ఈ వ్యాధి ఉంటుంది. వరల్డ్ మల్టిపుల్ స్క్లెరోసిస్ డే సందర్భంగా 'మల్టిపుల్ స్క్లెరోసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా' అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆ మేరకు ప్రత్యేక కథనం..

ప్రాథమిక దశలో గుర్తిస్తే...



వైద్యుల వద్దకు వచ్చే వంద మందిలో 15 మంది వరకు మల్టిపుల్ స్క్లెరోసిస్ సమస్యతో బాధపడుతున్నారు. రెండు, మూడో దశలో ఆస్పత్రికి వస్తున్నారు. మొదటి దశలోనే ఆస్పత్రికి వస్తే ముమ్ముందు ఇతర సమస్యలను నివారించే అవకాశముంది. ఈ జబ్బును ఎంఆర్ఐ, ఇతర పరీక్షల ద్వారా నిర్ధారించి, తీవ్రత నుంచి తప్పించడానికి అవకాశముంది.

డాక్టర్ శిల్పా కేసిరెడ్డి,
న్యూరాలజిస్టు, మెడికవర్ ఆస్పత్రి

ఉస్మానియా సూపరింటెండెంట్ నిర్వాకం

- ఆస్పత్రి కారు కేటాయించినా.. అద్దెకు కారు
- కిరాయి వసూలు

మంగల్‌హాట్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పతికి చెందిన ఓ సూపరింటెండెంట్ తీరు స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆస్పతి కారు పక్కన పెట్టి అద్దెకు కారు తీసుకుని వినియోగిస్తున్నారు. అందుకు కిరాయి కూడా వసూలు చేస్తున్నారు. విషయానికొస్తే.. గతేడాది ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి ఆసుపత్రి డ్రైవర్ బంధువులకు సంబంధించిన ఇన్నోవా వాహనాన్ని అద్దెకు తీసుకుని వినియోగిస్తున్నారు. ప్రతీ నెల అద్దె రూ. 33,000 వేలు వసూలు చేస్తున్నారు. మొదట్లో ఆ కారు వైట్ నంబర్ ప్లేట్ (హోమ్ ప్లేట్) కలిగి ఉంది. అయితే సూపరింటెండెంట్‌కు ప్రభుత్వ వాహనం ఉన్నప్పటికీ మరో హోమ్ ప్లేట్ వాహనాన్ని అద్దెకు తీసుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కారు డ్రైవర్ ఆసుపత్రికి చెందిన వారు కావడం కూడా గమనార్హం. అద్దె వాహనాన్ని వాడే సమయంలో కచ్చితంగా ఎల్లో నంబర్ ప్లేట్ వాహనాన్ని వాడాలి. లేని పక్షంలో ప్రతీ నెల బిల్లు వచ్చే అవకాశం లేదు. దీంతో ఆ స్థానంలో ఎల్లో నంబర్ ప్లేట్ వాహన పత్రాలను సమర్పించి బిల్లులు పొందినట్లు సమాచారం. ఆసుపత్రిలోని అధికారులందరూ సంబంధిత ఫైల్‌పై సంతకాలు చేయడం గమనార్హం. ఈ అంశంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్‌ను వివరణ కోరగా తాను వాడే వాహనం ఏదో తనకు తెలియదన్నారు. దాని గురించి తెలుసుకుంటానని దాటవేసే ప్రయత్నం చేశారు. అయితే ఆ తర్వాత అద్దెకు తీసుకున్న ఇన్నోవా వాహనాన్ని పంపించి వేసి ప్రభుత్వ వాహనాన్ని తెప్పించుకున్నారు.


ఆసుపత్రి సూపరింటెండెంట్ వినియోగిస్తున్న అద్దె వాహనం



● వెయిట్‌లిఫ్టర్ సాయివర్ధన్‌కు సత్కారం

ఖేలో ఇండియా యూత్ నేషనల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ 89 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన సాయివర్ధన్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సన్మానించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఒలింపిక్స్‌లో పతకం సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. తమ వంతుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి సుధాకర్, శిక్షకులు, తండ్రి శివకుమార్ అథ్లెట్ కోచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు. - హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

వదిలిపెట్టం

- నేపాల్ దొంగలు, అఫ్జల్‌గంజ్ కాల్పుల ముఠా కోసం కొనసాగుతున్న వేట
- దేశంలోనే దాక్కున్నారు
- సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రెండు ఘరానా దొంగల ముఠాలను పట్టుకోవడంలో ఆలస్యం అయ్యిందని, కాని కచ్చితంగా పట్టుకుంటామని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పారిశ్రామిక వేత్త ఇంట్లో భారీ చోరీకి పాల్పడి సుమారు రూ. 5 కోట్లతో ఉడాయించిన నేపాల్ దొంగల ముఠాను, అఫ్జల్‌గంజ్‌లో కాల్పులకు పాల్పడిన ఘరానా అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠాను కచ్చితంగా పట్టుకొని తీరుతామన్నారు. అక్కడ వారి చిరునామాల్లో గాలించగా వారు ఇండియా దాటి నేపాల్‌కు వెళ్లలేదని తేలిందని తెలిపారు. ఇండియాలోనే తలదాచుకున్నారని అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండియా నేపాల్ బార్డర్‌లో లుక్ అవుట్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. దొంగల ఆచూకీ తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఈస్టుజోన్ డీసీపీ : 8712660501, అడిషనల్ డీసీపీ : 8712660503, ఏసీపీ : 8712660506/09, కాచిగూడ ఎస్‌హెచ్‌వో: 8712660540, డీఐ: 8712660541. నంబర్లకు తెలియజేయాల్సిందిగా పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో కాల్పులకు తెగబడిన దోపిడీ దొంగలను పట్టుకోవడంలోనూ ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టమన్నారు.


మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్

అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు

- అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్, ఆలియా ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి .. అధికారులను ఆదేశించారు. గురువారం వాటిని సందర్శించిన ఆయన పాఠశాలలో ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీవుల్లా, డిప్యూటీ ఈఓ వెంకటేశ్వర్లు డిప్యూటీ ఐఓఎస్ గుప్తా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుజాత, కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


నగరంలోని 3 ప్రాంతాల్లో గురువారం అక్రమ ఔషధాల తయారీ సంస్థలపై ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దాడులు నిర్వహించారు. రూ. 3 లక్షల విలువైన నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. గాజులరామారం, మూసారంబాగ్ , మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కూకట్‌పల్లిలో అక్రమ నిల్వలను చేజిక్కించుకున్నారు.
హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ ఓ సముద్రం

- వారు ఎమ్మెల్సీ కవితను వెలివేయడం తగదు
- తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ కాంతం



పంజాగుట్ట, మే29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిందని, వంద సంవత్సరాలకు పైగా చరిత్ర దీని సొంతమని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. ఎప్పుడో ఒకప్పుడు తల్లి లాంటి తమ పార్టీలో చేరాలని వస్తున్నారన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిడ్డ అని చూడకుండా కేసీఆర్, ఇంటి ఆడబిడ్డ అని చూడకుండా కేటీఆర్.. కవితను వెలివేశారని, ఇది బాధాకరం అని అన్నారు. కేటీఆర్ కన్నా కవిత ఎక్కువగా కష్టపడ్డారన్నారు.

9న తెలంగాణ జన సమితి ప్లీనరీ

రాంనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్లీనరీ సమావేశాలను జూన్ 9న నిర్వహిస్తున్నట్లు జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బట్టల రాంచందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్లీనరీ సమావేశాలను గోషామహల్ నియోజకవర్గంలో ఇదేరోజు నిర్వహిస్తున్నామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్థానిక సమస్యలపై సమీక్ష చేస్తామన్నారు. వాటిని అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అతిథిగా ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కోదండరాం సమావేశాలకు హాజరవుతారని తెలిపారు.

దళితుల సంక్షేమంపై కాంగ్రెస్ వివక్ష

- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి కుమార్

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, దళితుల సంక్షేమం పట్ల వివక్ష కనబరుస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ విమర్శించారు. దళితుల సంక్షేమం కోసం ఎంత మేర ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురువారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కుమార్ మాట్లాడుతూ, గురుకులాల్లోని పరిస్థితులపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో గురుకులాలు సందర్శించి విద్యార్థుల సమస్యలపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు, మానవ హక్కుల కమిషన్‌కు నివేదిస్తామని తెలిపారు.

సుస్మితను దూషించిన ఘటనపై విజిలెన్స్ విచారణ

సికింద్రాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): బేగంపేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ సుస్మితను ఖైరతాబాద్ శాసన సభ్యుడు దానం నాగేందర్ అనుచరుడు సుదీప్ పటేల్ దూషించిన కేసులో జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. గురువారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. సర్కిల్ ఇన్‌చార్జి ఉపకమిషనర్ డాకు నాయక్‌తోపాటు ఉపకమిషనర్ పేషీ సిబ్బంది, ఇతర ఉద్యోగులతో మాట్లాడారు. ఆరోజు ఏం జరిగింది, సుదీప్ పటేల్ కోపోద్రిక్తుడు కావడానికి దారి తీసిన కారణాలేంటి? సుస్మితను ఏమని దూషించారు అనే వివరాలు సేకరించే యత్నం చేశారు. ఈనెల 21న ఉపకమిషనర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో సుస్మితను సుదీప్ పటేల్ దూషించారని మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు అందింది.

'రిసెర్చ్ టెక్నిక్స్' ఇంటర్న్‌షిప్ విజయవంతం

ఉస్మానియా యూనివర్సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): "రిసెర్చ్ టెక్నిక్స్" ఇంటర్న్‌షిప్ కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ టి.నవనీత్ రావు సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (పీటీఎన్ఆర్-సీఎఫ్ఆర్‌డీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని క్లింటెక్ అనలిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో వారం రోజులపాటు కార్యక్రమం నిర్వహించారు. పరిశోధన పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఆధునిక శాస్త్రీయ పరికరాలపై అనుభవాన్ని కల్పిస్తూ, తాజా పరిశోధనా పద్ధతులపై అవగాహన కల్పించడమే కార్యక్రమం లక్ష్యం. తెలంగాణ, ఆంధ్ర , ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వివిధ విద్యా విభాగాల నుంచి 40 మందికిపైగా విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్తలు బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ మంజుల భనూరి, మైక్రోబయాలజీ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ డాక్టర్ హమీదా బీ, ఇంటర్న్‌షిప్, హెచ్‌సీడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

7న గోవధ వ్యతిరేక ర్యాలీ

పంజాగుట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా జూన్ 7ని బ్లాక్ డేగా ప్రకటిస్తున్నామని, ఆ రోజు మింట్ కాంపౌండ్ లోని త్రిశక్తి హనుమాన్ ఆలయం వద్ద నుంచి లిబర్టీలోని టీటీడీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు నిరసన ర్యాలీని చేపడుతున్నామని పలువురు స్వామిజీలు, పీఠాధిపతులు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హిమాలయ యోగి ప్రభాకర్ గురూజీ, కుప్ప శ్రీనివాస్ స్వామి, చంద్ర స్వామి,మాత శివపార్వతి, కమలేష్ మహరాజ్, తదితరులు మాట్లాడారు. యువత గోమాత రక్షణకు పూనుకోవాలన్నారు. ఈ నిరసన ర్యాలీలో ప్రతీఒక్కరు పాల్గొనాలని కోరారు. సమావేశంలో యుగ తులసి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె. శివకుమార్, వివిధ సంఘాల నాయకులు జస్మత్ పటేల్, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

- హెచ్ఎండీఏ, సైబరాబాద్ పోలీసుల సమీక్ష

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పెరగనున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా సైబరాబాద్ పోలీసులు హెచ్ఎండీఏ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో గురువారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డాక్టర్ గజరావు భూపాల్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వర్షాకాలంలో రవాణా సమస్యలు, ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యమైన జంక్షన్‌లలో రద్దీని నివారించేందుకు అండర్‌పాస్, ఫ్లైఓవర్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, బాటిల్ నెక్‌లు, బ్లాక్‌స్పాట్‌లను గుర్తించడం, పాదాచారులకు, ద్విచక్రవాహనాలకు ప్రత్యేక లైన్లు, సీసీ కెమెరాల ఏర్పాటు అంశాలపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం రానున్న తరుణంలో డ్రైనేజీ, రోడ్డు మరమ్మతుపనులు, విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో హెచ్ఎండీఏ కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, హెచ్‌జీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ పరమ్ జ్యోతి, హెచ్ఎమ్‌డీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వ ఏర్పాట్లు

- మహిళలకు, వృద్ధులకు ప్రత్యేక లైన్లు
- తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



అఫ్జల్‌గంజ్, మే 29 (ఆంధ్రజ్యోతి) : జూన్ 8న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ యేడాది 1.5 లక్షల చేప పిల్లలను అందుబాటులో పెడుతున్నామని తెలిపారు. వచ్చే భక్తులకు క్యూ లైన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు, వృద్ధులకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

- పలువురు స్మగ్లర్ల అరెస్టు


మహిళా స్మగ్లర్‌ను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు


హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి విక్రయాలపై ఎక్సైజ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. శేరిలింగంపల్లి పరిధిలో గుట్టుగా డ్రగ్స్ విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్న పర్హానా అనే మహిళా స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 2.6 గ్రాముల సరుకు స్వాధీనం చేసుకున్నారు. మధు అనే వ్యక్తి ఆమెకు డ్రగ్స్ సరఫరా చేసి విక్రయింపజేస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితురాలిని, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. మరో కేసులో... మలక్‌పేట పరిధిలో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఖమ్మంకు చెందిన షేక్ జానీమియా, షేక్ నజీర్, రంగారెడ్డి జిల్లాకు చెందిన పెద్ద గొల్ల శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం మలక్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్టీఎఫ్ సిటీ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

జేఏసీ నేతల నిరసన

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జాతీయ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ భాగస్వామ్య సంస్థ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో దక్షిణ డిస్కమ్ ప్రధాన కార్యాలయంతో పాటు జెన్‌కో కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సర్వీసు రెగ్యులరైజేషన్‌లో మార్పులు చేసి, ఉద్యోగులను తొలగించేందుకు యోగి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని జేఏసీ చైర్మన్ సాయిబాబు ఆరోపించారు.

వ్యాసపీఠం

రాజీవ నేత్రాయ.. రాఘువాయ



15వ శతాబ్దానికి చెందిన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు రాసిన సంకీర్తనలు ఈ నాటికి మన తెలుగునాట మారుమ్రోగుతూ ఉంటాయి. తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ ఆయన రాసిన సంకీర్తనలు విశిష్టమైనవి. తన 16వ ఏట సంకీర్తనా రచనను ప్రారంభించిన అన్నమయ్య రోజుకు ఒక సంకీర్తన చొప్పున 32 వేల సంకీర్తనలు రాశాడని ప్రతీతి. దీని వెనక కూడా ఒక కథ ఉంది. మొదట్లో స్మార్త బ్రాహ్మణుడైన అన్నమయ్య... ఆదివన్ శఠకోపయతి అనే గురువు వల్ల శ్రీవైష్ణవునిగా మారాడని, సుప్రసిద్ధ నారసింహ క్షేత్రమైన అహోబిలంలో వేదాంత విద్యను అభ్యసించాడని చెబుతారు. నృసింహమంత్రంలోని 32 బీజాక్షరాలకు సంకేతంగా 32 వేల సంకీర్తనలు రాశాడని ప్రతీతి. ఈ కీర్తనలలో కొన్నింటి తాత్పర్యాన్ని ప్రముఖ వ్యాఖ్యాత వెంకట్ గరికపాటి - 'రాజీవ నేత్రాయ.. రాఘువాయ' అనే పేరిట పుస్తక రూపంలోకి తీసుకువచ్చారు. అన్నమయ్య కీర్తనలపై ఆసక్తి ఉన్నవారందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమిది.

రాజీవ నేత్రాయ.. రాఘువాయ
రచయిత: వెంకట్ గరికపాటి
ప్రతులకు: 9704179950


గీతాసారం

కళ్ళెం మన చేతుల్లో ఉండాలి...



"ఈ శరీరాన్ని విడిచిపెట్టకముందే... అంటే జీవించి ఉన్నప్పుడే కామం, క్రోధం లాంటి ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. అలా చేసిన సాధకుడే యోగి. అతనే సుఖంగా ఉంటాడు" అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. అలాంటి స్థితిని సాధించాలంటే సంతోషం, దుఃఖంతో సహా అన్ని భావోద్వేగాల మీద మనకు అదుపు ఉండాలి. కానీ చాలాసార్లు వాటిని వేరే వ్యక్తులు మన భావోద్వేగాలను అదుపు చేస్తూ ఉంటారు. వారి ప్రభావానికి మనం లోనవుతూ ఉంటాం. దీనివల్ల అంతిమంగా మనకు కలిగేది దుఃఖమే. కాబట్టి 'భావోద్వేగాల కళ్ళాలు మన చేతుల్లో ఉన్నాయా? ఇతరుల చేతుల్లో ఉన్నాయా?' అనేది ఆత్మవిశ్లేషణ చేసుకోవాలి. అంతా మన అదుపులోనే ఉందని భావిస్తూ ఉంటాం. కానీ తరచుగా అవి ఇతరుల చేతుల్లో ఉంటాయి. అది స్నేహితుడు కావచ్చు, కుటుంబ సభ్యులు కావచ్చు, సహోద్యోగి కావచ్చు... వారి మనస్థితి, భావాలు, మాటలు, పొగడ్తలు, విమర్శలు మనల్ని సంతోషానికి లేదా బాధకు గురి చేస్తాయి. ఆహారం, పానీయాలు, భౌతిక వస్తువులు, అనుకూల , ప్రతికూల పరిస్థితులు, చివరకు మన గతం, భవిష్యత్తు కూడా ఇలాంటి ప్రభావాలకు కారణం అవుతూ ఉంటాయి.


"అంతరాత్మలోనే సుఖించే, ఆత్మజ్ఞాని అయిన సాంఖ్య యోగి... పరబ్రహ్మమైన పరమాత్మతో ఏకీకృతమై, అత్యున్నతమైన నిర్మాణస్థితిని పొందుతాడు. అలాగే నిశ్చల స్థితిలో మనస్సును పరమాత్మమీద లగ్నం చేసే బ్రహ్మవేత్తలు కూడా నిర్వాణాన్ని పొందుతారు" అని శ్రీకృష్ణుడు వివరించాడు. "కామాన్ని, మోహాన్ని జయించి, క్రోధాన్ని అదుపులో పెట్టుకోవడమే మనకు మనం చేసుకొనే సాయం. ఇది సాధించిన తరువాతే సర్వప్రాణి హితం... అంటే ఇతరుల పట్ల దయగా వ్యవహరించడం, వారికి సహాయం చేయడం సాధ్యమవుతుంది" ఆయన స్పష్టం చేశాడు.



కె.శివప్రసాద్

హరేకృష్ణ

వేదాలు, శాస్త్రాలు గురువును భగవంతుడితో సమానంగా గౌరవిస్తాయి. శిష్యుణ్ణి గురువు అజ్ఞానాంధకారం నుంచి దివ్యమైన జ్ఞానం వైపు నడిపిస్తాడు. భగవద్భక్తికి గురువే ఏకైక మార్గం. అలాంటి గురువును ఎలా ఆశ్రయించాలో వివరిస్తూ "ఒక ఆధ్యాత్మిక గురువును చేరి పరమ సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించు. వినయంతో ప్రశ్నలు అడుగు. సేవ చెయ్యి. సత్యాన్ని దర్శించినవారైన అలాంటి గురువులు నీకు జ్ఞానోపదేశం చేయగలరు" అని వివరిస్తుంది భగవద్గీత.



ఆధ్యాత్మిక సాధన మార్గం నిస్సందేహంగా క్లిష్టమైనది. అందుకే, భగవంతుడు సాక్షాత్తూ తన పరంపరానుగతమైన సంప్రదాయానికి చెందిన ప్రామాణిక ఆచార్యుణ్ణే ఆశ్రయించాలని సూచిస్తున్నాడు. పరంపర సిద్ధాంతాన్ని అనుసరించనిదే ఎవరూ ప్రామాణికమైన ఆధ్యాత్మిక గురువు కారు. భగవంతుడే ఆది గురువు. ఆయన పరంపర నుంచి వచ్చిన గురువు మాత్రమే భగవంతుడి సందేశాన్ని శిష్యుడికి యథాతథంగా అందించగలడు.

విశ్వానికి ఆధ్యాత్మిక గురువు

గురువును ఎలా ఆశ్రయించాలి?

నిజమైన ఆధ్యాత్మిక గురువును సంపూర్ణ శరణాగతి భావంతో శిష్యుడు ఆశ్రయించాలి. మిధ్యాహంకారాలను విడిచిపెట్టి... శ్రద్ధతో, ఒక దాసునిగా సేవ చెయ్యాలి. వాస్తవానికి, ఆత్మసాక్షాత్కారం పొందిన గురువు సంతృప్తి చెందేలా చేయడమే ఆధ్యాత్మిక జీవన పురోగతి రహస్యం. జిజ్ఞాస, వినయం... ఈ రెండూ కలిసినప్పుడే అసలైన ఆధ్యాత్మిక అవగాహన కలుగుతుంది. సేవాభావం, వినయం లేకుండా అడిగే ప్రశ్నలు వ్యర్థం. గురువు పెట్టే పరీక్షలో నెగ్గాలి. శిష్యునిలో నిజమైన జిజ్ఞాసను గురువు గుర్తించినప్పుడే... ఆ శిష్యుడికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. గుడ్డిగా అనుసరించడం, అర్థంలేని ప్రశ్నలు వేయడం... ఈ రెండూ నిష్ప్రయోజనమే.

మూడు రకాల గురువులు

"ఏ కులస్థులైనా కావచ్చు, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాల్లో ఉన్నవారైనా, సన్యాసులైనా... ఇలా ఎవరైనా కావచ్చు. కృష్ణతత్త్వ విజ్ఞానం కలిగినవారైతే చాలు... వారు వర్త్మ-ప్రదర్శక గురువుగా లేదా దీక్షా గురువుగా లేదా శిక్షా గురువుగా ఉండడానికి అర్హులు" అంటూ 'శ్రీ చైతన్య చరితామృతం'లో గురుతత్త్వాన్ని శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూర్ వివరించారు. దీని ప్రకారం గురువులు మూడు రకాలు.

వర్త్మ-ప్రదర్శక గురువు: ఆధ్యాత్మిక జీవితం గురించి మొట్టమొదటిసారి పరిచయం చేసే గురువు.

దీక్షా గురువు: శాస్త్ర ప్రమాణానుసారం దీక్షను ప్రసాదించే గురువు.

శిక్షా గురువు: ఆధ్యాత్మికంగా పురోగతి సాధించడానికి మార్గనిర్దేశం చేసే గురువు.

వీరిలో ఏ గురువైనా ఆ స్థానం పొందడానికి అర్హత కేవలం కృష్ణతత్త్వాన్ని పూర్తిగా గ్రహించే సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. వైదిక శాస్త్రాలలో పేర్కొన్న నాలుగు ప్రామాణిక సంప్రదాయాలకు చెందిన ఆచార్యులనే ఆశ్రయించాలనేది శాస్త్రాలు చెప్పిన మాట. ఈ సంప్రదాయాలన్నీ సాక్షాత్తూ భగవంతుడి నుంచి నేరుగా మొదలైనవే. వాటిలో ఒకటి... బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించినప్పుడు ప్రారంభమయింది. ఆ సంప్రదాయాన్నే నేడు 'బ్రహ్మ-మధ్య-గౌడీయ సంప్రదాయం'గా వ్యవహరిస్తున్నారు. ఈ సంప్రదాయానికి చెందినదే హరే కృష్ణ ఉద్యమం. ఈ ఉద్యమానికి ఆచార్యులైన విశ్వగురు శ్రీల ప్రభుపాదులను ఆశ్రయించడం ద్వారా... విశుద్ధమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని యథాతథంగా పొందవచ్చు.

అంతర్జాతీయ ఉద్యమంగా...

బ్రహ్మ-మధ్య-గౌడీయ సంప్రదాయంలో కృష్ణ చైతన్యాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేసిన మొదటి ఆచార్యులు శ్రీల ప్రభుపాద. శ్రీమద్భగవద్గీత, శ్రీమద్భాగవత గ్రంథాల ఆధారంగా... ఈ భక్తి ఉద్యమాన్ని ఆయన దేశదేశాల్లో విస్తరింపచేలా చేశారు. డెబ్భై ఏళ్ళ వయసులో, నలభై రూపాయలు చేత పట్టుకొని, విదేశాలకు ప్రయాణించి, పదకొండేళ్ళ వ్యవధిలో ఒక మహత్తర ఉద్యమాన్ని ప్రపంచమంతటా స్థాపించారు. భగవద్గీతపై పరంపరానుగత వ్యాఖ్యానాన్ని అందించారు. 'భగవద్గీత యథాతథం' పేరుతో ఇప్పటివరకూ యాభై కోట్లకు పైగా ప్రతులు ప్రచురితమయ్యాయి. అంతర్జాతీయంగా సనాతన ధర్మాన్ని విస్తరించి, అతి తక్కువ సమయంలో భక్త సమాజాన్ని ప్రపంచవ్యాప్తంగా స్థాపించిన శ్రీల ప్రభుపాదుల నిర్విరామ కృషిని గుర్తించి... మన దేశంలోని 13 ప్రముఖ అఖాడాలు కలిసి... ఇటీవల జరిగిన కుంభమేళాలో ఆయనకు 'విశ్వగురు' అనే బిరుదును ప్రదానం చేశాయి. తాను ఈ ఉద్యమాన్ని ఒక పార్కులో కీర్తనతో ప్రారంభించానని, కేవలం శ్రీకృష్ణుడి పవిత్ర నామ స్మరణ వల్లే ఈ ఉద్యమం వేగంగా వ్యాప్తి చెందిందని, లక్షలాది భక్తులు తనతో చేరారని శ్రీల ప్రభుపాదులవారు తరచూ చెప్పేవారు. వైష్ణవాచార్యులైన ఆయన జాతి, వర్ణ, మత, లింగ, ప్రాంత భేదాలేవీ లేకుండా... ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని స్వీకరించి, శ్రీకృష్ణ, శ్రీ లక్ష్మీ నరసింహ భక్తులుగా మారే అవకాశం కల్పించారు. ఆయన 1977లో మహాసమాధి పొందినప్పటికీ, ఎవరైనా దీక్ష తీసుకొని తన శిష్యుడిగా మారే ఒక విధానాన్ని ఏర్పరిచారు. అటువంటి పరంపరాచార్యులను భగవంతుడితో సమానంగా గౌరవించాలి. వారు తమ ఉపదేశాల్లోని వాణి రూపంలో ఎప్పటికీ సజీవంగా ఉంటారు. నేటికీ ఎవరైనా సరే... వారి శిష్యులుగా మారి, వారి ఉపదేశాలను పాటిస్తూ... కృష్ణ చైతన్యంలో పురోగమించవచ్చు. 'హరేకృష్ణ' మంత్రాన్ని నిర్దిష్ట సంఖ్యలో జపించి, గురువు నిర్దేశించిన నియమాలను నిబద్ధతతో పాటిస్తే... ఏ వ్యక్తి అయినా శ్రీల ప్రభుపాదుల దీక్షా శిష్యుడిగా మారవచ్చు. తమ జీవితాలను శుద్ధి చేసుకొని, ఆధ్యాత్మిక పురోగతి సాధించవచ్చు. తద్వారా భయాలు, కలవరాలు లేకుండా ఆనందంగా జీవించవచ్చు.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

సద్బోధ

వర్ధమాన మహావీరుడికి ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో గోశాలక్ ఒకడు. అతను పండితుడు. వాక్చాతుర్యం ఉండేది. అయినా ఎక్కువమంది మహావీరునివైపే ఆకర్షితులు కావడం చూసి... అతనికి లోలోపల కొంత అసూయగా ఉండేది. ఒకసారి మహావీరుడు, గోశాలక్ కాలినడకన పొరుగు ఊరికి వెళుతున్నారు. కాలిబాట పక్కన ఒక చోట చిన్న పూల మొక్క ఉండడం గోశాలక్ గమనించాడు. దాన్ని మహావీరుడికి చూపిస్తూ "గురువర్యా! ఈ పూల మొక్కను చూడండి. ఇది పెరిగి పెద్దదవుతుందంటారా? పూలు పూస్తుందంటారా?" అని ప్రశ్నించాడు.

ఎవరో ఒక మనిషి భవిష్యత్తు గురించి అడిగితే... జ్యోతిష్కులు ఆ వ్యక్తి పుట్టిన రోజు, సమయం, ప్రాంతం తెలుసుకుంటారు. తిథి, వార, నక్షత్ర, గ్రహ స్థితులను పరిగణనలోకి తీసుకొని, లెక్కలు వేసి... ఆ మనిషి భవిష్యత్తు ఎలా ఉంటుందో చెబుతారు. కానీ మొక్కల భవిష్యత్తు గురించి ప్రశ్నిస్తే... పేరుమోసిన జ్యోతిష్కులైనా ఏమీ చెప్పలేరు. నవ్వి ఊరుకుంటారు. ఈ ప్రశ్న వేసి, మహావీరుడు ఏ సమాధానం చెబుతాడా? అని గోశాలక్ ఎదురుచూస్తున్నాడు.

జ్ఞాననేత్రం



ఆ ప్రశ్న విన్న మహావీరుడు ఆ మొక్క దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు గోశాలక్ "తప్పించుకొనే ప్రయత్నం చేయకండి. నా ప్రశ్నకు కచ్చితమైన జవాబు ఇవ్వండి" అన్నాడు.

మహావీరుడు కళ్ళు తెరిచి, లేచి నిలబడి "ఈ మొక్క పెరిగి పెద్దదవుతుంది. సమృద్ధిగా పూలు పూస్తుంది" అని చెప్పాడు.

గోశాలక్ "అవునా!" అంటూ ఆ మొక్కను కూకటివేళ్ళతో సహా పెకిలించి అవతల పారేశాడు. "ఇది పెరుగుతుందట! పూలు పూస్తుందట!" అని నవ్వాడు. మహావీరుడు చిరునవ్వులు చిందిస్తూ ముందుకు నడిచాడు. గోశాలక్ ఆయనను అనుసరించాడు.

వారిద్దరూ కొంత దూరం వెళ్ళాక... ఆ ప్రాంతంలో పెద్ద వర్షం మొదలైంది. ఏడు రోజులపాటు ఎడతెరిపిలేని వానలు, గాలులతో ఆ ప్రదేశమంతా చిందరవందరయింది. వానలు తగ్గడంతో మహావీరుడు, గోశాలక్ తిరుగు ప్రయాణం ప్రారంభించి, మళ్ళీ ఆ మొక్క ఉన్న చోటికే వచ్చారు. గాలీ, వర్షం కారణంగా ఆ మొక్క అటూ దొర్లి, ఇటు దొర్లి... మళ్ళీ దాన్ని వేర్లు భూమిలో నిలిచేలా లేచి నిలబడింది. దాన్ని ఆశ్చర్యంతో గమనించిన గోశాలక్... మహావీరుడి వైపు చూశాడు.

అప్పుడు మహావీరుడు నవ్వుతూ "ఆ మొక్క పెరిగి పెద్దదై... పూలు పూసే దృశ్యాన్నే కాదు, నువ్వు దాన్ని కూకటి వేర్లతో పెకిలించి పారేసే దృశ్యాన్ని కూడా ఆనాడే చూశాను. ఒక్కసారి కాదు, వందసార్లు నీవు అలా చేసినా... ఆ మొక్క కచ్చితంగా పెరుగుతుంది. పూలు పూస్తుంది. ఇది తథ్యం" అంటూ ముందుకు కదిలాడు. సాధారణ జ్యోతిష్కులు ఏవేవో లెక్కలు వేయాల్సి ఉంటుందేమో! జ్ఞానులు తమ జ్ఞాననేత్రంలో దర్శించి చెప్పేది నిజం కాక తప్పదు.

• రాచమడుగు శ్రీనివాసులు

ఆత్మజ్ఞానమే శ్రేష్ఠమైన విద్య

చింతన



నేను మీకొక సరళమైన విషయం చెప్పాలనుకుంటున్నాను. ఎంతోమంది ఎన్నో రకాలైన కథలు వినిపిస్తారు. ఎక్కడో జరిగిన సంగతుల గురించి చెబుతారు. కానీ మీ గురించి, మీ జీవితం గురించి చెప్పాలని అనుకుంటున్నాను. ఎందుకంటే... మీ జీవితంలో మీరే ప్రముఖమైన వ్యక్తి. చాలామంది భగవంతుడు ముఖ్యమైనవాడని భావిస్తారు. కానీ మీకు భగవంతుడు అవసరమని అనిపించినప్పుడు మాత్రమే ఆయన ముఖ్యుడవుతాడు. ఆయన గురించి మీరు తెలుసుకోకూడదనుకుంటే... మీ ప్రపంచంలో ఆయనకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు.

తెలుసుకోవాల్సింది అదే...

మిమ్మల్ని మీరు తెలుసుకోవడం చాలా ముఖ్యం. ప్రఖ్యాత గ్రీకు తత్త్వవేత్త సోక్రటీస్ తన బోధలలో 'నిన్ను నీవు తెలుసుకో, అర్థం చేసుకో' అనేవాడు. ఇదే విషయాన్ని కబీర్ దాస్ కూడా చెప్పాడు. 'ఆత్మజ్ఞానం' అంటేనే నిన్ను నువ్వు తెలుసుకోవడం. మనం ప్రతి దాన్నీ తెలుసుకోవాలనుకుంటాం. 'ఇదేమిటి, అదేమిటి, అతనెవరు, ఏం చేస్తూ ఉంటాడు'?... ఇలా ప్రతి దాని గురించి వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాం. కానీ మనిషి తను ఎవరో తెలుసుకోవడం కోసం ఎన్నడూ తనవైపు తిరిగి చూసుకోడు. మానవులమైన మనకు సంబంధించి ప్రధానమైన అంశాలు రెండు ఉన్నాయి. ఒకటి మనం జన్మించడం. జన్మించాం కాబట్టే మనం ఇక్కడ ఉన్నాం. రెండోది... మనం జన్మించాం కాబట్టి ఏదో ఒక రోజు ఈ లోకాన్ని వదిలిపోవడం కూడా తప్పనిసరిగా జరుగుతుంది. కానీ ఈ రెండో మాట చాలామందికి నచ్చదు. అలా జరగకుండా ఉండాలని ఎంతోమంది అనేక రకాల పాట్లు పడుతూ ఉంటారు. పరిగెడతారు, వ్యాయామం చేస్తారు, పద్ధతిగా తింటారు, బరువు పెరగకుండా చూసుకుంటారు. ఎందుకంటే మన మనందరం ఎప్పటికీ బ్రతికే ఉండాలని కోరుకుంటాం. ఏదో ఒక రోజు అంతమైపోతామనేది ఆలోచించాలని కూడా అనుకోం.

ఆ ఆనందం మీ సొంతం

సరే... ఇంతకు మీరెవరు? ఏఏ పదార్థాలతో మీరు తయారయ్యారో తెలుసా? ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్, కాల్షియం, నైట్రోజన్, ఫాస్ఫరస్... ఈ మూలకాలతో మీరు తయారయ్యారు. మీలో ఉన్నదానిలో డెబ్భై శాతం నీరే. ఈ నీరు నడుస్తుంది, మాట్లాడుతుంది... ఇది అద్భుతం కాదా? కానీ దీన్ని మీరు అద్భుతంగా భావించరు. ఈ భూమండలంలో కూడా డెబ్భై శాతం నీరు. మీరు కూడా డెబ్భై శాతం నీరే! బయట జరుగుతున్న వాటిని చూసి ఆశ్చర్యపోవడం మీ నైజం. కానీ మీలోపల జరుగుతున్న వాటిని చూసి ఆశ్చర్యపోవాలని నేను చెబుతున్నాను. ఏ పదార్థాలతో మీరు తయారయ్యారో... బయట ఉన్నవన్నీ కూడా ఆ పదార్థాలతోనే తయారయ్యాయని గ్రహించండి. మీ లోపలికి వస్తూ పోతున్న శ్వాస మీ సొంతం. అందులో దాగి ఉన్న ఆనందం కూడా మీ సొంతమే. అందువల్ల మిమ్మల్ని మీరు తెలుసుకోకుండా మిగిలినవన్నీ తెలుసుకున్నా, తెలుసుకోకపోయినా ఎటువంటి తేడా ఉండదు. మిమ్మల్ని మీరు తెలుసుకోవాలనే ఆరాటం మీకు కలగనంతవరకు జీవితం అసంపూర్ణంగా మిగిలిపోతుంది. జీవితాన్ని కొనసాగించడానికి మీకు ఈ సమయం లభించింది. అసలైన ఆనందంతో మీ జీవితాన్ని పరిపూర్ణం చేసుకోగలితే... తద్వారా కలిగే ఆనందాన్ని మీరు మాత్రమే ఆస్వాదించగలరు. మీలో ఉన్న, మీ హృదయంలో ఉన్న దైవాన్ని తెలుసుకొని, స్వయంగా అనుభూతి చెందితే... సమస్తం మీరు తెలుసుకున్నట్టేనని వేదాలు, శాస్త్రాలు చెబుతున్నాయి. ఆత్మజ్ఞాన విద్యే అన్ని విద్యల్లో శ్రేష్ఠమైన విద్య. కాబట్టి తనను తాను తెలుసుకున్న వ్యక్తికి మాత్రమే తాను ఇక్కడ ఎందుకు జీవిస్తున్నదీ తెలుస్తుంది.



ప్రేమ్‌రావత్

తెలుసుకుందాం

కారణాలు మూడు

ఏ కార్యానికైనా దోహదకారులుగా మూడు కారణాలను పూర్వ వేదాంత గ్రంథాలు పేర్కొన్నాయి. అవి: నిమిత్తం, ఉపాదానం సహకారి. వీటికి పలు ఉదాహరణలను పూర్వులు చూపారు. వాటిలో కుండను ఉదాహరణగా చూపుతూ చేసిన వివరణ ప్రసిద్ధి చెందింది. మనం వీధిలో వెళ్తూ ఉంటాం. ఒక చోట మట్టి కుప్పగా పోసి ఉంటుంది. కొంత సమయం తరువాత మళ్ళీ అటువైపు వస్తూ గమనిస్తే... ఆ మట్టితో కుండలు, పాత్రలు చేసి ఉంటాయి. అంతకుముందు కేవలం మట్టి మాత్రమే ఉంది. ఇప్పుడు అవి వస్తువులుగా తయారయ్యాయి. అంటే ఒక కార్యం (పని) జరిగింది.. దానికి దోహదం చేసిన కారణాలు మూడుగా పూర్వులు పేర్కొన్నారు.



• వాటిలో మొదటిది... మట్టితో దేన్ని తయారు చేయాలి? దానికోసం ఎటువంటి పనితనాన్ని చూపాలి? ఎలాంటి ఉపకరణాలు ఉపయోగించాలి? అని తెలిసి, వాటి ద్వారా ఆ కుండలను, పాత్రలను తయారు చేసిన వ్యక్తి. అతణ్ణి 'నిమిత్త కారణం' అంటారు.

• ఇక... అతను ఆ వస్తువులను తయారు చేయడానికి మూల పదార్థమైన మట్టి... 'ఉపాదాన కారణం'. దానితో ఆ వస్తువులు రూపొందుతాయి. అది అనేక రూపాల్లోకి మారుతుంది. కానీ ఏ రూపంలో ఉన్నా... మట్టిగా దాని స్వభావంలో మార్పు ఉండదు. స్వతహాగా ఆ వస్తువులుగా అది మారలేదు. నిమిత్త కారణమైన కుమ్మరి దాన్ని వస్తువులుగా తయారు చేస్తాడు.

• అయితే... ఈ రెండు కారణాల వల్లా వస్తువులు తయారుకావు. ఆ మట్టిని కుండగానో, పాత్రగానో ఆకృతి తీర్చడానికి ఒక చక్రం, దాన్ని తిప్పుతూ ఉండడానికి ఒక కర్ర, పాత్రను సరైన రూపంలోకి తేవడానికి కర్ర ముక్క, చాకు, ఇనుపరేకు లాంటివి కూడా అవసరమే. వీటిని 'సహకారి కారణాలు' అంటారు.

దైవమార్గం

యేసు క్రీస్తు రెండువేల ఏళ్ళ క్రితం నరావతారుడైన దేవుడిగా జన్మించాడు. 33 సంవత్సరాలు ఈ భూమిమీద సంచరించాడు. సుమారు మూడున్నర ఏళ్ళపాటు సువార్తను బోధించాడు. తన సువార్త వ్యాప్తికి సహాయకులుగా పన్నెండు మంది శిష్యులను ఏర్పరచుకున్నాడు. వారిలో పేతురు, యోహాను, యాకోబు, తోమా (థామస్) ముఖ్యులు. క్రీస్తు మరణం, పునరుత్థానం తరువాత... ఆయన ప్రత్యక్ష శిష్యుడైన థామస్ భారతదేశంలో అడుగుపెట్టాడు. క్రీస్తు గురించి బోధించాడు, సేవలు అందించాడు. కేరళ (మలబారు) తీరానికి సముద్రమార్గం ద్వారా చేరుకొని, కొడంగలూరు, పలయూరు, కొక్కిమంగళం, కొల్లం, నిరనం, నీలక్కల్, పరవూరుల్లో ఏడు చర్చిలు నిర్మించాడు. తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో ఉన్న తిరువితమ్‌కోడ్ దగ్గర మరో చర్చి నిర్మాణం చేపట్టినా పూర్తి చేయలేకపోయాడు. అందుకే దాన్ని 'అరపల్లి' అంటారు. అంటే 'సగం' అని అర్థం.

భారతీయ అపోస్తులుడు

థామస్ క్రాస్...

థామస్ హయాంలో అనేక విద్య, వైద్య సంబంధమైన కార్యక్రమాలు అనాడే భారతదేశంలో ప్రారంభమయ్యాయి. ఇక్కడ క్రైస్తవ్యం బ్రిటిష్ వారి ద్వారా వచ్చిందనేది అవాస్తవం. దానికి ఆద్యుడు థామస్. అందుకే క్రీస్తు ప్రత్యక్ష శిష్యుడైన ఆయనను 'భారతీయ అపోస్తులుడు' అని పిలుస్తారు. అపోస్తులుడు అంటే 'పంపించినవాడు' అని అర్థం. థామస్... క్రీస్తు భారతదేశానికి పంపినవాడు. భారతదేశంలో ఏడున్నర చర్చిలు నిర్మించిన థామస్ ... చెన్నైలోని లిటిల్‌మౌంట్ (శాంథోమ్ చర్చి) దగ్గర ఒక గుహలో ప్రార్థన చేసుకుంటూ ఉంటగా... అతను బతికి ఉంటే క్రైస్తవం ఇంకా ప్రబలుతుందన్న భావనతో కొందరు దుండగులు శూలంతో వెనుకనుంచి పొడిచి ఆయనను చంపేశారు. అతని పేరిట చెన్నైలో 'శాంథోమ్ బసిలికా' ఉంది.



థామస్ భారత దేశంలో తన సేవా కార్యక్రమాల్లో ఉంటూనే... బైబిల్‌లోని కొత్త, పాత నిబంధనల కలయికతో... త్రిత్వాన్ని (దేవుడు, ఆయన కుమారుడైన క్రీస్తు, పరిశుద్ధాత్మ అనే మూడు) ప్రతిబింబించే విధంగా ఒక క్రాస్‌ను తయారు చేశాడు. దాన్ని 'థామస్ క్రాస్' లేదా 'భారతీయ క్రాస్' అంటారు. ప్రపంచంలో ఎన్నో క్రైస్తవ దేశాలు ఉన్నా.. థామస్ తయారు చేసిన క్రాస్‌ను మన దేశం పేరుతో పిలవడం మనకు గర్వకారణం. థామస్ తన సువార్త-సేవా ప్రయాణంలో ఎందరో రోగులను స్వస్థతపరిచాడు. మరణించిన వారిని బ్రతికించాడనీ, థామస్ మృతదేహాన్ని తాకి ఎందరో రోగులు స్వస్థత పొందారనీ, వారికి పట్టిన దుష్టశక్తులు వదిలిపోయాయనీ కథలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు క్రైస్తవ మందిరాలకు ఆయన భౌతిక అవశేషాలను పంపారు. అక్కడ వాటిని భద్రపరిచారు. ఇజ్రాయిల్ దేశంలోని గలిలియ ప్రాంతంలో, క్రీస్తుశకం ఒకటో శతాబ్దంలో థామస్ జన్మించాడు. క్రీస్తు పునరుత్థానం తరువాత... క్రీస్తుశకం 52లో భారతదేశానికి వచ్చాడు. క్రీస్తుశకం 72లో చెన్నైలో హత్యకు గురయ్యాడు. మన దేశాన్ని ఎంతో ప్రేమించిన థామస్ గౌరవార్థం భారత ప్రభుత్వం 1964లో ఒక తపాలా స్టాంపును విడుదల చేసింది.


• కె.జె.రమేష్

యుద్ధం కోసం సన్నద్ధం



రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో కన్నడ కథానాయకుడు యశ్ రావణుని పాత్ర పోషించడమే కాకుండా చిత్ర నిర్మాణంలో భాగస్వామి కూడా అయ్యారు. ఈ భారతీయ ఇతిహాసాన్ని ఎటువంటి విమర్శలకు తావు లేకుండా దర్శకుడు నితిశ్ తివారి అద్భుతంగా ఆవిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రంలోని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. 'మ్యాడ్ మ్యాక్స్. ఫ్యూరీ రోడ్', 'ద సుసైడ్ స్క్వాడ్' వంటి హాలీవుడ్ చిత్రాలకు స్టంట్ డైరెక్టర్‌గా పని చేసిన గై నోరిస్ 'రామాయణ' చిత్రానికి యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. ఆయన సారథ్యంలో యశ్ యుద్ధ సన్నివేశాల చిత్రీకరణ కోసం సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను గురువారం విడుదల చేశారు. రెండు భాగాలుగా 'రామాయణ' చిత్రం తయారవుతోంది. తొలి భాగం 2026 సంవత్సరంలో, రెండో భాగం 2027 సంవత్సరంలో దీపావళికి విడుదలవుతాయి.

జాతరకు ముహూర్తం



రవితేజ హీరోగా నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర' రిలీజ్ డేట్ నిర్ణయించారు. వినాయకచవితి సందర్భంగా ఆగస్టు 27న ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు. భాను భోగవరపు దర్శకుడు. రవితేజ నుంచి ఆయన అభిమానులు, ప్రేక్షకులు కోరుకొనే విధంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుందని దర్శకుడు తెలిపారు. శ్రీలీల ఈ చిత్ర కథానాయిక. బాక్సాఫీసు దగ్గర మెరుపులు మెరిపించడానికి రవితేజ, శ్రీలీల సిద్ధమవుతున్నారు. 'ధమాకా' విజయంలో భీమ్స్ సిసిరోలియో సంగీతం కీలక పాత్ర పోషించింది. అలాగే మరో సారి 'మాస్ జాతర'తో ఆయన మాస్ ప్రేక్షకులను మెప్పించనున్నారు.

పవర్ తుపానుకు సిద్ధంగా ఉండండి!



తను నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రానికి పవన్‌కల్యాణ్ డబ్బింగ్ చెప్పడంతో ఆ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఏపీ ఉపముఖ్యమంత్రిగా బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ తీరిక చేసుకుని రాత్రి పది గంటలకు డబ్బింగ్ మొదలుపెట్టి ఏకధాటిగా నాలుగు గంటల్లో పూర్తి చేశారు పవన్‌కల్యాణ్. ఈ విషయం వెల్లడిస్తూ 'పవర్ తుపానుకు సిద్ధంగా ఉండండి. జూన్ 12న మీ ఉత్తేజం ఉరకలేస్తుంది' అని చిత్ర బృందం పేర్కొంది. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకున్న 'హరిహర వీరమల్లు' చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. ఏ.ఎం.రత్నం సమర్పణలో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి క్రిష్, జ్యోతికృష్ణ దర్శకులు.

మీ రుణం తీర్చుకోవడానికి చేసిన సినిమా



విశిష్ట నటుడు కమల్ హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న 'థగ్ లైఫ్' చిత్రం జూన్ 5న విడుదల కానుంది. త్రిష, శింబు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని హీరో నితిన్ తండ్రి సుధాకరరెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. గురువారం సాయంత్రం వైజాగ్‌లో ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. ఆ కార్యక్రమంలో కమల్‌హాసన్ మాట్లాడుతూ 'నా 21 ఏళ్ల వయసులో 'మరో చరిత్ర' చిత్రం కోసం ఇక్కడికి వచ్చాను. నేనెవరో ఎవరికీ తెలీదు, షూటింగ్ సాఫీగా జరిగింది. సినిమా రిలీజ్ అయిన తర్వాత ఎక్కడా నడవలేని పరిస్థితిని 'మరో చరిత్ర' కల్పించింది. ఆ తర్వాత మరికొన్ని చిత్రాలు ఇక్కడ చేశాను. వైజాగ్ నాకు సొంత ఇల్లు లాంటిది. నేను 15 తెలుగు చిత్రాలు చేస్తే 13 సక్సెస్ అయ్యాయి. విజయాలు మీరు ఇచ్చారు. ఫ్లాపులు నేను ఇచ్చాను. మీ రుణం తీర్చుకోవడానికే 'థగ్ లైఫ్' సినిమా మీకు అందిస్తున్నాను' అన్నారు. ఇది చాలా మంచి సినిమా అనీ, అందరికీ నచ్చుతుందని శింబు చెప్పారు. కమల్‌హాసన్‌తో తొలి సారి నటించాననీ ఇటువంటి పాత్ర ఇంతవరకూ చేయలేదని త్రిష తెలిపారు. జూన్ 5న ఈ సినిమాను చూసి సూపర్ హిట్ చేస్తే కమల్‌ను తీసుకువచ్చి ఇక్కడే సక్సెస్ మీట్ నిర్వహిస్తామని సుధాకరరెడ్డి చెప్పారు.

గద్దర్ తెలంగాణ సినీ పురస్కారాలు 2024

ఉత్తమ చిత్రాలు.. కథ కమామిషు

ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ చిత్రాల అవార్డుల్లో 'కల్కి 2898', 'పొట్టేల్', 'లక్కీ భాస్కర్' సినిమాలు వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. ఈ మూడూ భిన్నమైన జానర్‌కు చెందినవి. ఒక దానితో మరోదానికి అసలు పోలిక ఉండదు. ఒక సినిమా ప్రేక్షకుల్ని కల్పిత ప్రపంచంలోకి తీసుకెళ్తే, మరొకటి 1970-80 మధ్య కాలంలో తెలంగాణ గ్రామీణ జీవన చిత్రాన్ని ఆవిష్కరింపజేస్తుంది. చివరిది మధ్య తరగతి మనస్తత్వాలను ఎండగడుతుంది.

హాలీవుడ్ స్థాయిలో విజువల్స్



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. మన పురాణాల ప్రకారం మహా విష్ణువు పదో అవతారమే కల్కి. కలియుగం చివరి పాదంలో దేవుడు కల్కి రూపంలో వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసి అవతారం చాలిస్తాడని చెబుతున్నాయి. ఈ పాయింట్‌నే దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రధాన ఇతివృత్తంగా ఎంచుకొని అద్భుతమైన కథ సృష్టించారు. దానికి సాంకేతికత జోడించి 'కల్కి 2898 ఏడీ'ని రూపొందించారు. ఈ చిత్రంలో కాశీ, కాంప్లెక్స్, శంబాలా అనే మూడు ప్రపంచాలు ఉంటాయి. ఈ మూడింటి మధ్య జరిగే కథే ఈ సినిమా. ఇందులో విజువల్స్‌ని హాలీవుడ్ చిత్రాలకు ఏ మాత్రం తగ్గకుండా తెరకెక్కించారు. హాలీవుడ్ సినిమాల స్ఫూర్తితో కూడిన పాత్రలు, కల్పిత ప్రపంచాలు ఈ సినిమాలో మనకు కనిపిస్తాయి.

చదువు గొప్పదనాన్ని చాటింది



తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో ఒకప్పుడు రాజ్యమేలిన పటేల్ వ్యవస్థలో ప్రజల జీవన విధానాన్ని 'పొట్టేల్' చిత్రంలో చక్కగా తెరకెక్కించారు దర్శకుడు సాహిత్. 1970-80 మధ్య కాలంలో సాగే కథ ఇది. గ్రామ పటేల్‌ని ఎదిరించి తన కూతుర్ని చదివించుకోవాలనుకునే ఓ తండ్రి తపన, తాపత్రయాన్ని తెరపై చక్కగా ఆవిష్కరించారు. పటేళ్ల పెత్తనం, మూఢ నమ్మకాలు, సమాజంలో ఉన్న అసమానతలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూనే దర్శకుడు చదువు గొప్పదనాన్ని చాటి చెప్పాడు.

ఆర్థిక మోసాల నేపథ్యం



1990 నాటి ఆర్థిక మోసాల నేపథ్యంలో వచ్చిన చిత్రం 'లక్కీ భాస్కర్'. తెలుగు తెరపై ఈ తరహా కథ ఇప్పటి వరకు రాలేదనే చెప్పాలి. బాగా చదువుకున్న వారికి కూడా అర్థం కాని బ్యాంకింగ్ మోసాలను సాధారణ మధ్యతరగతి ప్రజలకు సైతం అర్థమయ్యేలా దర్శకుడు వెంకీ అట్లూరి తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. బ్యాంకింగ్ వ్యవస్థ, స్టాక్ మార్కెట్, మధ్య తరగతి మనస్తత్వాలు.. ఈ మూడింటినీ మేళవిస్తూ చిత్ర కథ సాగుతుంది. కథ, పాత్రలు, తెరపై సన్నివేశాలు అన్నీ ప్రేక్షకులకు సులభంగా కనెక్ట్ అయ్యేలా ఉంటాయి. ముఖ్యంగా ఈ చిత్రానికి సంభాషణలు బాగా ప్లస్ అయ్యాయి. 'ఒక రోజులో అరగంట నాకు నచ్చినట్టుగా సాగలేదని, రోజంతా ఏడుస్తూ కూర్చోవాలా', 'గెలుపు తర్వాత ఓటమి, ఓటమి తర్వాత గెలుపు' వంటి సంభాషణలు ప్రేక్షకుల్ని ఆలోచింపజేస్తాయి.

నిజానికి ఇది చిన్న కథ కాదు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లో మూడింటిని సొంతం చేసుకొని మరొక్కసారి అందరి దృష్టిని ఆకర్షించింది '35 చిన్న కథ కాదు' అనే సినిమా. దీన్ని నంద కిశోర్ ఇమాని తెరకెక్కించారు. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికవడంతో పాటు ఇందులో నటించిన నివేదా థామస్ ఉత్తమ నటిగా, మాస్టర్ అరుందేవ్ పోతుల, బేబీ హారిక ఉత్తమ బాల నటులుగా అవార్డులు కైవసం చేసుకున్నారు. పాటలు, యాక్షన్, రొమాన్స్ వంటి కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటేనే సినిమా కాదని, మంచి కంటెంట్ ఉన్న చిన్న సినిమా సైతం సూపర్ హిట్ అవుతుందని ఈ చిత్రం నిరూపించింది. నిజానికి ఇది చిన్న కథ కాదు. చాలా పెద్ద కథ. ఇందులో పిల్లలతోపాటు తల్లిదండ్రులు, సమాజం నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలను చర్చించారు. ప్రస్తుత విద్యా విధానం ఎలా ఉంది? ఎలా సాగితే పిల్లలకు ఉపయోగం అని తెలియజేసే సినిమా ఇది. ఈ చిత్రానికి ఉత్తమ కేటగిరీలో మూడు అవార్డులు రావడం చిన్న సినిమాకు లభించిన పెద్ద గౌరవం అనే చెప్పాలి.

ప్రభుత్వ గుర్తింపు ఎంతో విలువైనది



గద్దర్ సినీ పురస్కారాలకు ఎంపికైన వారందరికీ హృదయపూర్వక అభినందనలు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఎంతో విలువైనది. సృజనాత్మక రంగంలో ఉన్న నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఎంతగానో ప్రేరణనిస్తుంది. ఒక గొప్ప అద్భుత సంప్రదాయాన్ని తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరించడం, ఇండస్ట్రీకి గొప్ప ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు, అవార్డుల కమిటీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

- చిరంజీవి

అభిమానులకు అంకితం



తొలిసారి ప్రకటించిన 'గద్దర్ తెలంగాణ సినీ పురస్కారాలు 2024'లో ఉత్తమ నటుడి పురస్కారం నాకు దక్కినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇది నాకు దక్కిన నిజమైన గౌరవం. అందుకు తెలంగాణ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 'పుష్ప 2' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా నన్ను ఎంపికచేసినందుకు సంతోషంగా ఉంది. దర్శకుడు సుకుమార్, నిర్మాతలతో పాటు 'పుష్ప 2' చిత్రబృందానికి ఈ ఘనత దక్కుతుంది. అలాగే నా అభిమానుల ప్రోత్సాహమే ప్రతిసారి నాలో స్ఫూర్తిని నింపుతోంది. అందుకే ఈ పురస్కారాన్ని వారికి అంకితమిస్తున్నా.

- అల్లు అర్జున్

విజేతలకు అభినందనలు



చిత్ర పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది నుంచి తెలంగాణ ప్రభుత్వం సినీ పురస్కారాలను ఇవ్వడం మంచి పరిణామం. 'గద్దర్ తెలంగాణ సినీ పురస్కారాలు-2024' విజేతలందరికీ అభినందనలు. 'దేవర' చిత్రానికి నృత్యరీతులు సమకూర్చిన గణేశ్ ఆచార్య ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా ఎంపికైనందుకు ఆనందంగా ఉంది.

-ఎన్టీఆర్

గద్దర్ సినీ పురస్కారాల్లో మా 'లక్కీ భాస్కర్' చిత్రం ఏకంగా నాలుగు విభాగాల్లో అవార్డులను దక్కించుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇది చిత్రబృందానికి గర్వకారణం. ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు, తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- సూర్యదేవర నాగవంశీ

మా 'కమిటీ కుర్రాళ్లు' చిత్రబృందానికి ఇది గొప్ప విజయం. ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రం, ఉత్తమ నూతన దర్శకుడు పురస్కారాలు దక్కడం ఆనందాన్నిచ్చింది. ఇది మా గుర్తింపును, గౌరవాన్ని మరింత పెంచింది.

- నిహారిక కొణిదెల

'కల్కి 2898 ఏడీ' చిత్రబృందానికి ఇవి గర్వకారణమైన క్షణాలు. గద్దర్ సినీ పురస్కారాలు 2024లో ఉత్తమ చిత్రంగా నిలిచినందుకు ఎంతో ఆనందంగా ఉంది. వైజయంతీ మూవీస్ సుదీర్ఘ సినీ ప్రయాణానికి దక్కిన మరో గొప్ప గౌరవం ఇది. తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు.

- వైజయంతి మూవీస్

మా బేనర్‌లో తెరకెక్కిన 'ఆయ్' సినిమాకు ఉత్తమ ప్రజాదరణ చిత్రంగా, 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయనటిగా శరణ్య ప్రదీప్‌కు పురస్కారాలు దక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేం.

- గీతా ఆర్ట్స్ 2

గద్దర్ సినీ పురస్కారాలు - 2024లో 'క' చిత్రానికి గాను స్పెషల్ జ్యూరీ పురస్కారానికి ఎంపికవడం మాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాం.

- దర్శకులు సందీప్, సుజిత్

సినీ గ్రంథానికి దక్కిన గౌరవం

సీనియర్ జర్నలిస్టు, ఉత్తమ సినీ విమర్శకుడిగా నంది అవార్డు గ్రహీత అయిన డాక్టర్ రెంటాల జయదేవను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'గద్దర్ ఫిల్మ్ అవార్డు' వరించింది. మరుగున పడిపోయిన భారతీయ సినీ చరిత్రలోని అనేక అంశాలను తవ్వితీసి, ఆయన రచించిన 'మన సినిమా.. ఫస్ట్ రీల్' పుస్తకం 2024వ సంవత్సరానికి గాను 'ఉత్తమ సినీ గ్రంథం'గా ఎంపికైంది. దక్షిణ భారతీయ భాషా చిత్రాల తొలి అడుగుల చరిత్రపై జయదేవ పాతికేళ్ల పరిశోధనా పరిశ్రమకు ప్రతిఫలం ఈ పుస్తకం. హిందీతో సహా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో వచ్చిన తొట్టతొలి టాకీలకు సంబంధించిన అనేక చారిత్రక సత్యాలను ఈ పుస్తకంలో జయదేవ అందించారు.



తమిళ నటుడు రాజేశ్ మృతి



సీనియర్ తమిళ నటుడు రాజేశ్ (75) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ని గురువారం ఉదయం చెన్నై నందంబాక్కంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళుతుండగా, మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య గతంలోనే మృతి చెందారు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాలుగు దశాబ్దాలుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న రాజేశ్ తమిళనాడు ప్రభుత్వ డాక్టర్ ఎంజీఆర్ ఫిల్మ్ అండ్ టీవీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కె.బాలచందర్ దర్శకత్వంలో తొలిసారి సినీ అవకాశాన్ని పొంది, తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో 150కి పైగా చిత్రాల్లో నటించారు. - ఆంధ్రజ్యోతి, (చెన్నై)

క్షమాపణ చెప్పు.. లేదంటే మీ సినిమా ఆడదు..!


తమిళ భాష నుంచే కన్నడ పుట్టిందని నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రమంతటా రగులుతూనే ఉన్నాయి. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజు ఆధ్వర్యంలో మైసూరు బ్యాంక్ సర్కిల్‌లో గురువారం నిరసన తెలిపారు. కన్నడ చరిత్ర గురించి కమల్ హాసన్‌కు ఏం తెలుసని వాటాళ్ నాగరాజు ప్రశ్నించారు. ఆయన వెంటనే కన్నడిగులకు క్షమాపణ చెప్పాలని, లేదంటే తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కర్ణాటక రక్షణ వేదిక ముఖ్యుడు ధర్మరాజగౌడ నేతృత్వంలో ఫిల్మ్ చాంబర్ అసోసియేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఆ తర్వాత నేరుగా చాంబర్‌లోకి దూసుకెళ్ళి నిరసన తెలిపారు. ఆంధ్రజ్యోతి, (బెంగళూరు)

ఇక అడుగు దూరమే..

లీగ్ దశలో అత్యద్భుత ప్రదర్శనతో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు.. ఆ రెండింటి మధ్య క్వాలిఫయర్ 1 మ్యాచ్ అంటే అభిమానులు ఏ స్థాయిలో ఊహించుకుంటారు? ఈ హోరాహోరీ పోరులో గెలిచి ఫైనల్‌కు వెళ్లే జట్టేదో తెలుసుకునేందుకు అత్యంత ఆసక్తిగానే ఎదురుచూశారు. కానీ ఉత్కంఠ భరితంగా సాగాల్సిన ఆట పూర్తి ఏకపక్షమైంది. బెంగళూరు బౌలర్ల ధాటికి బెంబేలెత్తిన పంజాబ్ కనీసం వంద పరుగులు చేసేందుకే ఆపసోపాలు పడింది. ఇక 102 పరుగుల లక్ష్యాన్ని పది ఓవర్లలోనే ముగించిన ఆర్‌సీబీ తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్‌కు చేరింది.

ఫైనల్లో బెంగళూరు

- 8 వికెట్ల తేడాతో ఘనవిజయం
- 101 రన్స్‌కే పంజాబ్ ఆలౌట్
- చెలరేగిన బౌలర్లు
- సాల్ట్ అజేయ అర్ధసెంచరీ


సుయాష్ (3 వికెట్లు)

1 ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో ఎక్కువ బంతులు (60) మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించిన జట్టుగా ఆర్‌సీబీ

ముల్లాన్‌పూర్: 'ఈ సాల కప్ నమ్దే' అంటూ 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తమ కల నెరవేర్చుకునేందుకు మరో అడుగు దూరంలో నిలిచింది. గురువారం టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్‌తో జరిగిన క్వాలిఫయర్ 1లో 8 వికెట్ల తేడాతో ఆర్‌సీబీ ఘనవిజయం సాధించింది. దీంతో తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్లో అడుగు పెట్టింది. 2009, 2011, 2016 సీజన్లలోనూ తుది పోరుకు చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. అటు ఓడిన పంజాబ్‌కు జూన్ ఒకటిన జరిగే రెండో క్వాలిఫయర్‌లో ఆడే అవకాశముంది. గుజరాత్-ముంబై మ్యాచ్ విజేతతో ఈ పోరు ఉంటుంది. పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన పంజాబ్‌ను ఆర్‌సీబీ బౌలర్లు చెడుగుడు ఆడేయడంతో 14.1 ఓవర్లలో 101 పరుగులకే కుప్పకూలింది. స్టొయినిస్ (26), ప్రభ్‌సిమ్రన్ (18), ఒమర్జాయ్ (18) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. సుయాష్, హాజెల్‌వుడ్‌లకు మూడేసి.. యష్ దయాల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 10 ఓవర్లలో 2 వికెట్లకు 106 పరుగులు చేసి నెగ్గింది. సాల్ట్ (27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 56 నాటౌట్) అర్ధసెంచరీ సాధించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సుయాష్ శర్మ నిలిచాడు.

10 ఓవర్లలోనే..: ఇదే వేదికలో కోల్‌కతాపై 111 పరుగుల స్కోరును పంజాబ్ కాపాడుకోగలిగింది. ఈసారి కూడా అలాంటి ఫలితాన్ని రిపీట్ చేస్తుందేమో అని ఆ జట్టు ఫ్యాన్స్ ఆశలు పెట్టుకున్నారు. కానీ మైదానంలో అంత సీన్ కనిపించలేదు. కేవలం 102 పరుగుల ఛేదనే అయినప్పటికీ ఓపెనర్ సాల్ట్ మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. విరాట్ (12) వికెట్‌తో పేసర్ జేమిసన్ నాలుగో ఓవర్‌ను మెయిడెన్‌గా వేశాడు. కానీ సాల్ట్ మాత్రం ఆరంభం నుంచే బ్యాట్‌కు పనిజెప్పాడు. అర్ష్‌దీప్ ఓవర్‌లో 4,6తో పాటు జేమిసన్ ఓవర్‌లో 4,4,4,6తో 21 పరుగులు రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలోనే 61/1 స్కోరుతో సగం కంటే ఎక్కువే లక్ష్యాన్ని పూర్తి చేసింది. అటు మయాంక్ (19) ముషీర్ ఓవర్‌లో 6,4 సాధించి అవుటయ్యాడు. 23 బంతుల్లో సాల్ట్ హాఫ్ సెంచరీ పూర్తయ్యాక.. పదో ఓవర్‌లో కెప్టెన్ పటీదార్ (15 నాటౌట్) 4,6తో 14 రన్స్ రాబట్టి మ్యాచ్‌ను ముగించాడు.

తిప్పేసిన సుయాష్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌ను ఆర్‌సీబీ బౌలర్లు బెంబేలెత్తించారు. ఏదో భారీ ఛేదన కోసం బరిలోకి దిగినట్టుగా బ్యాటర్లంతా వేగంగా ఆడేందుకు ప్రయత్నించి మూల్యం చెల్లించుకున్నారు. నిర్లక్ష్యపు షాట్లతో చేజేతులా వికెట్లను సమర్పించుకున్నారు. అటు పేసర్లు హాజెల్‌వుడ్, భువీ, యష్‌లతో పాటు స్పిన్నర్ సుయాష్ బ్యాటర్లను ఏమాత్రం కుదురుకోనీయలేదు. ఏకంగా ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు చేరారు. స్టొయినిస్ ఆత్మవిశ్వాసంతోనే కనిపించినా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయాడు. రెండో ఓవర్‌లో ఓపెనర్ ప్రియాన్ష్ (7)ను యష్ అవుట్ చేశాక వికెట్ల పతనం ఎక్కడా ఆగలేదు. పవర్‌ప్లే ముగిసేలోపే ప్రభ్‌సిమ్రన్, కెప్టెన్ శ్రేయాస్ (2), ఇన్‌గ్లిస్ (4) పెవిలియన్‌లో కూర్చున్నారు. అప్పటికి స్కోరు 38/4 మాత్రమే. ఆ తర్వాతైనా జాగ్రత్తగా ఆడతారనుకుంటే మధ్య ఓవర్లలో సుయాష్ సుడులు తిరిగే బంతులకు బలయ్యారు. తొమ్మిదో ఓవర్‌లో తను శశాంక్ (3), అరంగేట్ర బ్యాటర్ ముషీర్ (0)లను అవుట్ చేశాడు. ఇక రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఎదురుదాడికి దిగిన స్టొయినిస్‌ను తన తర్వాతి ఓవర్‌లోనే సుయాష్ దెబ్బతీయడంతో పంజాబ్ కనీసం వంద పరుగులైనా చేస్తుందా? అనిపించింది. అయితే ఒమర్జాయ్ పుణ్యమా అంటూ అతికష్టమ్మీద స్కోరు మూడంకెలకు చేరింది. 15వ ఓవర్ తొలి బంతికే ఒమర్జాయ్‌ను హాజెల్‌వుడ్ అవుట్ చేయడంతో పంజాబ్ ఇన్నింగ్స్ మరో 35 బంతులుండగానే ముగిసింది.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) క్రునాల్ (బి) యష్ దయాల్ 7; ప్రభ్‌సిమ్రన్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 18; ఇన్‌గ్లిస్ (సి) భువనేశ్వర్ (బి) హాజెల్‌వుడ్ 4; శ్రేయాస్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 2; నేహల్ (బి) యష్ దయాల్ 8; స్టొయినిస్ (బి) సుయాష్ 26; శశాంక్ (బి) సుయాష్ 3; ముషీర్ (ఎల్బీ) సుయాష్ 0; ఒమర్జాయ్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 18; హర్‌ప్రీత్ (బి) షెపర్డ్ 4; జేమిసన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 14.1 ఓవర్లలో 101 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-9, 2-27, 3-30, 4-38, 5-50, 6-60, 7-60, 8-78, 9-97, 10-101; **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-17-1; యష్ దయాల్ 4-0-26-2; హాజెల్‌వుడ్ 3.1-0-21-3; సుయాష్ శర్మ 3-0-17-3; క్రునాల్ పాండ్యా 1-0-10-0; షెపర్డ్ 1-0-5-1.

బెంగళూరు: సాల్ట్ (నాటౌట్) 56; విరాట్ (సి) ఇన్‌గ్లిస్ (బి) జేమిసన్ 12; మయాంక్ (సి) శ్రేయాస్ (బి) ముషీర్ 19; పటీదార్ (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 10 ఓవర్లలో 106/2. వికెట్ల పతనం:** 1-30, 2-84. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 2-0-20-0; జేమిసన్ 3-1-27-1; ఒమర్జాయ్ 1-0-10-0; హర్‌ప్రీత్ 2-0-18-0; ముషీర్ 2-0-27-1.

జ్యోతికి స్వర్ణం



- 4 x 400 మీ. రిలేలో తెలుగమ్మాయి కుంజా రజితకు పసిడి
- స్టీపుల్ చేజ్‌లో సబ్లే అదుర్స్
- ఆసియా అథ్లెటిక్స్


కుంజా రజిత

గుమి (కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ మూడోరోజు తెలుగమ్మాయిలు రెండు స్వర్ణాలు సాధించారు. జ్యోతి యర్రాజి మీట్ రికార్డు టైమింగ్‌తో స్వర్ణం నెగ్గగా..రిలేలో కుంజా రజిత పసిడి అందుకుంది. ఇక స్టీపుల్ చేజ్‌లో 36 ఏళ్ల తర్వాత అవినాష్ సబ్లే బంగారు పతకాన్ని అందించాడు. క్రీడలకు మూడో రోజైన గురువారం మూడు స్వర్ణాలు సహా ఆరు పతకాలు సాధించిన భారత్ మొత్తం 14 మెడల్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతోంది. మహిళల 100 మీ. హర్డిల్స్‌లో డిఫెండింగ్ చాంప్ జ్యోతి 12.96 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచింది. ఈ క్రమంలో 2000లో సూ యిపింగ్ (చైనా) 12.99 సెకన్ల రికార్డును జ్యోతి అధిగమించింది. అంతేకాకుండా ఈ ఈవెంట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకొన్న ఐదో అథ్లెట్‌గా కూడా యర్రాజీ రికార్డులకెక్కింది. తనాక (జపాన్) రజతం, ఉ యన్ని (చైనా) కాంస్యం దక్కించుకొన్నారు. మహిళల 4X400 రిలేలో తెలుగమ్మాయి కుంజా రజితతోపాటు జిస్నా మాథ్యూ, రూపల్ చౌదరి, శుభా వెంకటేశన్‌లతో కూడిన భారత బృందం 3 నిమిషాల 34.18 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం నెగ్గగా.. వియత్నాం రజతం, శ్రీలంక కాంస్యం సాధించాయి. పురుషుల 3000 మీ. స్టీపుల్ చేజ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సబ్లే 8 నిమిషాల 20.92 సెకన్ల టైమింగ్‌తో బంగారు పతకం సాధించాడు. పురుషుల 4X400మీ. రిలేలో జై కుమార్, ధరమ్‌వీర్ చౌధరి, మను, విశాల బృందం 3 నిమిషాల 3.67 సెకన్ల టైమింగ్‌తో రజతం దక్కించుకొంది. మహిళల లాంగ్ జంప్‌లో అన్సీ సోజన్ (6.33 మీ.) రజతం, షైలీ సింగ్ (6.30 మీ.) కాంస్యం సాధించారు.

నిష్క్రమించేదెవరో?

నేటి ఎలిమినేటర్‌లో గుజరాత్ x ముంబై రా.7.30 నుంచి

ముల్లాన్‌పూర్: ఒకదశలో టైటిల్ ఫేవరెట్‌గా కనిపించిన గుజరాత్ టైటాన్స్ లీగ్ దశ చివరకు చేరేసరికి వరుస పరాజయాలతో కొంత డీలా పడింది. మరోవైపు ఆరంభంలో వరుస ఓటములు ఎదురైనా బలంగా పుంజుకొన్న ముంబై ఇండియన్స్ ఆఖరి ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. శుక్రవారం జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్‌తో ముంబై అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు లీగ్ నుంచి నాకౌట్ కానుండగా.. గెలిచిన జట్టు ఆదివారం జరిగే క్వాలిఫయర్-2 ఆడనుంది.

గుకేష్ బోణీ



అర్జున్ ఓటమి

స్టావంగర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్ నార్వే చెస్ టోర్నీలో తొలి విజయం అందుకున్నాడు. అయితే అర్జున్ ఇరిగేసికి మాత్రం ఓటమి ఎదురైంది. బుధవారం రాత్రి జరిగిన మూడో రౌండ్‌లో వరల్డ్ నెం.2 హికరు నకమురా (అమెరికా)ను 42 ఎత్తుల్లో చిత్తు చేసిన గుకేష్ 19వ జన్మదినాన్ని మరపురానిదిగా చేసుకున్నాడు. ఇక..కరువాన (అమెరికా)తో మూడో రౌండ్‌లో 44 ఎత్తుల్లో అర్జున్ ఓడిపోయాడు. కోనేరు హంపి (6 పాయింట్లు) మూడో రౌండ్‌లో ఖాదెమ్‌పై నెగ్గింది. దాంతో ముజిచుక్‌తో కలిసి ఆమె సంయుక్తంగా ఆధిక్యంలో కొనసాగుతోంది.

క్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ

- సింధు, ప్రణయ్ ఇంటికి

సింగపూర్ ఓపెన్

సింగపూర్: భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి.. సింగపూర్ ఓపెన్ క్వార్టర్స్‌కు చేరుకోగా.. సింధు, ప్రణయ్ రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 19-21, 21-16, 21-19తో ఇండోనేసియాకు చెందిన సబర్-రెజా పహ్లెవి ద్వయంపై చెమటోడ్చి నెగ్గింది. డబుల్ ఒలింపిక్ పతక విజేత సింధు 9-21, 21-18, 16-21తో చెన్ యూఫీ (చైనా) చేతిలో, పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 16-21, 14-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు. మహిళల డబుల్స్‌లో ఎనిమిదో సీడ్ ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ 8-21, 10-21తో చైనాకు చెందిన జియా యి ఫాన్-జాంగ్ షు గ్జియాన్ చేతిలో, మిక్స్‌డ్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ జంట 10-21, 16-21తో హాంకాంగ్‌కు చెందిన టాంగ్ చున్ మన్-సి యింగ్ సూట్ చేతిలో చిత్తయ్యారు.

సిన్నర్, జొకో ముందుకు

ఫ్రెంచ్ ఓపెన్


సిన్నర్

పారిస్: టాప్ సీడ్ జానిక్ సిన్నర్‌తోపాటు మాజీ చాంపియన్ నొవాక్ జొకోవిచ్, అలెగ్జాండర్ జ్వెరెవ్, కొకొ గాఫ్ ఫ్రెంచ్ ఓపెన్ మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో వరల్డ్ నెం.1 సిన్నర్ (ఇటలీ) 6-3, 6-0, 6-4తో రిచర్డ్ గాస్క్వెట్ (ఫ్రాన్స్)పై వరుస సెట్లలో గెలిచాడు. మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 3-6, 6-1, 6-2, 6-3తో జాస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)ను, రుబ్లేవ్ 7-6(1), 6-1, 7-6(5)తో ఆడమ్ వాల్టన్‌ను, ఆరో సీడ్ జొకోవిచ్ 6-3, 6-2, 7-6(1) కొరెంటిన్ మౌటెట్ (ఫ్రాన్స్)ను ఓడించారు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) 6-2, 6-4తో టెరెజా వెలెంటోవా (చెక్)పై, జెస్సికా పెగులా 6-3, 7-6(3)తో అన్ లిపై, ఆరో సీడ్ మిర్రా ఆండ్రీవా 6-3, 6-4తో అష్లిన్ క్రూగర్‌పై, మాడిసన్ కీస్ (అమెరికా) 6-1, 6-3తో కేటీ బౌల్టర్ (బ్రిటన్)పై, పౌలా బడోసా 3-6 6-4, 6-4తో ఎలెనా గాబ్రియెలా రూజ్‌పై నెగ్గారు.

భారత్ X ఆసీస్ పోరు

మహిళల 3 వన్డేల సిరీస్ షెడ్యూల్

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్‌కప్ సన్నాహకంగా భారత-ఆస్ట్రేలియా మధ్య 3 మ్యాచ్‌ల సిరీస్ జరుగనుంది. సెప్టెంబరు 14, 17, 20వ తేదీల్లో చెన్నైలో ఈ మ్యాచ్‌లను నిర్వహిస్తారు.

ఆసీస్, దక్షిణాఫ్రికా పురుషుల 'ఎ' జట్లు కూడా..: ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత్ 'ఎ' జట్టు ఆ తర్వాత స్వదేశంలో బిజీ కానుంది. సెప్టెంబరు-నవంబరు మధ్యలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా 'ఎ' జట్లతో తలపడనుంది. ముందుగా ఆసీస్ 'ఎ'తో సెప్టెంబరు 16-23 మధ్య రెండు.. నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడుతుంది. అనంతరం అదే నెల 30, అక్టోబరు 3, 5తేదీల్లో వన్డే సిరీస్ ఉంటుంది. ఇక దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతోనూ నవంబరు 2-9 మధ్య రెండు.. నాలుగు రోజుల మ్యాచ్‌లు.. 13, 16, 19 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.

బిజినెస్

రూ.76.25 లక్షల కోట్లు

2024-25లో 8.2 శాతం పెరిగిన ఆర్‌బీఐ ఆస్తి-అప్పుల పట్టిక



ముంబై: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బ్యాలెన్స్ షీట్ (ఆస్తి-అప్పుల పట్టిక) వార్షిక ప్రాతిపదికన 8.20 శాతం వృద్ధితో రూ.76.25 లక్షల కోట్లకు పెరిగింది. విదేశీ మారక (ఫారెక్స్) లావాదేవీల ద్వారా లాభాలు 33 శాతం పెరగడం ఇందుకు దోహదపడిందని, దీంతో కేంద్రానికి ఈసారి రూ.2.69 లక్షల కోట్ల భారీ డివిడెండ్ అందించగలిగినట్లు గురువారం విడుదల చేసిన వార్షిక నివేదికలో ఆర్‌బీఐ పేర్కొంది.

- 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.70,47,703.21 కోట్లుగా ఉన్న బ్యాలెన్స్ షీట్.. 2024-25 చివరినాటికి రూ.5,77,718.72 కోట్ల (8.20 శాతం) పెరుగుదలతో రూ.76,25,421.93 కోట్లకు చేరుకుంది.
- గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ ఆదాయం 22.77 శాతం వృద్ధి చెందగా.. వ్యయాలు 7.76 శాతం పెరిగాయి. మిగులు నిధులు వార్షిక ప్రాతిపదికన 27.37 శాతం పెరిగి రూ.2,68,590.07 కోట్లుగా నమోదయ్యాయి. ఈ మిగులు నిధులనే ఆర్‌బీఐ డివిడెండ్ రూపంలో కేంద్రానికి బదిలీ చేస్తుంది.
- గోల్డ్ (52.09 శాతం), దేశీయ పెట్టుబడులు (14.32 శాతం), విదేశీ పెట్టుబడుల (1.70 శాతం) పెరుగుదల ఆర్‌బీఐ బ్యాలెన్స్‌షీట్‌లో ఆస్తుల వృద్ధికి తోడ్పడింది.
- గత ఆర్థిక సంవత్సరంలో ఫారెక్స్ లావాదేవీల ద్వారా లాభాలు వార్షిక ప్రాతిపదికన 33 శాతం పెరిగి రూ.1.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

పెద్ద నోట్లలో నకిలీల బెడద

గత ఆర్థిక సంవత్సరం గుర్తించిన మొత్తం నకిలీ నోట్లలో 4.7 శాతం ఆర్‌బీఐ వద్ద పట్టుబడ్డాయి. రూ.10, 20, 50, 100 కరెన్సీల్లో నకిలీ నోట్ల బెడద కాస్త తగ్గగా.. రూ.200 నోట్లలో 13.9 శాతం, రూ.500 నోట్లలో 37.3 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

చలామణిలో ఉన్న కరెన్సీలో రూ.500 నోట్లదే 86% వాటా

గత ఆర్థిక సంవత్సరం మార్కెట్లో చలామణిలో ఉన్న కరెన్సీ మొత్తం విలువ 6 శాతం, కరెన్సీ నోట్లు 5.6 శాతం పెరిగాయి. నాణేల విలువ 9.6 శాతం, వాటి సంఖ్య 3.6 శాతం పెరిగాయి. చలామణిలో ఉన్న ఈ-రూపీ విలువ 334 శాతం వృద్ధి చెందింది. కాగా, చలామణిలో ఉన్న కరెన్సీలో రూ.500 నోట్ల వాటా విలువ 86 శాతంగా ఉంది. నోట్ల సంఖ్య 40.9 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఆ తర్వాత రూ.10 నోట్ల వాటా 16.4 శాతంగా ఉంది. చలామణిలో ఉన్న రూ.10, 20, 50 నోట్ల మొత్తం వాటా 31.7 శాతమని నివేదిక తెలిపింది. రూ.2000 నోట్లను మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు 2023 మే నెలలో ఆర్‌బీఐ ప్రకటించింది. ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఈ మార్చి 31 నాటికి 98.2 శాతానికి సమానమైన రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2,000 నోట్లు తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

రూ.4.32 లక్షల కోట్ల బంగారం

గత ఆర్థిక సంవత్సరంలో తమ వద్దనున్న పసిడి ఆస్తుల మొత్తం విలువ 57.12 శాతం పెరిగి రూ.4,31,624.8 కోట్లకు చేరుకుందని ఆర్‌బీఐ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం మరో 54.13 మెట్రిక్ టన్నుల బంగారాన్ని పోగేయడంతో పాటు మార్కెట్లో ఈ విలువైన లోహం ధర భారీగా పెరగడం ఇందుకు దోహదపడిందని వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ మార్చి 31 నాటికి ఆర్‌బీఐ వద్దనున్న బంగారం నిల్వలు 879.58 మెట్రిక్ టన్నులకు పెరిగాయి.

కరెన్సీ ముద్రణ ఖర్చులు 25% పెరిగాయ్..

గత ఆర్థిక సంవత్సరం కరెన్సీ నోట్ల ముద్రణ ఖర్చు వార్షిక ప్రాతిపదికన 25 శాతం పెరిగి రూ.6,372.8 కోట్లకు చేరింది. బ్యాంకింగ్ నోట్ల ముద్రణ పెంచాల్సి రావడం ఇందుకు కారణమైంది. 2023-24లో ఈ వ్యయం రూ.5,101.4 కోట్లుగా నమోదైంది.

రూ.36,014 కోట్ల బ్యాంకింగ్ మోసాలు

గత ఆర్థిక సంవత్సరం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో రుణ, డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన మోసాల విలువ మూడింతలై రూ.36,014 కోట్లకు పెరిగింది. సుప్రీం కోర్టు ఆదేశానుసారంగా 122 కేసుల పునర్వర్గీకరణ ఇందుకు ప్రధాన కారణమని ఆర్‌బీఐ పేర్కొంది. 2023-24లో రూ.12,230 కోట్ల బ్యాంకింగ్ మోసాలు నమోదయ్యాయి. కాగా, 2023-24లో 36,060 మోసాలను గుర్తించగా.. 2024-25లో మాత్రం ఈ కేసులు 23,953కు తగ్గాయి.

చలామణిలో రూ.1,000 కోట్ల ఈ-రూపీ

ఈ మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) లేదా ఈ-రూపీ మొత్తం విలువ రూ.1,016 కోట్లకు చేరింది. 2023-24 చివరినాటికి నమోదైన రూ.234 కోట్లతో పోలిస్తే ఈ-రూపీ చలామణి 334 శాతం పెరిగింది. ఈ-రూపీ ద్వారా విదేశీ చెల్లింపులు జరిపే సదుపాయాన్ని సైతం అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఎప్పటిలోగా ఇది ప్రారంభమవుతుందన్న విషయంలో మాత్రం స్పష్టతనివ్వలేదు. ఆర్‌బీఐ 2022 నవంబరులో తొలిసారిగా సీబీడీసీని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం చలామణిలో ఉన్న ఈ-రూపీలో రూ.857 కోట్లు రూ.500 డినామినేషన్‌వే. రూ.200 డినామినేషన్ ఈ-రూపీ రూ.91 కోట్లు, రూ.100 డినామినేషనలో రూ.38 కోట్లు చలామణిలో ఉన్నాయి.

చిరిగిన నోట్లతో బోర్డుల తయారీ

బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చిన చిరిగిన కరెన్సీ నోట్లను ముక్కలు చేసి వాటిని పార్టికల్ బోర్డుల తయారీలో ఉపయోగించనున్నట్లు, ఇందుకోసం బోర్డు తయారీదారులను ఎంపికచేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. దేశంలో ఏటా చిరిగిన బ్యాంక్ నోట్లు లేదా కుదించిన కాగితపు దిమ్మెల బరువు దాదాపు 15,000 టన్నుల స్థాయిలో ఉంటుందని, దాన్ని పారవేయకుండా పర్యావరణ హిత పునర్వినియోగంపై దృష్టిసారించినట్లు ఆర్‌బీఐ రిపోర్టు పేర్కొంది.


ఐఎస్‌బీ హైదరాబాద్‌కు రూ.100 కోట్ల విరాళం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కి భారీ విరాళం అందనుంది. మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్.. ఐఎస్‌బీకి రూ.100 కోట్ల విరాళం ప్రకటించింది. దీనికి సంబంధించి రెండు సంస్థలు ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. ఐఎస్‌బీ చరిత్రలో ఒక సంస్థ నుంచి ఇంత పెద్దమొత్తంలో విరాళం అందడం ఇదే మొదటిసారి. ఈ విరాళంతో ఐఎస్‌బీ తన హైదరాబాద్ క్యాంపస్‌లో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ పేరుతో 1,91,532 ఎస్‌ఎఫ్‌టీ విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్ ప్లస్ రెండంతస్తుల భవనాన్ని నిర్మిస్తుంది.

లాభాల్లోకి మార్కెట్


ముంబై: ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలను అమెరికన్ కోర్టు నిలిపివేయడంతో గురువారం మార్కెట్ తిరిగి పునరుజ్జీవం బాట పట్టింది. రెండు రోజుల నష్టాలకు స్వస్తి పలికి ఈక్విటీ సూచీలు లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ 320.70 పాయింట్లు పెరిగి 81,633.02 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 504.57 పాయింట్ల వృద్ధితో 81,816.89 పాయింట్లను తాకింది. నిఫ్టీ 81.15 పాయింట్ల లాభంతో 24,833.60 వద్ద క్లోజయింది. నెలవారీ కాంట్రాక్టుల ముగింపు దినాన్ని పురస్కరించుకుని సూచీ భారీ ఆటుపోట్లకు గురయింది. ఆటుపోట్ల ట్రేడింగ్‌లో మెటల్, రియల్టీ, ఫార్మా, ఐటీ సూచీలు లాభపడ్డాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




30వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	117
కరీంనగర్	115	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	100
కర్నూలు	115	నెల్లూరు	105
విశాఖపట్నం	111	అనంతపురం	105
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,040 ▼	88,950 ▼	1,11,000 ▲
విజయవాడ	98,000 ▼	92,000 ▼	1,00,000 ▲
విశాఖపట్నం	98,510 ▼	88,950 ▼	1,10,900 ▼
రాజమండ్రి	97,040 ▼	88,950 ▼	1,00,600 ▼
ప్రొద్దుటూరు	95,100 ▼	87,490 ▼	98,700 ▼
ముంబై	95,525 ▼	87,501 ▼	98,100 ▲

తగ్గిన అమర రాజా ఎనర్జీ లాభం

ఒక్కో షేరుకు రూ.5.20 డివిడెండ్ సిఫారసు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ.. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.161.57 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.229.78 కోట్లు)తో పోల్చితే లాభం 29.7 శాతం క్షీణించింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కార్యకలాపాల ఆదాయం మాత్రం రూ.2,907.86 కోట్ల నుంచి రూ.3,060.07 కోట్లకు పెరిగింది. నిర్వహణా వ్యయాలు గణనీయంగా పెరగటం మార్చి త్రైమాసికంలో కంపెనీ పనితీరును దెబ్బతీసింది. కాగా మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.12,961.91 కోట్ల రెవెన్యూపై రూ.944.67 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5.20 (520 శాతం) తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

2025-26లో సీఎస్‌ఆర్ కోసం రూ.150 కోట్లు

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్



హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కోసం రూ.150 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది. సీఎస్‌ఆర్ కింద దేశవ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆకలి తీర్చటం, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారిత, పర్యావరణ పరిరక్షణ, నిరుపేదలకు గృహ నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ నెల 28 న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వరల్డ్ హంగర్ డే సందర్భంగా నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ మలబార్ గ్రూప్ తదుపరి దశ సీఎస్‌ఆర్ కార్యక్రమాలను ప్రారంభించారు. మలబార్ గ్రూప్ ప్రధాన సేవా కార్యక్రమం అయిన ది హంగర్ ఫ్రీ వరల్డ్ కింద భారత్ సహా జాంబియా దేశాల్లోని నిరుపేదలకు ప్రతిరోజు 70,000 భోజనాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. 2025-26లో మొత్తం 2.5 కోట్ల భోజనాలు అందించనున్నట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో రోజుకు 2,100 మందికి భోజనాలు అందించే ఈ కార్యక్రమాన్ని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ ఆర్టిస్ట్రీ స్టోర్ వద్ద సోమాజీగూడ కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. నిరాశ్రయులైన మహిళల కోసం గ్రాండ్‌మా హోమ్స్ పేరుతో మలబార్ గ్రూప్ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్, బెంగళూరు, కేరళల్లో ఈ హోమ్స్ ద్వారా ఉచిత వసతి, సంరక్షణ సేవలందిస్తోంది. త్వరలో దీన్ని చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, ముంబై నగరాలకు విస్తరించేందుకు మలబార్ గ్రూప్ ప్రణాళికలు రచిస్తోంది.

పోకర్ణ లాభంలో 280% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో పోకర్ణ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ ప్రాతిదికన రూ.262.67 కోట్ల ఆదాయంపై రూ.58.90 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.15.51 కోట్లు)తో లాభం ఏకంగా 279.77 శాతం వృద్ధి చెందగా ఆదాయం 62.50 శాతం పెరిగింది. మార్చితో ముగిసిన మొత్తం ఆర్థిక సంవత్సరానికి గాను రూ.930.13 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.187.54 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అనుబంధ సంస్థ పోకర్ణ ఇంజనీర్డ్ స్టోన్ సామర్థ్యాలను విస్తరించామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం నుంచి ఈ విభాగం నుంచి మంచి ఆదాయాలు వస్తాయని అంచనా వేస్తున్నట్లు పోకర్ణ లిమిటెడ్ సీఎండీ గౌతమ్ చంద్ జైన్ తెలిపారు. అలాగే హైదరాబాద్, మేకగూడ ప్లాంట్‌లో మెషినరీ ఏర్పాటు డిసెంబరు నాటికి పూర్తి కావచ్చని కంపెనీ పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో ఇది కార్యకలాపాలు ప్రారంభించనుందని తెలిపింది.

రాష్ట్రానికి రానున్న నలుగురు కొత్త ఐఏఎస్‌లు

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): 'సివిల్ సర్వీసెస్ పరీక్ష-2024' ద్వారా ఎంపికైన నలుగురు కొత్త ఐఏఎస్ అధికారులు రాష్ట్రానికి రానున్నారు. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి మొత్తం 180 మంది ఐఏఎస్‌లను ఆయా రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీవోపీటీ) వెల్లడించింది. రాష్ట్రానికి రానున్న నలుగురిలో ఇద్దరు సొంత రాష్ట్రం తెలంగాణకు చెందిన వారు కాగా... మిగతా ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందినవారని తెలిపింది. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందినవారు కాగా, మరో ఇద్దరు ఇతర వెనుకబడిన వర్గాల(ఓబీసీ)కు చెందినవారు ఉంటారని డీవోపీటీ పేర్కొంది.

విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలి

» అధిష్ఠానానికి విజ్ఞప్తి చేయనున్న ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఆ వర్గానికి చెందిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు మందుల సామ్యూల్, కవ్వంపల్లి సత్యానారాయణ, అడ్లూరి లక్ష్మణ్, తోట లక్ష్మీకాంతరావు మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఈ విషయంపై సీఎం, పీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఇప్పుడు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు చెప్పాలని ఢిల్లీకి వచ్చామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 60 లక్షలు వరకు ఉన్న తమకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని చెప్పారు. మంత్రివర్గంలో ఇప్పటికే ఇద్దరు మాలలు ఉన్నారని, ఉప కులానికి చెందిన మరొకరు ఉన్నారని, కాబట్టి ఈసారి తప్పకుండా మాదిగలకు అవకాశం ఇవ్వాలన్నారు.

మంత్రిపై అసభ్య పోస్టు .. బీఆర్‌ఎస్ నేత అరెస్ట్

కాటారం, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబుపై సోషల్‌మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టిన కాటారం బీఆర్‌ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్‌లో ఉన్న శ్రావణ్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు తెలిపారు. మరోవైపు శ్రావణ్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు బెయిల్ మంజూరు చేసిందని బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

» భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 80 మంది ఆటో డ్రైవర్లు చనిపోగా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా 60 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఆటోడ్రైవర్‌కు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం, ఓలా, ఉబర్ తరహాలో ప్రభుత్వ యాప్ తేవాలని గ్రేటర్ హైదరాబాద్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు దయానంద్ కోరారు. మహాలక్ష్మి పథకంతో గిరాకి లేక ఆటో డ్రైవర్ల కుటుంబ పోషణ భారంగా మారిందని, ఆదుకునేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికసంఘాలపై ఉక్కుపాదం: ఆర్టీసీ జేఏసీ

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో వెల్ఫేర్ బోర్డుల్ని అడ్డుపెట్టుకుని కార్మిక సంఘాలపై ఉక్కుపాదం మోపే కుట్ర జరుగుతోందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న ఆరోపించారు. ఇటీవల ఆర్టీసీ ఎండీ నిర్వహించిన వెల్ఫేర్ బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడిన మాటలే అందుకు నిదర్శనమని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మరోవైపు విజిలెన్స్ అధికారులు అర్ధరాత్రులు బ్రీత్ ఎనలైజర్ పరీక్షల పేరుతో సిబ్బందిని వేధింపులకు గురిచేయడం సరైనది కాదని ఆయన అన్నారు.

చారిత్రక చిత్రంగా 'రజాకార్' ఎంపిక దారుణం

» తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రాంనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ చారిత్రక చిత్రంగా రజాకార్ సినిమాను ఎంపిక చేయడం దారుణమని తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో తెలంగాణ సమాజాన్ని కించపరిచినట్లయ్యిందన్నారు. గద్దర్ ఆశయాలను అవమానించేలా అవార్డుల ప్రదానం జరిగిందన్నారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గద్దర్ అవార్డుల ఎంపికతో కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చిందన్నారు.

అసమానతలు ఉన్నంత కాలం ప్రజాపోరాటాలు

» జస్టిస్ బి.చంద్రకుమార్

బర్కత్‌పుర, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అసమానతలు, దోపిడీ, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మహిళలపై హింస బాలకార్మిక వ్యవస్థ కొనసాగినంత కాలం ప్రజా ఉద్యమ పోరాటాలు సజీవంగానే ఉంటాయని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ స్పష్టం అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో కేంద్రం తక్షణమే కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి కాల్పుల విమరణను ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సదస్సులో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబసభ్యులు, బంధువులకు అప్పగించకుండా పోలీసులే ఖననం చేయడం, మృతదేహాల వద్ద సంబరాలు జరుపుకోవడం హిందూ ధర్మానికి పూర్తి విరుద్ధమని విమర్శించారు.

సావర్కర్-గాడ్సేలు రక్త సంబంధీకులు

» కోర్టుకు ఈ విషయాన్ని చెప్పకపోవడం నేరం

» అఫిడవిట్‌లో పేర్కొన్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మే 29: హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ సావర్కర్, మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరాం గాడ్సే కుటుంబాల మధ్య రక్త సంబంధం ఉందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పుణె కోర్టులో తనపై నడుస్తున్న పరువు నష్టం దావాను పురస్కరించుకొని సమర్పించిన అఫిడవిట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. వి.డి. సావర్కర్ తమ్ముడి మనుమడు సాత్యకి సావర్కర్ ఈ పరువు నష్టం దావా వేశారు. సాత్యకి...వినాయక్ సావర్కర్ తమ్ముడు నారాయణ్ సావర్కర్ మనుమడు కావడం గమనార్హం. 2023 మార్చిలో లండన్‌లో ప్రసంగించిన రాహుల్.. వినాయక్ సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు. దీనికి సమాధానంగానే రాహుల్ అఫిడవిట్ సమర్పించారు. ఈ అఫిడవిట్‌లో సాత్యకి తల్లి తరఫు బంధువుల వివరాలను వెల్లడించారు. సాత్యకి తల్లి హిమాని అశోక్ సావర్కర్ 1947లో పుణెలో జన్మించి 2015లో మరణించారు. ఆమె గోపాల్ వినాయక్ గాడ్సే కుమార్తె. మహాత్మా గాంధీ హత్య కేసులో ఉరిశిక్షను అనుభవించిన నాథూరాం వినాయక్ గాడ్సే సోదరుడే గోపాల్ గాడ్సే అని రాహుల్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. హిమానీ సావర్కర్ కూడా హిందుత్వ కార్యకర్త అని, ఆమె వి.డి. సావర్కర్ సోదరుడి కుమారుడు అశోక్ సావర్కర్‌ను వివాహమాడారని తెలిపారు. మహాత్మా గాంధీ హత్య కేసులో వి.డి. సావర్కర్ నిందితుడిగా ఉన్నా తరువాత నిర్దోషిగా విడుదలయ్యారని, గోపాల్ గాడ్సే శిక్ష అనుభవించారని పేర్కొన్నారు. ప్రస్తుత దావాలో ఈ చారిత్రక అంశాలు చాలా కీలకమని తెలిపారు. తల్లి తరఫు బంధువుల వివరాలను కోర్టుకు వెల్లడించకపోవడం తీవ్రమైన అంశమని, ఆ సమాచారాన్ని తొక్కి పెట్టినందున కేసును కొట్టివేయవచ్చని అభిప్రాయపడ్డారు.



సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలిసిన తెలంగాణ కేడర్‌కు కేటాయించిన 2024 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

రేపే మిస్ వరల్డ్-2025 ఫైనల్

హైటెక్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా వేదిక .. మల్టీ మీడియా చాలెంజ్‌లో విజేతలుగా నలుగురు

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రపంచ అందాల పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం మిస్ వరల్డ్-2025 ఫైనల్ కోసం నగరం సిద్ధమైంది. సాయంత్రం 6 గంటల నుంచి హైటెక్స్‌లో జరగనున్న ఈ పోటీల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. విదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక డిజైనర్లు ప్రధాన వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. శనివారం వేడుకల్లో భాగంగా.. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండేజ్, ఇషాన్ ఖట్టర్‌తో పాటు పలువురు నటులు నృత్యప్రదర్శన ఇవ్వనున్నారు. ఫైనల్ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ప్రముఖ నటుడు సోనూ సూద్, మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి, 2017 మిస్ వరల్డ్ విజేత మానుషి చిల్లర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. కాగా.. ఏటా మిస్ వరల్డ్ ఫైనల్లో ఇచ్చే మానవతావాది (హ్యూమానిటేరియన్) పురస్కారాన్ని ఈసారి సోనూసూద్‌కు ఇవ్వనున్నారు. అలాగే రెండు రోజుల క్రితం నిర్వహించిన 'మల్టీమీడియా చాలెంజ్' విజేతలను మిస్ వరల్డ్ సంస్థ గురువారం రాత్రి ప్రకటించింది. ఇందులో నాలుగు ఖండాల నుంచి నలుగురు విజేతలున్నారు. ఏషియా-ఓషియానా నుంచి థాయ్‌లాండ్, యూరప్ నుంచి మాంటేనెగ్రో, ఆఫ్రికా నుంచి కామెరూన్, అమెరికా-కరేబియన్ నుంచి డొమినికన్ రిపబ్లిక్ దేశాల ప్రతినిధులు ఇందులో విజేతలుగా నిలిచారు. దీంతో ఫైనల్‌లో టాప్-40లో వీరి స్థానం ఖరారైంది.



'మల్టీమీడియా చాలెంజ్' విజేతలు మిస్ థాయ్‌లాండ్, మిస్ కామెరూన్, మిస్ డొమినికన్ రిపబ్లిక్, మిస్ మాంటెనెగ్రో

'మిస్ వరల్డ్'కు రూ.300 కోట్లా..?

» మహిళా హక్కుల ఉద్యమకారుల ధ్వజం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర పైసల్లేవ్.. కానీ, మిస్ వరల్డ్ అందాల పోటీలకు మాత్రం రూ.300 కోట్లు ఖర్చుపెడతారా?'అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మహిళా హక్కుల ఉద్యమకారులు మండిపడ్డారు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్ వరల్డ్ పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీకి ఆయా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. శనివారం జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలేను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పదోవంతు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు సున్నా

ఒక్కరూ చేరని కాలేజీలు 74 .. 60,436 మందికి ప్రవేశాలు ఖరారు..దోస్త్ తొలి విడత జాబితా విడుదల

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదోవంతు డిగ్రీ కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన దోస్త్-2025 తొలి విడత అడ్మిషన్లలో రాష్ట్రంలోని 805 కాలేజీల్లో 74 కాలేజీల్లో ఒక్కరూ అడ్మిషన్‌కు వెబ్ ఆప్షన్ ఇవ్వలేదు. అందులో రాజన్న-సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా ఉంది. గతేడాది మాదిరే ఈసారి యూజీ డిగ్రీలో 36శాతం (21,758 మంది) కామర్స్ కోర్సులు ఎంచుకోగా, తర్వాతి స్థానాల్లో ఫిజికల్ సైన్సెస్ 15,249 మంది, లైఫ్ సైన్సెస్ 11,005 మంది, ఆర్ట్స్ 5,986 మంది, ఇతర కోర్సులు 6,438 మంది ఎంచుకున్నారు. 58,575 మంది ఇంగ్లీష్ మాధ్యమం, 1,552 మంది తెలుగు, 309 మంది హిందీ మాధ్యమం ఎంచుకున్నారు. తొలి జాబితాలో సీట్లు విద్యార్థినులే అధికసీట్లు పొందారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో 89,572 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 65,191 మంది వెబ్ ఆప్షన్లు సమర్పించారు. వారిలో 60,436 మంది సీట్లు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 805 డిగ్రీ కాలేజీల్లో 3,71,096 సీట్లు ఉన్నాయి. దోస్త్ తొలి విడత అడ్మిషన్ల జాబితాను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు ఈ.పురుషోత్తం, ఎస్‌కె. మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు గురువారం విడుదల చేశారు. తొలి జాబితాలో సీట్లు లభించిన వారు ఈ నెల 30 నుంచి జూన్ ఆరో తేదీ వరకూ నిర్దిష్ట ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, లేకపోతే సీటు రద్దవుతుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి జూన్ 9వరకూ దోస్త్ రెండో విడత దరఖాస్తులను స్వీకరిస్తామని, 13న సీట్లు కేటాయిస్తామన్నారు.



దోస్త్ వివరాలు ప్రకటిస్తున్న ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, తదితరులు

సీట్ల భర్తీలో నిజాం కాలేజీ టాప్

హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ 1,197 సీట్లకు 1,170 (97.74%) సీట్ల భర్తీతో మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో కోఠి మహిళా కాలేజీ (వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం)లో 93.19%, మూడో స్థానంలో ఉన్న సిటీ కాలేజీలో 88.89, బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 82.69, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 80.98, నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రాం డిగ్రీ కాలేజీలో 80.29, కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కాలేజీలో 73.01, నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కాలేజీలో 68.56, హన్మకొండలోని యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో 66.1, నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీలో 65.75% సీట్లు భర్తీ అయ్యాయి. ఈసారి దోస్త్‌లో 10 మంది టాప్ ర్యాంకర్లలో నలుగురు కోఠి మహిళా కాలేజీని ఎంచుకున్నారు. వారిలో ముగ్గురు ఫిజికల్ సైన్సెస్, ఒకరు లైఫ్ సైన్స్ సబ్జెక్ట్ ఆప్ట్ చేసుకున్నారు. ఇంటర్‌లో 99.60% మార్కులతో దోస్త్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు పొందిన వసంత్ కుమార్, 99.40% మార్కులతో ఎనిమిదో ర్యాంకు పొందిన బెక్కరి అక్షిత కూడా నిజాం కాలేజీలో కామర్స్ విభాగంలో సీటు పొందారు.

75% హాజరుతోనే ఫీజు రీయింబర్స్‌మెంట్

డిగ్రీ కోర్సుల్లో కనీసం 75% తరగతులకు హాజరైన విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని గురువారం జరిగిన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మరోవైపు, మూడేళ్ల డిగ్రీ కోర్సులో ఆరు సెమిస్టర్లలో ప్రతి సెమిస్టర్‌కు 25 క్రెడిట్స్ చొప్పున 150 క్రెడిట్స్ ఉండగా, వాటిని 142కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చివరి సంవత్సరం రెండు సెమిస్టర్లలో ఒక మైనర్ సబ్జెక్ట్, ప్రథమ/ద్వితీయభాషలకు కలిపి 15 చొప్పున 30 క్రెడిట్స్ తొలగించారు. ఐదో సెమిస్టర్‌లో మల్టీ డిసిప్లినరీ కోర్సు 4, అదనంగా నేర్చుకునే ఇతర కోర్సులకు 7 క్రెడిట్స్, చివరి సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌కు 4, ఇతర అదనపు కోర్సులకు 7 క్రెడిట్స్ కేటాయించారు. చివరి రెండు సెమిస్టర్లలో విద్యార్థులు రెండు ప్రధాన సబ్జెక్టులపై దృష్టి సారించాలని, ఇంటర్న్‌షిప్‌తోపాటు అదనపు కోర్సులు నేర్చుకోవాలన్న లక్ష్యంతో కొత్త క్రెడిట్స్ విధానం రూపొందించామని బాలకిష్టారెడ్డి తెలిపారు.

భవనంపై నుంచి దూకి బీఆర్‌ఎస్ నేత ఆత్మహత్య

మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ వేధింపుల వల్లేనంటూ బంధువుల ఆందోళన

బోరబండ ప్రాంతంలో ఉద్రిక్తత

బోరబండ, మే 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోరబండ డివిజన్ బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సర్దార్ (33) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులే సర్దార్ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన బంధువులు గురువారం ఆందోళనకు దిగారు. దీనితో బోరబండ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎండీ సర్దార్ ఎస్‌ఆర్‌టీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి తన ఇంటి నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ బంధువులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బోరబండ ప్రాంతంలో, ఫసియుద్దీన్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్దార్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఫసియుద్దీన్, ఆయన భార్య హబీబాషేక్, పీఏ సప్తగిరితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన సోదరుడు ఇటీవల ఇంటి ఆధునీకరణ పనులు చేపట్టారని.. దీనితో డబ్బులు డిమాండ్ చేస్తూ వారు వేధించారని ఇబ్రహీం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సర్దార్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



ఎండీ సర్దార్ (ఫైల్)

కిషన్‌రెడ్డి ఎవరినీ ఉద్దేశించి మాట్లాడలేదు

టెలీకాన్ఫరెన్స్‌లో పార్టీ విధానాలపైనే స్పష్టతనిచ్చారు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధినాయకత్వం సూచనల మేరకు నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరినీ ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదని బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ తెలిపారు. కేవలం పార్టీ విధానాలపైనే స్పష్టత ఇచ్చారని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో ప్రతీ కార్యకర్త, ప్రతీ నాయకుడు చురుగ్గా పాల్గొనాలనే దృక్కోణంతో కిషన్‌రెడ్డి టెలి కాన్ఫరెన్సు నిర్వహించారని చెప్పారు. ఈ సందర్భంగా ఎవరి మీదా ప్రత్యేకంగా విమర్శలు చేయలేదని సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ రాష్ట్ర నేతలకు కిషన్‌రెడ్డి హెచ్చరించినట్లుగా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు.



అవార్డుల వివరాలను సీఎం రేవంత్‌కు అందజేస్తున్న జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ, చిత్రంలో దిల్ రాజు, జీవిత

ఉత్తమనటుడు అల్లు అర్జున్

(మొదటిపేజీ తరువాయి)

చిత్రంగా 'లక్కీ భాస్కర్' ఎంపికైనట్టు తెలిపారు. జ్యూరీ కమిటీ నిష్పక్షపాతంగా అవార్డులకు అర్హులను ఎంపిక చేసిందని దిల్ రాజు తెలిపారు. జూన్ 14న ఈ అవార్డులను బహూకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా.. అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు వచ్చాయని జయసుధ తెలిపారు. అవార్డుల ఎంపికలో ప్రభుత్వం తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని.. చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా అన్నింటినీ జ్యూరీ కమిటీ పరిశీలించిందని వివరించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, కమిటీ ఏకాభిప్రాయంతో అవార్డులకు అర్హులను ఎంపిక చేసిందని.. కొత్త దర్శకులు, నటులతో తీసిన చాలా సినిమాలు పరిశీలనకు రావడం సంతోషాన్ని కలిగించిందని ఆమె చెప్పారు.

ఇవీ అవార్డుల వివరాలు..

- ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ
- రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్
- మూడో ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్
- చైతన్యం కలిగించే కేటగిరీలో ఉత్తమ చిత్రం: కమిటీ కుర్రాళ్లు
- ఉత్తమ బాలల చిత్రం: '35' చిన్న కథ కాదు
- చరిత్ర, వారసత్వం కేటగిరీలో ఉత్తమ చిత్రం: రజాకార్
- ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
- ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: ఆయ్
- ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి 2898 ఏడీ)
- ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప-2)
- ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
- ఉత్తమ సహాయ నటుడు: ఎస్.జె.సూర్య (సరిపోదా శనివారం)
- ఉత్తమ సహాయ నటి: శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
- ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ సిసిరోలియో (రజాకార్)
- ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (ఊరుపేరు భైరవకోన)
- ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయ ఘోషల్ (పుష్ప 2)
- ఉత్తమ హాస్యనటులు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తు వదలరా 2)
- ఉత్తమ బాలనటులు: అరుణ్‌దేవ్ (35 చిన్నకథ కాదు), హారిక (మెర్సీ కిల్లింగ్)
- ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
- ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత: వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
- ఉత్తమ గీత రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)
- ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)
- ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
- ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మీనన్ (గామి)
- ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (దేవర)
- ఉత్తమ కళా దర్శకుడు: అద్నితిన్ జిహాని చౌదరి (కల్కి)
- ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె.చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
- ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)
- ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చన రావు, అజయ్ కుమార్ (కల్కి 2898 ఏడీ)

స్పెషల్ జ్యూరీ అవార్డులు

- దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), అనన్య నాగళ్ల (పొట్టేల్)
- సుజిత్,సందీప్ (క), ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి (రాజుయాదవ్)
- స్పెషల్ జ్యూరీ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా-2)
- తెలుగు సినిమాపై ఉత్తమ పుస్తకం 'మన సినిమా ఫస్ట్ రీల్': రెంటాల జయదేవ

మూడ్రోజుల్లో భారత్‌కు రావాలి

» కేసు దర్యాప్తునకు సహకరించాలి.. కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలి

» ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టు ఆదేశాలు.. విచారణ ఆగస్టు 5కు వాయిదా

న్యూఢిల్లీ, మే 29 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ చీఫ్(ఓఎస్డీ) ప్రభాకర్‌రావు మూడ్రోజుల్లో భారత్ రావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో ప్రభాకర్‌రావుకు ఊరటనిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవొద్దని సర్కారుకు సూచించిన సుప్రీంకోర్టు.. అదే సమయంలో మధ్యంతర ఉత్తర్వులను అలుసుగా తీసుకోవద్దని ప్రభాకర్‌రావును హెచ్చరిస్తూ ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది. తెలంగాణలో గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా అక్రమ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పంజాగుట్ట పోలీసులు 2024 మార్చి 10న కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు.. అప్పటికే క్యాన్సర్ చికిత్సకు అమెరికా వెళ్లారు. ఈ కేసు దర్యాప్తులో ఓ దశలో.. "నాకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే.. భారత్‌కు తిరిగి వస్తాను" అని ప్రభాకర్‌రావు హైకోరునాశ్రయించారు. ఆ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించగా.. ఆ తీర్పును ఈ నెల 9న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మల ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదిస్తూ.. "ప్రభాకర్‌రావు పోలీసు శాఖలో 30 ఏళ్లకు పైగా సేవలందించారు. క్యాన్సర్ చికిత్సకు అమెరికాకెళ్లగానే కేసు నమోదైంది. పాస్‌పోర్టు రద్దు చేశారు" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. తొలుత దేశానికి వచ్చేలా చేసి, విచారణకు సహకరించకపోతే.. అప్పుడు చర్యలు తీసుకోవచ్చని గత విచారణలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. జస్టిస్ నాగరత్న కల్పించుకుంటూ.. ప్రభాకర్‌రావు భారత్‌కొచ్చారా? అని ప్రశ్నించారు. దానికి శేషాద్రినాయుడు స్పందిస్తూ.. పాస్‌పోర్టు రద్దుతో రాలేకపోతున్నారని, కోర్టు అనుమతిస్తే ఆయన దేశానికి వచ్చి, విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. "రాజకీయ కక్షసాధింపులో భాగంగా కొందరు నేతలను టార్గెట్‌గా చేసుకున్నారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రి" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆధారాలను కోర్టు ముందు పెడతామని తెలిపారు. దీంతో.. జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ.. "ఈ కేసులో ఎంతమందికి ముందస్తు బెయిల్ వచ్చింది? ఎంతమందికి రెగ్యులర్ బెయిల్ వచ్చింది??" అని ప్రశ్నించారు. ఒకరికి ముందస్తు బెయిల్, నలుగురికి రెగ్యులర్ బెయిల్ వచ్చిందని శేషాద్రినాయుడు బదులిచ్చారు. ఈ వాదనలతో తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విభేదించారు. "మిగతా నిందితులను, ప్రభాకర్‌రావును ఒకేలా చూడొద్దు. ఫోన్ ట్యాపింగ్‌లో ప్రభాకర్‌రావుది కీలక పాత్ర. ఆయనే ప్రధాన నిందితుడు" అని చెప్పారు. ముందే కేసు తీవ్రత గ్రహించి, భార్యతో కలిసి తిరుపతి నుంచి చెన్నైకి.. అక్కడి నుంచి అమెరికా వెళ్లిపోయారని తెలిపారు. 2020లో రిటైరైన ప్రభాకర్‌రావు.. 2023 వరకు ఎస్ఐబీ చీఫ్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారని చెప్పారు. మూడ్రోజుల టైం ఇస్తే.. ప్రభాకర్‌రావును భారత్‌కు తీసుకొస్తామని చెప్పారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. "ప్రభాకర్‌రావు భారత్‌కు వస్తే.. ఆయనను అరెస్టు చేస్తారా?" అని ప్రశ్నించగా.. అవునని తుషార్ మెహతా బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలను వినిపిస్తూ.. ప్రభాకర్‌రావుకు ముందస్తు బెయిల్ ఇవ్వొదంటూ అభ్యర్థించారు. దీనికి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. "మీరు పాస్‌పోర్టును రద్దు చేయించారు. అతను ఒక ప్రకటిత నేరస్థుడని చెబుతున్నారు. మరోవైపు.. దేశానికి తిరిగి రావడం లేదంటున్నారు. ముందు ఆయన్ని రానివ్వండి. దర్యాప్తును జరగనివ్వండి" అని వ్యాఖ్యానించారు. "ప్రభాకర్ రావుకు భారత్‌కు మాత్రమే ప్రయాణించడానికి పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ అనుమతి పత్రాన్ని అందించండి. ఆ పత్రం అందిన మూడ్రోజుల్లో తిరిగి వచ్చి దర్యాప్తు అధికారి ముందు విచారణకు హాజరవుతానంటూ ఆయన కోర్టుకు అఫిడవిట్ అందజేయాలి' అని వ్యాఖ్యానించారు.



ఎవరి ఆదేశాలతో ట్యాపింగ్ జరిగింది?

ప్రభాకర్‌రావుకు ప్రశ్నావళిని సిద్ధం చేస్తున్న సిట్

ఫోన్‌ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ తుది అంకానికి చేరింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా ఉన్న ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావును విచారణకు హాజరు కావాలని సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. అందుకు తగ్గట్టుగా సిట్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విచారణకు ప్రభాకర్‌రావు హాజరైతే ఆయనకు సంధించే ప్రశ్నలపైనా దృష్టి పెట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసు అధికారులు, ప్రైవేటు వ్యక్తి శ్రవణ్‌రావు మధ్య మధ్య లింక్ ఏ విధంగా కుదిరింది? ఎవరి ఆదేశాలతో ఫోన్లను ట్యాప్ చేశారు? ఫోన్ ట్యాపింగ్ నిబంధనలను పాటించారా? హార్డ్‌డిస్కులను ఎందుకు ధ్వంసం చేశారు? అనే అంశాలకు సంబంధించి ఇప్పటిదాకా అరెస్టైన వారి వాంగ్మూలాల ఆధారంగా ప్రభాకర్‌రావును ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ఆయన దర్యాప్తు అధికారుల ముందు హాజరవుతారా? లేక మరేదైనా మెలిక పెడతారా? అనే సందేహాలు దర్యాప్తు అధికారుల్లో వ్యక్తమవుతున్నాయి.

కాళేశ్వరం లేకున్నా రికార్డు వరి పంట

- ధాన్యం ఉత్పత్తిలో దేశంలో తొలి స్థానం తెలంగాణదే..
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షలో మంత్రి ఉత్తమ్



కరీంనగర్, మే 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖరీఫ్, రబీ సీజన్లలో 285 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం ఉత్పత్తి చేసి తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలిచిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యం కారణంగా 3బ్యారేజీల్లో నీటిని నిలపలేని పరిస్థితి నెలకొందని.. అయినా అత్యధిక వరిధాన్యం పండించి, తెలంగాణ రికార్డు సృష్టించిందన్నారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉత్తమ్ అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో కూడా ఏనాడు ఈ స్థాయిలో వరి పండలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నామన్నారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి కేసీఆర్‌కు నోటీసులు పంపించిందన్నారు. కమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టంచేశారు. ఎస్సారెస్పీ, జూరాల, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల్లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు అధికారికంగా ఆదేశాలిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూన్ 3నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు

- అసైన్డ్ భూముల్లో పొజిషన్‌లో ఉన్న వారికి పట్టాలు
- సమీక్షలో భట్టి, తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి

ఖమ్మం, మే 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వచ్చేనెల 3 నుంచి 20వరకు మండలాల్లో రెవెన్యూ సదస్సులు చేపడతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, వర్షాకాలం వ్యాధులు, విత్తనాలు, ఎరువులు తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన సమీక్షలో వారు మాట్లాడారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే అధికారులదే బాధ్యతన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున అర్హులైన నిరుద్యోగులకు, యువతకు రాజీవ్‌యువ వికాసం కింద మంజూరు పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు క్షేత్రస్థాయిలో విజయవంతంగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో అసైన్డు భూములు సాగుచేస్తూ పొజిషన్‌లో ఉన్న పేద రైతులకు పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం త్వరలోనే విధి విధానాలను ప్రకటిస్తుందని తెలిపారు.

ఆర్‌అండ్‌బీలో 72 మందికి ఈఈలుగా పదోన్నతి!

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖలో పదోన్నతుల పరంపర కొనసాగుతోంది. ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్యకాలంలో వివిధ స్థాయి ఉద్యోగులకు సర్కారు పదోన్నతులు కల్పించింది. తాజాగా 72 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ)లకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)లుగా పదోన్నతి కల్పించనున్నట్లు సమాచారం. సంబంధిత ఫైలుపై సీఎం ఆమోదముద్ర వేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. త్వరలోనే ఈ పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కానున్నాయి.

ఆర్జీయూకేటీ కేటాయింపుపై సీఎంకు కృతజ్ఞతలు

- రేవంత్‌ను కలిసిన మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు

బాసర రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్‌ను మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించడంపై ఆ జిల్లా ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం వారు జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. జిల్లాకు కేటాయించిన ఆర్జీయూకేటీ క్యాంపస్ నిర్మాణానికి జూన్‌లోనే శంకుస్థాపన చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. శంకుస్థాపన అనంతరం భారీ బహిరంగ సభను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, అనిరుధ్ రెడ్డి, పర్ణికారెడ్డి, తూడి మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్ ఉన్నారు.

వీఆర్‌ఎస్ తీసుకున్న నరేంద్రరావు

- సచివాలయ సంఘం అధ్యక్షుడిగా 10 ఏళ్లు సేవలు

హైదరాబాద్, మే28(ఆంధ్రజ్యోతి): ఆహార కమిషన్‌లో సభ్య కార్యదర్శిగా పని చేస్తున్న నరేంద్రరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగులసంఘం అధ్యక్షుడిగా పదేళ్లపాటు కొనసాగిన ఆయన్ను.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫుడ్‌కమిషన్ సభ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. అంతకు ముందు ఆయన సచివాలయంలో రెవెన్యూ శాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేసేవారు. ఏఎస్‌వోగా సచివాలయ సర్వీసులోకి వచ్చిన నరేంద్రరావు సెక్షన్ అధికారిగా, సహాయ కార్యదర్శిగా, డిప్యూటీ కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా, అదనపు కార్యదర్శిగా పదోన్నతులు పొందారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి పదేళ్లుగా సచివాలయ ఉద్యోగులసంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వచ్చారు.

విశాఖలో తొలి కొవిడ్ మృతి?

- 64 ఏళ్ల వృద్ధుడికి కరోనా పాజిటివ్

విశాఖపట్నం, ఏలూరు,మే29(ఆంధ్రజ్యోతి): ఏపీలోని విశాఖపట్నంలో గురువారం తొలి కొవిడ్ మరణం నమోదైంది. హెచ్‌బీ కాలనీకి చెందిన 64ఏళ్ల వ్యక్తి న్యుమోనియా, బీపీ, షుగర్‌తో బాధపడుతూ 3రోజుల క్రితం ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు. కరోనా పరీక్ష చేయించగా పాజిటివ్ అని తేలింది. ఆయనకు పార్కిన్‌సన్స్ వ్యాధి కూడా ఉందని వైద్యులు తెలిపారు. పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందాడు. న్యుమోనియా, కరోనా, మల్టీసిస్టమ్ ఇన్‌ఫ్లమేటరీ సిండ్రోమ్ కారణాలతో ఆవ్యక్తి చనిపోయినట్టు ఆస్పత్రి వర్గాలు డెత్‌సర్టిఫికెట్ జారీ చేశాయి.

ఏపీ లిక్కర్ గ్యాంగ్‌కు నేటి నుంచి పోలీసు కస్టడీ

విజయవాడ, మే 29(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నలుగురు నిందితులను ఏసీబీ కోర్టు రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇచ్చింది. కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను వారం పాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు ముగియడంతో శుక్ర, శనివారాలు కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నలుగురిలో ఇప్పటికే సిట్ అధికారులు ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని వారం పాటు కస్టడీకి తీసుకుని విచారణ చేశారు. ఈ కేసులో ఈ నలుగురు నిందితులు కీలకంగా వ్యవహరించారని అధికారులు గుర్తించారు. వీరిని వేర్వేరుగా, కలిపి విచారణ చేయాలని అధికారులు నిర్ణయించారు.

పుష్ప తరహాలో గంజాయి స్మగ్లింగ్

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత

దేవరపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): పుష్ప సినిమా తరహాలో.. లారీ క్యాబిన్‌లో సీటు వెనుక ప్రత్యేక అరలో గంజాయి తరలిస్తూ ఓ డ్రైవర్ పోలీసులకు దొరికిపోయాడు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న లారీని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కర్రే శ్రీశైలంకు లారీ ఉంది. అయితే ఒడిశాలోని మల్కన్‌గిరికి వెళ్లి గంజాయి తెస్తే ఎక్కువ డబ్బులిస్తామని హైదరాబాద్‌కు చెందిన నర్సిరెడ్డి, యాదయ్య అతడితో డీల్ కుదుర్చుకున్నారు. దీంతో శ్రీశైలం ఒడిశా వెళ్లి గంజాయి బస్తాలతో వెనుదిరిగాడు. అయితే ఈనెల 24న తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మీదుగా వెళ్తూ.. బైక్‌పై ప్రయాణిస్తున్న ఒక జంటను ఢీకొట్టాడు. వారు అక్కడికక్కడే మరణించడంతో, భయపడి లారీతో సహా పరారయ్యాడు. 28న పోలీసులకు గంజాయి లారీపై ఉప్పందింది. వారు లారీని గుర్తించి.. అందులో రూ.22లక్షల విలువైన బస్తాలను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

'సంక్షేమం' నిధుల్లో గోల్‌మాల్!

సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల్లో 2017 నుంచి 2020 మధ్య అక్రమాలు

నివేదిక సమర్పించిన అకౌంట్స్ విభాగం.. తదుపరి విచారణకు విజిలెన్స్ విభాగానికి ప్రతిపాదన

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కోట్లలో అవకతవకలకు పాల్పడినట్లు రాష్ట్ర అకౌంట్స్ విభాగం నివేదిక పేర్కొంది. రెండ్రోజుల క్రితం అందిన ఈ నివేదికపై గురుకులాల సొసైటీ ప్రస్తుత కార్యదర్శి అలుగు వర్షిణి తదుపరి విచారణ కోసం విజిలెన్స్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. ఈ అక్రమాల గురించి అకౌంట్స్ విభాగం పేర్కొన్న అంశాల ఆధారంగా ప్రభుత్వానికి గురువారం ఆమె ఓ నివేదిక సమర్పించినట్లు సమాచారం. టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లో 2017-20 మధ్యకాలంలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై అందులో ప్రస్తావించినట్లు సమాచారం. విజిలెన్స్ దర్యాప్తు తర్వాతే అక్రమార్కులపై చర్యలు తీసుకోనున్నారు. కాగా అకౌంట్స్ విభాగం సమర్పించిన నివేదిక ప్రకారం రూ.4కోట్ల వార్షిక వ్యయంతో చేపట్టిన కోడింగ్ స్కూళ్ల ప్రాజెక్టులో పనులు లేకుండానే రూ.92లక్షలు ఎక్కువగా చెల్లించారని, స్థలాలు, స్కూళ్ల సంఖ్య వివరించకుండా ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు చేపట్టలేదని, విద్యార్థుల సంఖ్య, సిబ్బంది అర్హతల వంటి కీలక నిబంధనలను పట్టించుకోలేదని.. బ్యాంక్ గ్యారంటీ లేకుండానే 90శాతం ముందస్తు చెల్లింపు చేశారని, ఇది ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. లైసెన్సుల వినియోగంపై ఎటువంటి డేటాలేకుండా, ఏజెన్సీకి రూ.2.03 కోట్లు చెల్లించారని, డెలివరీ ధ్రువీకరణకు ముందే బ్యాంక్ గ్యారంటీ ఇవ్వడం ద్వారా ఒప్పంద ఉల్లంఘన జరిగిందని తెలిపారు. రైట్స్ లిమిటెడ్ పరిశీలనలో యూనిఫామ్‌లకు నాణ్యతలేదని తిరస్కరించినా.. టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ రూ.9.33 కోట్లకు వాటిని కొనుగోలుచేసి విద్యార్థులకు అందించినట్లు గుర్తించింది. వారంటీ లేని విద్యుత్తు సామగ్రిని రూ.1.38కోట్లకు కొనుగోలు చేశారని.. డైట్, క్లీనింగ్, పరీక్ష ఫీజుల కోసం సరైన ఒప్పందాలు లేకుండా చెల్లింపులు జరిపారని, పలు బిల్లులు గల్లంతయ్యాయని, లెడ్జర్ బుక్కుల్లో చాలా తేడాలు ఉన్నట్లు అకౌంట్స్ విభాగం తన నివేదికలో పేర్కొంది.

అంగన్‌వాడీలకు తీపి కబురు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ విరమణ ప్రయోజనాల పెంపునకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందుకు సంబంధించిన ఫైలును రాష్ట్ర ఆర్థికశాఖ ఆమోదించింది. ఈ మేరకు ఉద్యోగ విరమణపొందే అంగన్‌వాడీ టీచర్లకు ఇకనుంచి రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చెల్లించే విధంగా త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ట్రంప్ చెబితే యుద్ధం ఆపుతావా?

(మొదటిపేజీ తరువాయి)



జైహింద్ ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో సీఎం రేవంత్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రి ఉత్తమ్

బయలుదేరి రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు. "యుద్ధంలో చనిపోయిన సైనికుల కోసం ఆలోచించారా? పహల్గాం బాధితుల గురించి.. పాకిస్థాన్ దాడిలో కశ్మీర్‌లో చనిపోయిన పౌరుల గురించి ఆలోచించారా? దేని కోసం తిరంగా ర్యాలీ చేస్తున్నారు?" అని ఘాటుగా ప్రశ్నించారు. ఏఐసీసీ ఆదేశం మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బాచుపల్లిలో గురువారం 'జైహింద్ ర్యాలీ' నిర్వహించిన సీఎం.. దేశ సైనికుల ఆత్మగౌరవాన్ని, ఆత్మస్థైర్యాన్ని నిలబెట్టేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బాచుపల్లిలో వీఎన్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకూ సాగిన ర్యాలీలో సీఎంతోపాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. "దేశభద్రతకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలకతీతంగా మనమంతా కలిసి ఉండాలి. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు అని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గే మాకు ఉద్బోధించారు. దేశం మీద, పౌరుల మీద దాడి చేసినప్పుడు ప్రధానికి అండగా నిలబడి.. 'యుద్ధం చేయండి, మీ నిర్ణయాలను సమర్థిస్తామ'ని ఆనాడు అఖిలపక్షంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా చెప్పింది. నాలుగు రోజుల తర్వాత ఎవరికి ఎవరు లొంగిపోయారో తెలియదు కానీ అర్థాంతరంగా అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ బయటికి వచ్చి 'యుద్ధాన్ని ఆపేసినా.. భారత్‌ను బెదిరించినా' అనే పరిస్థితి వచ్చింది" అని సీఎం ధ్వజమెత్తారు. పాకిస్థాన్ మనపై దాడి చేసినప్పుడు యుద్ధం చేయడానికి అఖిలపక్షంతో చర్చించిన మోదీ.. యుద్ధం ఆపాలనుకున్నప్పుడు ఎందుకు అఖిలపక్ష భేటీ నిర్వహించలేదని నిలదీశారు. "ఇది నీ సొంత వ్యవహారం కాదు.. మీ పార్టీ వ్యవహారం కాదు. దేశ భద్రతకు సంబంధించిన విధానం. యుద్ధం విరమించడం ద్వారా 140కోట్ల భారతీయుల ఆత్మ గౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు పెట్టి, గొప్పల కోసం బీజేపీ వాళ్లు ఉపన్యాసాలిస్తున్నారు" అని విమర్శించారు. దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదన్నారు. భారత సైన్యం విజయవంతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందని, రాజకీయాలకు అతీతంగా తాము మద్దతిచ్చామని సీఎం గుర్తుచేశారు.

నాడు ఇందిర తెగువ..

"నాయకత్వం అంటే ఆషామాషి కాదు.. యుద్ధం అంటే ఉపన్యాసాలు ఇచ్చుడు కాదు. యుద్ధం అంటే ధైర్యం ఉండాలి. యుద్ధతంత్రం ఉండాలి. యుద్ధనీతి ఉండాలి. గుండె ధైర్యం ఉండాలి. గుండెలో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తాడు. చైనా అతి తెలివితేటలు ప్రదర్శిస్తే 1967లో ఆ దేశంతో (నాథులా పాస్ వద్ద) జరిగిన సంఘర్షణలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చైనాను ఓడించి ప్రపంచ దేశాలకు సందేశాన్నిచ్చారు" అని వ్యాఖ్యానించారు. మోదీ హయాంలో గల్వాన్‌లో మన కర్నల్ సంతోష్‌ను పొట్టన పెట్టుకుంటే ఏమీ చేయలేకపోయామని ఆవేదన వెలిబుచ్చారు. 1971లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించినా.. నాటి ప్రధాని ఇందిర వెరవలేదని, పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేశారని గుర్తుచేశారు. పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో హైదరాబాదులో తయారుచేసిన క్షిపణులే దేశ గౌరవాన్ని నిలబెట్టాయని.. మోదీ వేరే దేశం నుంచి కొన్న రాఫెల్ యుద్ధ విమానాలను పాక్ కూల్చేసిందని వ్యాఖ్యానించారు. అనేక మంది కాంగ్రెస్ పెద్దలు దేశం కోసం ఆత్మ బలిదానాలు చేశారని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. పహల్గాం కాల్పుల వెనుక ఉన్నవారిని ఇప్పటిదాకా ఎందుకు పట్టుకోలేదని.. కాల్చిన ఉగ్రవాదులు ఎక్కడున్నారో సమాచారం ఎందుకు సేకరించట్లేదని నిలదీశారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను పరామర్శించే సమయమే మోదీకి లేదని ధ్వజమెత్తారు. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై బీజేపీ చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. 1971 యుద్ధ సమయంలో ఇందిరాగాంధీ చూపిన తెగువ, స్ఫూర్తిని నేటి ప్రధాని కొనసాగించలేకపోయారని.. ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసే పరిస్థితి ఇప్పటి కేంద్ర సర్కారుదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు. పాక్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని మోదీ వెనుకడుగు వేశారని విమర్శించారు. రాహుల్ గాంధీని విమర్శించడం ద్వారా బీజేపీ నాయకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



తిరంగా ర్యాలీలో రేవంత్, మీనాక్షీ, మహేశ్‌గౌడ్



కొత్తగూడెంలో బాలికకు పౌష్టికాహార ప్యాకెట్ అందజేస్తున్న మంత్రి సీతక్క

కిశోర బాలికల సంక్షేమమే ధ్యేయం

- 'ఇందిరమ్మ అమృతం'తో పౌష్టికాహారం
- ఖనిజ సంపద దోపిడీకి కేంద్రం కుట్ర
- నక్సల్స్ పేరుతో ఆదివాసీల ఎన్‌కౌంటర్: మంత్రి సీతక్క

కొత్తగూడెం/పాల్వంచ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ అమృతం పథకానికి శ్రీకారం చుట్టిందని మంత్రి సీతక్క తెలిపారు. గురువారం కొత్తగూడెంలో ఈ పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన సభలో సీతక్క మాట్లాడారు. 14-18 ఏళ్ల వయసు కలిగిన బాలికల్లో రక్తహీనతను తగ్గించడంతోపాటు వయసుకు తగిన బరువుండేలా చూడాలన్న ఉద్దేశంతో ఈ పథకానికి రూపకల్పన చేశామని చెప్పారు. భద్రాద్రి, ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ మూడు జిల్లాల్లో 50,269 మంది కిశోర బాలికలకు చిరుధాన్యాలతో తయారు చేసిన పట్టీలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో ఆశా వర్కర్ల జీతాలను పెంచి, వారి ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేస్తామని తెలిపారు. కాగా, పలు రాష్ట్రాల్లో ఉన్న అపార ఖనిజ సంపదను దోచుకునేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని సీతక్క ఆరోపించారు. భద్రాద్రి జిల్లా కిన్నెరసాని ఆశ్రమ క్రీడా పాఠశాలలో ఆదివాసీ కాంగ్రెస్ భూన్‌యాది కార్యకర్తల సమ్మేళన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ఎన్‌కౌంటర్ పేరుతో ఆదివాసీలను హతమార్చి, వారి మృతదేహాలను కుటుంబసభ్యులకు ఇవ్వకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ

చైర్మన్‌గా మల్లు రవి



న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని అధిష్ఠానం నియమించింది. ఎట్టకేలకు.. 70 మందితో కూడిన పలు కమిటీలను ఏఐసీసీ ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) ఆ వివరాలను వెల్లడించారు. 22 మందితో రాజకీయ వ్యవహారాల కమిటీని.. 15 మందితో సలహా కమిటీ, ఏడుగురితో డీలిమిటేషన్ కమిటీ, 16 మందితో 'సంవిధాన్ బచావో ప్రోగ్రాం' కమిటీ, ఆరుగురితో క్రమశిక్షణ కమిటీని నియమించారు. ఈ కమిటీలు తక్షణమే అమల్లోకి వస్తాయని కేసీ వేణుగోపాల్ తన ప్రకటనలో పేర్కొన్నారు. అయితే వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పోస్టుల కేటాయింపుపై ఏకాభిప్రాయం కుదరక పెండింగ్‌లో ఉంచారు. సీఎం, పీసీసీ చీఫ్‌లు ఢిల్లీకి వెళ్లాల్సి ఉన్నా.. వెళ్లడం లేదని సమాచారం.

రాజకీయ వ్యవహారాల కమిటీలో ఎవరంటే?

మీనాక్షి నటరాజన్, మహేశ్ గౌడ్, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, వంశీచంద్ రెడ్డి, జి.రేణుకా చౌదరి, పోరిక బలరాం నాయక్, డి.శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, షబ్బీర్ అలీ, మహ్మద్ అజారుద్దీన్, ఆది శ్రీనివాస్, శ్రీహరి, బీర్ల అయిలయ్య, పి.సుదర్శన్ రెడ్డి, కె.ప్రేమ్‌సాగర్ రావు, కుసుమ్‌కుమార్, అనిల్ కుమార్ కమిటీలో ఉన్నారు. ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల ప్రధాన బాధ్యులు ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మంత్రులు వ్యవహరించనున్నారు.

సలహా కమిటీ..: మీనాక్షి నటరాజన్, రేవంత్‌రెడ్డి, మహేశ్ గౌడ్, వి.హనుమంతరావు, కె.జానారెడ్డి, కె.కేశవరావు, మధుయాష్కీ గౌడ్, జి.చిన్నారెడ్డి, గీతారెడ్డి, ఎం. అంజన్‌కుమార్‌యాదవ్, జగ్గారెడ్డి, జాఫర్ జావేద్, టి.జీవన్‌రెడ్డి, రాజయ్య, రాములు నాయక్

డీలిమిటేషన్ కమిటీ..: చల్లా వంశీ చంద్ రెడ్డి, గద్వాల విజయలక్ష్మి, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్ రెడ్డి, పవన్ మల్లాది, వెంకటరమణ

సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీ..: పి.వినయ్ కుమార్, అద్దంకి దయాకర్, కె.శంకరయ్య, ఎన్.బాలు నాయక్, నర్సారెడ్డి, ఆత్రం సుగుణ, రాచమల్ల సిద్ధేశ్వర్, సంతోష్ కోల్కొండ, అనిల్‌కుమార్, జూలూరి ధనలక్ష్మి, మజీద్‌ఖాన్, జి.రాములు, అర్జున్ రావు, సౌరి, వల్లభరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

క్రమశిక్షణ కమిటీ..: ఎంపీ మల్లు రవి (చైర్మన్), ఎ.శ్యామ్‌మోహన్ (వైస్ చైర్మన్), సభ్యులుగా ఎం.నిరంజన్ రెడ్డి, బి. కమలాకర్‌రావు, జాఫర్ జావేద్, జి.వి.రామకృష్ణ ఉన్నారు.

జూలైలోనే 'స్థానిక' సమరం!

పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీల ఎన్నికలకు రంగం సిద్ధం.. జూన్ చివర్లో నోటిఫికేషన్!

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. జూలైలోనే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. జూన్ చివరివారంలో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆగస్టు రెండో వారం నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని భావిస్తున్నట్లు సమాచారం. దీనిపై సంబంధిత అధికారులకు మౌఖిక ఆదేశాలు వెళ్లాయని తెలిసింది. ఇప్పటికే ఓటర్ల జాబితా, వార్డుల విభజన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు పనులు ఓ కొలిక్కి వచ్చాయి. వీటన్నింటిపైనా ఉన్నతాధికారులు మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు.

గ్రామ పంచాయతీలకే ముందు..!

మూడు స్థానిక సంస్థల్లో మొదట గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని భావిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో 12,633 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని అధికారికవర్గాలు చెబుతున్నాయి. ఈ పంచాయతీలన్నింటి పరిధిలో కలిపి 1,13,500కుపైగా వార్డులున్నాయి. మునిసిపాలిటీల్లో కలిపే పంచాయతీల్లోని వార్డులుపోగా.. మిగతా వాటికి ఎన్నికలు నిర్వహిస్తారు. ఇక 5,817 ఎంపీటీసీ, 567 ఎంపీపీ, 567 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి మినహా 31 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లను ఎన్నుకుంటారు.

కాంగ్రెస్‌లో పార్టీపరంగా రిజర్వేషన్లు!

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు అసెంబ్లీలో బిల్లులను ఆమోదించి కేంద్రానికి పంపింది. కానీ కేంద్రం పెండింగ్‌లో పెట్టింది. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ నాటికల్లా కేంద్రం నిర్ణయం తీసుకోకుంటే.. ప్రస్తుత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అంటే మొత్తంగా 50శాతం దాటకుండా రిజర్వేషన్లు అమలు చేయాలి. స్థానిక సంస్థల పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించి.. మిగతా రిజర్వేషన్లను బీసీలకు ఇవ్వాలి. ఈ లెక్కన గతంలో బీసీలకు గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 21-22 శాతం, మున్సిపాలిటీల్లో 31శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. అయితే స్థానిక సంస్థల్లో నేరుగా రిజర్వేషన్లు పెంచలేని నేపథ్యంలో.. పార్టీపరంగా బీసీలకు 42శాతం స్థానాలను కేటాయిస్తామని కాంగ్రెస్ గతంలోనే ప్రకటించింది. ప్రస్తుతం దీనిపై కసరత్తు జరుగుతోంది.

క్యాడర్‌లో జోష్ నింపేందుకు..


మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు వంటి నేతలందరినీ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ సూచించారు. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. మరోవైపు కాంగ్రెస్‌లో గ్రామ, మండల, జిల్లా స్థాయి వరకు అవకాశం ఉన్న పదవులను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. తద్వారా క్షేత్రస్థాయి క్యాడర్‌లో ఉత్సాహం నెలకొంటుందని భావిస్తున్నారు. ఇక రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిణామాలు కూడా స్థానిక ఎన్నికల్లో కలిసి వస్తాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణకు మొదటి స్థానం.. సాదాబైనామాలపై త్వరలోనే నిర్ణయం!

- 2 నుంచి కొత్త గ్రామపాలన అధికారుల నియామకాలు
- మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో.. కలెక్టర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం

వరంగల్, మే 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నకిలీ విత్తనాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి కొండా సురేఖతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను విక్రయించేవారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించాలన్నారు. అంచనాలకు మించి 160% ధాన్యం దిగుబడి వచ్చిందని.. యాసంగి, వానాకాలం పంటలను కలిపి దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 85% ధాన్యం సేకరణ పూర్తయిందన్నారు. సాదాబైనామా విషయం కోర్టులో ఉందని, కోర్టు సెలవులు పూర్తికాగానే ఈ విషయమై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గ్రామ పాలన అధికారుల పరీక్షలు పూర్తయ్యాయని, ఉత్తీర్ణులైన వారిని జూన్ 2న విధుల్లో నియమిస్తామన్నారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఆగస్టు 15 వరకు స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కలెక్టర్లపై మంత్రి ఆగ్రహం

ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ల నిర్లక్ష్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. "జిల్లాల్లో ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలే ఉన్నారు. వారిని సమన్వయం చేసుకుని, ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాను ఫైనల్ చేయలేరా?" అంటూ నిలదీశారు. "నేను సంతకం చేసి, పంపించిన ప్రొసీడింగ్స్ ఇంట్లో ఫ్రేమ్‌కట్టుకుని పెట్టుకోవడానికా??" అంటూ మంత్రి మండిపడ్డారు. జూన్ 6లోపు ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను అందజేయాలన్నారు. ఇళ్ల పథకానికి వయస్సు పరిమితి లేదని చేశారు. అత్యంత పేదలకు మొదటి ప్రాధాన్యతనివ్వాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఏవోబీలో ఎదురు కాల్పులు

» మావోయిస్టు కీలక నేత జూనియర్ హిడ్మా అరెస్టు



మావోయిస్టు నేత జూనియర్ హిడ్మా

సీలేరు (అల్లూరి జిల్లా), మే 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య గురువారం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు కీలక నేత జూనియర్ హిడ్మాను అరెస్టు చేశారు. పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఒడిశాలోని కోరాపుట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏవోబీలోని కోరాపుట్ జిల్లా బోయిపరిగూడా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేటగూడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు.. ఏఎస్పీ పార్థకశ్యప్ నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున కొండపై క్యాంప్ నిర్వహిస్తున్న మావోయిస్టులు కనిపించారు. దీంతో పోలీసులు ఆ కొండను చుట్టుముట్టారు. ఇది గమనించిన మావోయిస్టులు కొండ పైనుంచి పోలీసులపై కాల్పులు జరుపుతూ తప్పించుకున్నారు. మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయిన తర్వాత ఘటనా స్థలంలో పోలీసులు గాలిస్తుండగా.. తప్పించుకోవడానికి ప్రయత్నించిన ఇద్దరు మావోయిస్టుల్లో ఒకరిని పట్టుకున్నారు. అతడిని మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు కుంజమ్ హిడ్మా అలియాస్ జూనియర్ హిడ్మా అలియాస్ మోహన్‌గా గుర్తించారు. హిడ్మా నుంచి ఏకే47 తుపాకీ, 35 రౌండ్ల తూటాలు, 117 ఎలక్ట్రిక్, నాన్ ఎలక్ట్రిక్ డిటొనేటర్లు, రేడియో, కత్తులు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో మావోయిస్టు పరారయ్యాడు.

పేలుళ్ల కుట్ర కేసులో మరో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్/విజయనగరం, మే 29 (ఆంధ్రజ్యోతి): పేలుళ్ల కుట్ర కేసులో ఎన్ఐఏ అధికారులు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. వీరితో ఇంకా ఎవరెవరితో లింకులు ఉన్నాయన్న కోణంలో ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ తోపాటు విజయనగరంలో టిఫిన్ బాక్స్ బాంబులను పేల్చాలని కుట్రలు చేసిన సిరాజ్, సమీర్‌లను ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విచారణలో వరంగల్‌కు చెందిన ఫర్హాన్ మొహియుద్దీన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాదర్, మరికొందరితో సిరాజ్‌కు పరిచయాలున్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. అల్-హింద్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పేరుతో ఓ గ్రూపును ప్రారంభించినట్లు ఎన్ఐఏ ఇప్పటికే నిగ్గుతేల్చింది. పలువురు యువకులను సిరాజ్ ఈ గ్రూపులో చేర్పించినట్టుగా నిర్ధారించింది. తాజాగా అరెస్టయిన ఫర్హాన్, కాజీపేటకు చెందిన మరో యువకుడిని ఎన్ఐఏ గురువారం అరెస్టు చేసింది. వీరిద్దరి సోషల్ మీడియా ఖాతాలను జల్లెడపడుతోంది.

మావోయిస్టుల అంత్యక్రియలపై పిటిషన్ కొట్టివేత

ఛత్తీస్‌గఢ్ అధికారులపై చర్యలు మా పరిధి కాదు: హైకోర్టు

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మావోయిస్టు పత్రిక 'ఆవామ్ ఇ జంగ్' ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు సజ్జా వెంకట నాగేశ్వరరావు మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలనే ఆదేశాలను ధిక్కరించిన ఛత్తీస్‌గఢ్ సీఎస్, డీజీపీ, బస్తర్ రేంజ్ ఐజీలపై కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించాలంటూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఎన్‌కౌంటర్, అంత్యక్రియలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగాయని, ఆ రాష్ట్ర అధికారులపై కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించే అధికార పరిధి తమకు లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది.

కొలువుల పేరిట వల వేసి.. కిడ్నీ మార్పిడి దందా

» ఇద్దరు దళారుల అరెస్ట్.. పరారీలో మరో ఏడుగురు

హైదరాబాద్/ చాదర్‌ఘాట్, మే 29 (ఆంధ్రజ్యోతి): వారు ఉద్యోగాల పేరిట తమిళనాడులోని పేదలకు వల విసురుతారు. అటుపై వారి అవసరాలేమిటో తెలుసుకుంటారు. హైదరాబాద్‌కు రప్పించి వారితో బలవంతంగా కిడ్నీ మార్పిడి చేయిస్తారు. వారిని కిడ్నీని అవసరమైన వారికి అమర్చినందుకు రూ.10లక్షలు తీసుకుంటారు. కిడ్నీ ఇచ్చిన వారికి రూ.4 లక్షలు ఇచ్చి, మిగతా సొమ్ము ఈ దళారులు స్వాహా చేస్తారు. ఇలా కొత్తపేటలోని అలకనందా ఆస్పత్రిలో అక్రమ కిడ్నీ మార్పిడి దందా జరుగుతున్న విషయం తెలిసిన సరూర్‌నగర్ పోలీసులు.. గత జనవరిలో ఆ ఆస్పత్రిపై దాడి చేసి 13మందిని అరెస్ట్ చేసి, సదరు హాస్పిటల్‌ను సీజ్ చేశారు. అవయవాల మార్పిడి అంశం కావడంతో ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన సీఐడీ పోలీసులు.. దందాలో తమిళనాడుకు చెందిన శంకరన్, రమ్య పాత్ర ఉన్నట్లు గుర్తించారు. చెన్నైలో గురువారం వారిద్దరిని అరెస్ట్ చేశారు. మరోవైపు, ఈకేసుతో సంబంధం ఉన్న జననీ ఆస్పత్రిని సీజ్ చేశారు. పరారీలో ఉన్న పవన్, పూర్ణచంద్రరావులతోపాటు మరో ఏడుగురిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సీఐడీ డీజీ షికాగోయల్ తెలిపారు.

1న బీసీల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం: జాజుల

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని కళింగ భవన్‌లో జూన్ ఒకటో తేదీన బీసీల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన చేస్తూ రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, దేశవ్యాప్త సమగ్ర కుల గణన, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన బీసీ సంక్షేమ సంఘం, దాని అనుబంధ సంఘాల నేతలు, ప్రతినిధులు, నియోజకవర్గ నేతలు హాజరు కావాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

'పారా అథ్లెటిక్స్'లో కండక్టర్ కుమారుడికి పతకాలు

» సివిల్స్‌లో సాయి శివాని ప్రతిభ.. సన్మానించిన సజ్జనార్

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): మొరాకోలో ఇటీవల జరిగిన 'వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రి'లో కూకట్‌పల్లి డిపోకు చెందిన కండక్టర్ బానోత్ మోహన్ కుమారుడు అకీరా నందన్ సత్తా చాటాడు. 400 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ బస్ భవన్‌లోని తన చాంబర్‌లో గురువారం అకీరా నందన్‌ను సన్మానించారు. కుమారుని క్రీడల్లో ప్రోత్సహిస్తోన్న కండక్టర్ మోహన్ దంపతులను ఆయన ప్రశంసించారు. ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 11వ ర్యాంకు సాధించిన వరంగల్‌కు చెందిన ఇట్టబోయిన సాయి శివానిని వీసీ సజ్జనార్ అభినందించారు. సాయి శివాని యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపే ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకుంటే చాలునని వ్యాఖ్యానించారు. కేసీఆరే తన నాయకుడని, ఇతరుల నాయకత్వంలో తాను పని చేయబోనని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. "బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపే ప్రయత్నం వందకు 101 శాతం జరుగుతోందన్నారు. తాను జైల్లో ఉన్న సమయంలోనే ఈ ప్రతిపాదన వచ్చిందని తెలిపారు అయితే న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని, ఎంతవరకైనా పోరాడదామని, తన కోసం బీజేపీలో కలిపి పార్టీ భవిష్యత్తును పాడు చేయొద్దని కోరానని అన్నారు. కేసీఆర్‌ను, పార్టీని మోస్తున్నామని గొప్పగా భావిస్తున్న వాళ్లు.. ఎలాగైనా పార్టీని గంపగుత్తగా బీజేపీలో విలీనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. "మా నాన్నకు లేఖ రాస్తే తప్పేంటి? అయినా నీకు నొప్పేందిరా భై? నాకు నీతులు చెబుతున్న పార్టీ నేతలు.. తెలంగాణ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ప్రజా సమస్యలపై పోరాడాలి. కాంగ్రెస్, బీజేపీ దుశ్చర్యలను ఎండగట్టాలి. పార్టీ అధినేతకు రహస్యంగా రాసిన లేఖను ఎవరు బయటపెట్టారని నేను ప్రశ్నిస్తే.. నా బృందమే లీక్ చేసిందంటూ కేసీఆర్ ఇంటి ఆడబిడ్డపైనే తమ పెయిడ్ సోషల్ మీడియా, పెయిడ్ పత్రికలు, యూట్యూబ్ చానళ్ల ద్వారా విషప్రచారం చేస్తున్నారు. పార్టీలో కోవర్టులు న్నారంటూ నా మీద పడి ఏడుస్తున్నారు. ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే.. అది మర్యాదేనా? లీకు వీరులను బయట పెట్టమంటే.. గ్రీకువీరులు నాపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. ఇక్కడ చాలదన్నట్టు విదేశాల్లో కూడా సోషల్ మీడియా వర్కర్లను పెట్టుకొని దుష్ప్రచారం చేయిస్తున్నారు" అని కవిత ధ్వజమెత్తారు.

కేసీఆర్‌లాగే నాక్కొంచెం తిక్క..

తనపై కాంగ్రెస్, బీజేపీ వారు సైతం ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తుంటే పార్టీ నేతలు ఏం చేస్తున్నారని కవిత ప్రశ్నించారు." కేసీఆర్‌లాగా నొక్కొంచెం తిక్క. పార్టీ భవిష్యత్తు కోసమే మాట్లాడుతున్నా. నన్ను ఇబ్బందిపెడితే ఒప్పుకోను. నేను నోరు విప్పితే తట్టుకోలేరు. నన్ను కాంగ్రెస్ కోవర్ట్ అన్నారు.. మరి బీఆర్ఎస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారనుకోవాలా? బీజేపీ నేతలకు చెందిన హాస్పిటళ్ల ప్రారంభోత్సవాలకు వెళ్లిందెవరో అందరికీ తెలుసు" అని కవిత వ్యాఖ్యానించారు. పదవులు కోరినట్లు తనపై పత్రికల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, నాకు పదవులమీద ఆశ లేదని, కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని కాపాడుకోవాలన్నదే తన లక్ష్యమని అన్నారు. లిక్కర్ కేసు సమయంలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానంటే కేసీఆర్ వద్దన్నారని, జైలుకు వెళ్లివచ్చాక కూడా అడిగానని తెలిపారు. పార్టీ అధినేత సూచన మేరకే ఎమ్మెల్సీ పదవిలో కొనసాగుతున్నానని చెప్పారు. కడుపులో బిడ్డను పెట్టుకొని తెలంగాణ ఉద్యమంలో సైనికురాలిగా పనిచేశానని అన్నారు. తనను విమర్శిస్తున్న నేతలు కేసీఆర్ నీడన ఉన్నారు తప్ప.. వారు చేసిన కార్యక్రమాలు ఏమున్నాయని ప్రశ్నించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఇవ్వాల్సిన ప్రొటోకాల్, గౌరవం ఉంటుందని, దానిని నేను విస్మరించనని అన్నారు. తనను పార్టీ ఫోరంలో మాట్లాడమంటున్నారని, ఫోరంలో ఏముందని ప్రశ్నించారు. తాను ప్రజల మధ్యే మాట్లాడతానన్నారు.



మేడ్చల్ జిల్లాలోని సేవాలాల్ తండాలో ఆలచ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి మల్లారెడ్డి

కేసీఆర్‌కు నోటిసులిస్తే కార్యాచరణేదీ?

కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెడుతుంటే.. పార్టీ ఎందుకు కార్యాచరణ తీసుకులేదని కవిత ప్రశ్నించారు. తమకు తాము పెద్ద నేతలుగా ఊహించుకునేవారు ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు. కేసీఆర్ నీడలో పనిచేస్తున్నవారు.. తనపై ప్రతాపం చూపించడం సరికాదని, దమ్ముంటే పార్టీ అధినేతకు నోటీసులిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిపై, బీజేపీపై ప్రతాపం చూపించాలని హితవు పలికారు. పార్టీ ముఖ్యనాయకులు ట్వీట్లకే పరిమితమైతే ఎలా? అని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి, వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాల్సిన పనులు చేయాలి కదా! అని అన్నారు. ముఖ్యమైన సందర్భాల్లో కూడా పార్టీ కార్యాచరణ అమలు చేయడంలేదన్నారు. "అధికార కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ ఏం చేస్తోంది? జనంలోకి వెళ్లి మనమేంటో తెలియపరచాలి కదా! కేసీఆర్ రాజనీతిజ్ఞుడు. ఎప్పుడు ఎలా స్పందించాలో.. ఆయనకు తెలిసినంత ఏ నాయకునికీ తెలియదు. ఆయన ప్రజల్లోకి రావాల్సినప్పుడు వస్తారు.. పార్టీని నిలబెట్టుకుంటారు. ఈలోపు పెద్ద నాయకులమని చెప్పుకొనేవారు పార్టీ కోసం పనిచేయాలి కదా!" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు అమెరికా, లండన్‌లలో నిర్వహిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్దపెద్ద వాళ్లను పెంచి పోషించారని, ఇప్పుడు వాళ్లంతా ఎటువైపు ఉన్నారో ఆలోచించాలని సూచించారు. సామాన్య ప్రజల కోసం పోరాడితేనే.. పార్టీకి పట్టు ఉంటుందని, అందుకే నేను సామాజిక అంశాలపైనే ఉద్యమిస్తున్నానని తెలిపారు. పార్టీలో కొందరికి ఇది మింగుడుపడటం లేదని, అయినా.. ప్రజల మధ్యే ఉంటానని, వారి కోసమే పాటుపడతానని స్పష్టం చేశారు.

ఉద్యమ సమయంలోనే జాగృతి ఏర్పడింది..

సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాటం చేస్తానని కవిత ప్రకటించారు. ఉద్యమ సమయంలో ఇక్కడి సంస్కృతి, సాహిత్యం, సమాజ చైతన్యం కోసం తెలంగాణ జాగృతి ఏర్పడిందని, అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ సూచన ప్రకారం జాగృతి పలు కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ఇప్పుడు తెలంగాణ ద్రోహులు రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, ఈ సమయంలో ఏమి అవసరమో వాటిపైనే దృష్టి పెట్టి.. తమ సంస్థ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో బీఆర్ఎస్ తగినవిధంగా స్పందించకపోవడంతో.. పార్టీ చేయాల్సిన పోరాటాలు కూడా జాగృతి చేయాల్సివస్తోందన్నారు. "కేసీఆర్‌ను మేమే మోస్తున్నామనే భ్రమల్లో ఉన్న మావాళ్లు కొందరు.. సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారు. వారు స్థాయికి మించి ఊహించుకుంటున్నారు. వరంగల్ సభ తమ వల్లనే సక్సెస్ అయిందని అనుకుంటున్నారు. కేసీఆర్‌ను మోసేంత పెద్దవాళ్లమా? ఆయనే పార్టీని, మమ్మల్ని అన్నివేళల్లో మోయగలిగిన పోరాటయోధుడు" అని కవిత వ్యాఖ్యానించారు. తాను ముక్కుసూటిగా ఉంటానని, వెన్నుపోటు రాజకీయాలు చేయడం తనకు రాదని అన్నారు. కొందరు కడుపులో విషం పెట్టుకొని.. పైకి తియ్యగా మాట్లాడతారని విమర్శించారు. నిజామాబాద్‌లో తాను ఎంపీగా పోటీ చేస్తే పార్టీ ఎమ్మెల్యేలు, వెంట ఉన్న ముఖ్య నాయకులే ఓడించారని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో గత కొంతకాలంగా ఈ సంస్కృతి నడుస్తోందని, దీనివల్ల అంతిమంగా ఎవరికి నష్టమో ఆలోచించుకోవాలని హితవు పలికారు.

నా తండ్రిని వదిలి నేనెక్కడికి వెళ్తాను?

"నా తండ్రిని, నా కుటుంబాన్ని వదిలి నేనెందుకు వెళ్తాను? నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర చేస్తున్నారు. నన్ను దూరంచేస్తే ఎవరికి లాభం జరుగుతుందో ఆలోచించుకోవాలి. నాకు కొత్త పార్టీ అవసరం లేదు. ఉన్న పార్టీ బాగా చూసుకుంటే చాలన్నది నా అభిప్రాయం. నేను రాసిన లేఖలోని సూచనల్లో ఒక్కటైనా తప్పుందా? కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లు అయ్యారా? నా తండ్రికి వందల లేఖలు రాశాను.. తప్పేంటి?" అని కవిత ప్రశ్నించారు. సాధారణంగా కేసీఆర్ లేఖను చదివాక చించేస్తారని తెలిపారు. ఈసారి అలా చింపలేదని, కుట్ర ఎవరు చేశారో తనకు తెలియదని అన్నారు. ఈ విషయం బయటపెట్టాలని కోరుతున్నానన్నారు. దామోదర్‌రావు, గండ్ర మోహన్‌రావు వచ్చి తనను కలిశారని, వాళ్లిద్దరూ ఎవరికి దగ్గరో తెలుసు కదా! అని వ్యాఖ్యానించారు. ఇతర నేతల అంశంలో స్పందించిన పార్టీ.. తన విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ బలహీనమైతే కాంగ్రెస్, బీజేపీలకు లాభం చేకూరుతుందన్నారు. ఇక బనకచర్ల ప్రాజెక్టు పేరిట గోదావరి జలాలను తరలించుకు పోయేందుకు ఏపీ సీఎం చంద్రబాబు కుట్రలు చేస్తున్నా కేంద్రం అడ్డుకోవడం లేదని కవిత ఆరోపించారు. ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందన్నారు. కనీసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమైనా దీనిని అడ్డుకునే ప్రయత్నం చేయాలన్నారు.

కాంగ్రెస్ మునిగిపోయే పడవ..

తాను కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నించాననడం అబద్ధమని కవిత అన్నారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ చేతకానితనం, రాహుల్‌గాంధీ అసమర్థత వల్లే కేంద్రంలో బీజేపీ మళ్లీ మళ్లీ గెలుస్తోందన్నారు. కాంగ్రెస్ మునిగిపోయే పడవ అని, అందులో చేరాల్సిన అవసరం తనకు లేదని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానంతో తాను 2013లో మాట్లాడానని, ఆ తర్వాత ఎప్పుడూ ఆ పార్టీతో టచ్‌లోకి వెళ్లలేదని చెప్పారు. తన పార్టీ బీఆర్ఎస్ అని, తన నాయకుడు కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, అందులో ఎలాంటి అనుమానం లేదని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి తన తండ్రి తనకు హీరో అని, ఇతర నేతల నాయకత్వంలో తాను పని చేయనని కవిత స్పష్టం చేశారు. కేసీఆర్‌ను ఎప్పుడు కలిసేది చెప్పలేనని, దీనికి డెడ్‌లైన్ ఏమీ లేదని అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై ప్రశ్నించగా.. 'అంకుల్ ఏదో రాస్తున్నారు. రాయనివ్వండి' అని వ్యాఖ్యానించారు.

కవిత వెంట మల్లారెడ్డి!

మేడ్చల్: ఎమ్మెల్సీ కవిత వ్యవహారం బీఆర్ఎస్‌లో సంచలనం సృష్టిస్తుండగా.. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం కవితతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా తూంకుంట మునిసిపల్ పరిధిలోని సేవాలాల్ తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ 3వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, "కేసీఆర్ పులి.. కవిత పులిబిడ్డ. పెద్ద మనిషి వచ్చినప్పుడు కార్యక్రమానికి రావాలి కదా!" అని అన్నారు.

పెద్ద ప్యాకేజీ ఇస్తే మావాళ్లు బీఆర్ఎస్‌లో కలిసిపోతారు

» విలీనంపై కవిత మాటలు నిజమే

» బీజేపీ నేతరాజాసింగ్ వ్యాఖ్యలు

» బీజేపీ కుట్రలు చేయదు : ఈటల



హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, వికారాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): పెద్ద ప్యాకేజీలు ఇస్తే మా నేతలు బీఆర్ఎస్‌లో కలిసిపోతారంటూ బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ గురువారం సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడింది నిజమేనని అన్నారు. కవిత వ్యాఖ్యలపై స్పందించిన రాజాసింగ్ తన సొంత పార్టీ నేతలపైనే తీవ్ర ఆరోపణలు చేశారు. . పెద్ద ప్యాకేజీ వస్తే బీజేపీ నేతలు బీఆర్ఎస్‌తో కలిసిపోతారని అన్నారు. ఒక వేళ బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోతే వచ్చే ఎన్నికల్లో మావాళ్లు ఎక్కడ నుంచి పోటీ చేయాలో బీఆర్ఎస్ వాళ్లే నిర్ణయిస్తారని రాజాసింగ్ పేర్కొన్నారు. ఇంతకు ముందు ఇదే జరిగిందని, దానివల్లే బీజేపీ నష్టపోయిందని చెప్పారు. తమ నాయకులు కుమ్మక్కవుతుండడం వల్లే ప్రతీ ఎన్నికల్లో బీజేపీ నష్టపోయిందని, లేదంటే ఎప్పుడో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయ్యేదని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎందుకు అధికారంలోకి రాలేదో పార్టీ ఆలోచన చేయాలని కోరారు. ఇతర పార్టీలతో తమ నేతలు కుమ్మక్కవ్వడం వల్ల బీజేపీ చాలా నష్టపోయిందని ఆరోపించారు. పార్టీ కార్యకర్తలకూ ఈ విషయం తెలుసునని, ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తే సస్పెండ్ చేస్తారనే భయంతో అంతా నోరు మూసుకుని ఉంటున్నారని తెలిపారు. కాగా, బీజేపీ కుట్రలు, కుతంత్రాలు చేసే పార్టీ కాదని ఎంపీ, పార్టీ జాతీయ కార్యవర్గసభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్‌ను, బీజేపీలో విలీనం చేసేందుకు కుట్రలు జరిగాయంటూ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణపై ఆయన స్పందిస్తూ, బీజేపీ ప్రజాస్వామిక పార్టీ అని, స్ట్రెయిట్ ఫైట్ చేస్తుంది తప్ప, స్ట్రీట్‌ఫైట్ చేయదు అని స్పష్టం చేశారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేయబోతున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందిస్తూ, ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. నేతల మధ్య కంచెలు నాటింది కేసీఆర్ అయితే, దానిని సీఎం రేవంత్ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. బాధ్యతాయుత ఎంపీగా, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఏర్పాటుచేసిన విచారణ కమిషన్ ఎదుట హాజరవుతానని ఈటల తెలిపారు. ఇక, కేసీఆర్ కూతురు కాంగ్రెస్‌లోకి వెళుతుందని, కుమారుడు బీజేపీలోకి వస్తున్నాడని ఫోన్లు వస్తున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. రియల్ ఎస్టేట్, కాళేశ్వరం కుంభకోణాలు చేసిన వారికి బీజేపీలోకి ప్రవేశం లేదని చెప్పారు. కేసీఆర్ కుమారుడు వస్తే.. బీజేపీ గేటు బయట కాళ్లూ చేతులు విరగ్గొట్టి పంపిస్తామన్నారు. వికారాబాద్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకుంటామని, పార్టీలో తనవారంటూ ఎవరూ లేరన్నారు.

ఇలాంటోళ్లు.. రాష్ట్రాన్నేం పాలిస్తారు?

» కల్వకుంట్ల కుటుంబం కొత్త సినిమా చూపిస్తోంది: యెన్నం

» ఆస్తి తగదాల్లో రాజకీయం: అనిరుధ్‌రెడ్డి

» వాళ్లవి గాలి మాటలు: రామ్మోహన్ రెడ్డి

» కేసీఆర్ రంగు బయటపడింది: శ్రీనివాస్

హైదరాబాద్/జగిత్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి): సొంత కుటుంబాన్నే మేనేజ్ చేయనోళ్లు.. రాష్ట్రాన్ని ఏం పాలిస్తారు...? అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. కొడుకు బిడ్డల కోసం కేసీఆర్ ఉద్యమకారుల గొంతు కోశారని.. కేకే, మహేందర్ రెడ్డి లాంటి నేతలను ఫ్యామిలీ కోసమే ఆనాడు బయటికి పంపారన్నారు. తెలంగాణ ప్రజలకు కల్వకుంట్ల కుటుంబం కొత్త సిన్మా చూపిస్తోందని, అధికార దాహంతో కుటుంబ సభ్యులే ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షకు మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అనంతరం యెన్నం మాట్లాడుతూ.. 'ఉద్యమకారులను బయటికి పంపడంలో ఎమ్మెల్సీ కవిత పాత్ర ఉంది. కేటీఆర్ పాలనకు అనర్హుడని సొంత చెల్లెలే అంటుంటే, ఇక బీఆర్ఎస్‌లో ఏం మిగిలింది. కేవలం అధికారం కోసమే కేసీఆర్ రాజకీయాలు చేస్తున్నారు. అందుకే మళ్లీ ఆయనకు అధికారం అప్పగించేందుకు ప్రజలు సిద్ధంగా లేరు' అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని గత ఎన్నికల్లోనే రుజువైందని, కొత్తగా కవిత చెప్పాల్సిందేమి లేదన్నారు. ఆస్తి తగాదాలను కూడా రాజకీయం చేశారని దుయ్యబట్టారు. అడ్డగోలుగా సంపాదించుకుని, వాటాల పంచాయితీ చేసుకునే కేసీఆర్ కుటుంబానికి కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి లేదని మరో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవిత పార్టీ మారడమనేది ఆమె ఇష్టమని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎవరికైనా ఇంట్లో, పార్టీలో అంతర్గత కలహాలు సహజమని చెప్పారు. అయితే ఆమెతో పార్టీ మారేందుకు ఎమ్మెల్యేలు అంగట్లో సరుకులు కాదని.. కవిత కూడా పార్టీ మారకపోవచ్చన్నారు. ఢిల్లీకి పోవడానికి సీఎం రేవంత్ రెడ్డి గాలిమోటరు కొంటున్నారని బీఆర్ఎస్ నేతలు గాలిమాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఆనాడు జాతీయ రాజకీయాలు చేస్తామని దేశమంతా ప్రత్యేక విమానాలు వేసుకుని మరీ తిరిగిన రోజులు మరిచిపోయారా అంటూ బీఆర్ఎస్ నేతలను నిలదీశారు. కవిత వ్యాఖ్యలతో కేసీఆర్ అసలు రంగు బయటపడిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఓ ప్రకటనలో విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఏకమై కాంగ్రెస్‌ను దొంగ దెబ్బతీయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని సీఎం మొదటి నుంచి చెబుతున్న మాట నిజమైందని పేర్కొన్నారు. పార్టీ పేరు మార్చుకున్నప్పుడే తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్‌కు పేగు బంధం తెగిపోయిందన్నారు.

మంత్రుల నియోజకవర్గాలకే ఎక్కువ నిధులా?

మంత్రులు తమ నియోజక వర్గాలకే ఎక్కువ నిధులు తీసుకెళ్తున్నారని మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లారు. తమ నియోజక వర్గాలకు కూడా ఎక్కువ నిధులివ్వాలని ఆమెను కోరారు. అంతకుముందు సమీక్షలో నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కేటాయింపుపై వారు చర్చించారు.

కారులో భారీ కుదుపు!

» స్వరం పెంచిన కేసీఆర్ తనయ కవిత

» కేటీఆర్, హరీశ్, సంతోష్‌పై పరోక్ష విమర్శలు

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): అధినేత కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కవిత వ్యవహారంతో కొద్దిరోజులుగా ఇరకాటంలో పడ్డ బీఆర్ఎస్.. గురువారం కుదుపునకు గురైంది. మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కవిత చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీని మరింత ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టాయి. ఒకరకంగా చెప్పాలంటే పార్టీ ఒక భయంకరమైన, నిశ్శబ్ద వాతావరణంలోకి వెళ్లిపోయింది. కవిత చేసిన వ్యాఖ్యలపై ఏ ఒక్క నేత కూడా నోరు మెదపలేని పరిస్థితి నెలకొంది. ఇన్ని రోజులూ పార్టీలోని అంతర్గత విషయాలు బయటకు వస్తే విపక్షాలు, మీడియా, తెలంగాణ ద్రోహులపై నెట్టేసే నాయకత్వానికి.. ఇప్పుడు ఆ అవకాశం లేకుండాపోయింది. అంతర్గతంగా కూర్చొని చర్చల ద్వారా సంక్షోభాన్ని పరిష్కరించుకునే పరిస్థితి లేకుండాపోయింది. గత శుక్రవారం కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ కవిత ఘాటు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఆమె మరింత స్వరం పెంచారు. ఇప్పటిదాకా వ్యక్తిగతంగా విమర్శలు, ఆరోపణలు చేయని ఆమె గురువారం అధినేత కేసీఆర్ మినహా.. కేటీఆర్, హరీశ్‌రావు, జోగినిపల్లి సంతోష్‌కుమార్ సహా ముఖ్యనేతలందరినీ టార్గెట్ చేశారు. పెయిడ్ సోషల్ మీడియా ద్వారా, విదేశాల్లో ఐటీ సెల్ ఏర్పాటు చేసుకొని తనపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. అయితే ఇటువంటి ఐటీ సెల్స్ కేటీఆర్‌కే ఉన్నాయని ప్రస్తుతం పార్టీ సోషల్ మీడియా మొత్తాన్ని కేటీఆరే మేనేజ్ చేస్తున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఆమె వ్యాఖ్యల్లో ఎక్కువగా తన అన్న కేటీఆర్‌కే తగిలేవిగానే ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ఇక బీజేపీ నాయకుడి ఆస్పత్రిని ప్రారంభించిందెవరో చెప్పాలంటూ పరోక్షంగా హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. కడుపులో విషం పెట్టుకుని, బయటకు తియ్యగా మాట్లాడే అలవాటు కొందరికి ఉందంటూ జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నట్లు పార్టీలో ఓ సీనియర్ నేత విశ్లేషించారు.

పార్టీ నడుస్తున్న తీరును కూడా కవిత తీవ్రంగా తప్పుబట్టారు. పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో పసలేదని ఎత్తిపోడిచారు. అదే సమయంలో బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేసేందుకు కొన్ని శక్తులు యత్నిస్తున్నాయన్నారు. అన్నింటికన్నా కవిత చేసిన ఈ ఆరోపణ దుమారం రేపుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, త్వరలో కలిసిపోతాయంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చేలా కవిత వ్యాఖ్యలు ఉన్నాయి. దీంతో బీఆర్ఎస్ ఎప్పటికైనా బీజేపీలో విలీనమవుతుందని ఆమె పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లయిందని గులాబీ శ్రేణులు అంటున్నాయి. అంతేకాకుండా.. కవిత తాజా వ్యాఖ్యలు పార్టీ పెద్దలకు, ఆమెకు మధ్య మరింత దూరం పెంచాయని, భవిష్యత్తులో మళ్లీ దగ్గరయ్యే అవకాశాలు కూడా కనుచూపు మేరలో కనిపించడం లేదని పార్టీలో ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. పార్టీలో అంతా బాగుందన్న వాతావరణం లేకుండాపోయిందని అన్నారు. ఇప్పటిదాకా అధికార కాంగ్రెస్‌పై చేసిన పోరాటం, ప్రభుత్వంపై పెంచిన వ్యతిరేకత కూడా ఒక్క అంశంతో గాలికి పోయిందని గులాబీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.



కవితలో ఇంత ఆవేదన ఉందని.. ఇవాళే తెలిసింది: వినోద్‌కుమార్

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ స్పందించారు. కవితలో ఇంత ఆవేదన ఉందని ఇవాళే తెలిసిందని, ఆమెతో స్వయంగా మాట్లాడే ప్రయత్నం చేస్తానని అన్నారు. రాజకీయాల్లో ప్రకంపనలు సహజమని, చాలా పార్టీల్లో ఇలాంటివి చూశామని వ్యాఖ్యానించారు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయన్నారు.

కేసీఆర్ ఏం నిర్ణయం తీసుకుంటారో?

అసలు బీఆర్ఎస్‌లో ఏం జరగబోతుందో, కవిత విషయంలో అధినేత కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారో, ఈ సంక్షోభం నుంచి పార్టీని అధినేత ఎలా గట్టెక్కిస్తారోనని పార్టీ అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. అయితే ఒకటి రెండు రోజుల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని సీనియర్ నేత ఒకరు అన్నారు. మరోవైపు కేసీఆర్ ఇంతవరకు కవితతో మాట్లాడలేదు. కేవలం ఇద్దరు దూతలను పంపించగా.. వారు ఎవరి మనుషులో అందరికీ తెలుసునంటూ కవిత వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో కవితకు షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని పార్టీలో ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని ఒక వర్గం అంటుండగా.. మరో వర్గం కేసీఆర్ అంత కఠిన నిర్ణయం ఇప్పటికిప్పుడు తీసుకోరనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే కవిత అంశం విపక్షాలకు ఒక ఆయుధంగా మారిందని బీఆర్ఎస్ నేతలు విశ్లేషిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే.. గురువారం మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తన కుటుంబాన్నే మేనేజ్ చేసుకోలేని కేసీఆర్.. రాష్ట్రాన్ని ఏం పాలిస్తారని వ్యాఖ్యానించారు. ముమ్ముందు సరిగ్గా ఇటువంటి సూటిపోటి విమర్శలే అటు పార్టీకి, ఇటు కేసీఆర్ కుటుంబానికి ఎదురవుతుంటాయని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా.. సోషల్ మీడియాలో ఆ పార్టీ కార్యకర్తల మధ్య ఫ్యాన్ వార్ మొదలైంది. అన్నా చెల్లెళ్లు కేటీఆర్, కవితల అభిమానులు రెండుగా చీలిపోయి.. పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.